# పోతనామాత్య భాగవత పరిచయము

## 2 ద్వితీయ స్కంధము




భాగవత గణనాధ్యాయి

ఊలపల్లి సాంబశివరావు



http.telugubhagavatam.org

ఉ.

ఎండిన మ్రోడులే కిశలయించెనొ!యేకశిలాపురమ్ములో


బండలు పుల్కరించెనొ! అపార ముదమ్మున తెల్గు తల్లికిన్

గుండెలు పొంగిపోయి కనుగొల్కులునిండెనొ!పచ్చిపైరులే

పండెనొ జాలువారిన! భవత్కవితామృత భక్తిధారలన్!

–కరుణశ్రీ

# పోతనామాత్య భాగవత పరిచయము
## ద్వితీయ స్కంధము
## Potanamatya Bhagavata Parichayam 2



సౌజన్యము :
https: //telugubhagavatam. org/

Potanamatya Telugu Bhagavatam Parichayam
Part. : 2 e – book

May : 2021

Compilation : Bhagvata Gananadhyayi
Idea & Forming: P.. Sambasiva Rao

Price : For Free Distribution

Available from:

kinege. com
teluguthejam. com
telugubhagavatam. org.

# ఏకాదశ స్కంధము
## భూమిక

: : చదువుకుందాం భాగవతం; బాగుపడదాం మనం అందరం : :

**రచన**

. . . భాగవత రచనకు ప్రేరకులు నారదమునీశ్వరులు.
. . . భాగవతానికి మూలకర్త వ్యాసభగవానులు.
. . . తెలుగు సేతకు ప్రేరకులు శ్రీరామచంద్రులు.
. . . తెలుగు ప్రణీతము బమ్మెర పోతనామాత్యులు.

ఈ మహాపురాణనికి సంస్కృత మూలకర్త వ్యాసభట్టారకులు.. వీరు వేదాలను విభాగించారు, మహాభారతాన్ని మరియు సమస్త పురాణాలను ఆ మహానుభావుడే రచించారు.. వాటిలో ఉత్కృష్టమైనది శ్రీమద్భాగవతం.. వీరి జీవిత కాలాన్ని నిర్ణయించడం కష్టం.. 5000 సంవత్సరాల కంటెను ముందటి వారు అన్నది నిర్వివాదాంశం.. అట్టి శ్రీమద్భాగవత మహాపురాణం భగవంతుని గురించి, భాగవతుల గురించి చెప్తుంది.. సద్యోముక్తి సాధన మిది.. పన్నెండు స్కంధాలుగా అనుగ్రహింప బడిన ఈ మహామహితాత్మక గ్రంథంలోని ద్వితీయ స్కంధం యిది.. మన పోతన్న గారి మధురాతి మధుర ప్రణీతము.

శ్రీమద్భాగవతాన్ని మన పోతన్నగారు ఆంధ్రీకరించిన శైలి ఆబాలగోపాలానికి, పండిత పామరు లందరికి చవులూరించేటంత మధురాతి మధురం.. ఆ మహానుభావుడు మహేశ్వరుని ధ్యానిస్తూ, పవిత్ర గంగానదీ తీరాన కూర్చుని ఉండగా.. శ్రీరాముడు దర్శనమిచ్చి భాగవతమును తెనిగించ మన్నాడట.. షష్ఠ్యంతాలలో శ్రీకృష్ణునికి అంకితంగా పూనుకొన్నాడట.. మరి శంకరునిలా శుభకరం, రాముని మాటలా తిరుగులేని అండ నిస్తూ, మధురాధిపతిలా మధురంగా ఉంటూ, ఆధ్యాత్మిక సాఫల్యాన్ని అందించేది కాకుండా ఎలా పోతుంది.. ఇక్కడి తత్వం హరిహరాది అబేధం, ఎంతటి నిష్టాగరిష్ఠుడు మన పోతన అంటే రాజదండన కైనా వెరువక సాగే ధీరుడు.. హాలం, కలం ఆత్మాభిమానం వదలని త్రివిక్రముడు..

లోకంలో ఈ విషయంలో ఒక కథ ప్రచారంలో ఉంది.. సత్యాసత్యాలు పక్కన పెట్టి చూస్తే, ఒకసారి తన బావమరిది, శ్రీనాధకవి వచ్చి భాగవతాన్ని రాజుకి అంకిత మిమ్మని ఒత్తిడి చేస్తున్న సందర్భంలో పొలంనించి అప్పుడే వచ్చిన పోతన్నగారు ద్వైధీభావం చెందబోయారుట.. అంతలో వాణి కన్నీరు కార్చుతూ కనిపించింది.. అప్పుడు ఇలా సమాధానపరచారట మహానుభావుడు:

*కాటుక కంటి నీరు చనుకట్టు పయింబడ నేల యేడ్చెదో*
*కైటభదైత్యమర్దనుని గాదిలి కోడల! యో మదంబ! యో*
*హాటకగర్భురాణి! నిను నాకటికిం గొనిపోయి యల్ల క*
*ర్ణాట కిరాట కీచకుల కమ్మ త్రిశుద్ధిగ నమ్ము భారతీ!*

**ద్వితీయ స్కంధము**

ఈ స్కంధంలో మోక్ష మార్గమును, భక్తిమార్గ ప్రాధాన్యత, శ్రీహరి లీలావతారాల వర్ణన, ప్రపంచోద్భవాది సంప్రశ్నములు వివరించబడ్డాయి.. మరొక చోట తనకు ముహూర్తమాత్రమే ఆయుశ్శేషం ఉందని తెలిసిన ఖట్వాంగ మహర్షి వైరాగ్యం ఎంతో చక్కటి పద్యంలో వర్ణించారు.

*గిరులంబోలెడి కరులను,*
*హరులం, దన ప్రాణదయితలై మనియెడి సుం*
*దరులను, హితవరులను, బుధ*
*వరులను వర్జించి గాఢవైరాగ్యమునన్.*

*నిరుత్తరుండు గాక సదుత్తరప్రదాన కుతూహలుండైన లోకోత్తర గుణోత్తరుం డైన తాపసోత్తముని ప్రార్ధన*

*తపములఁ జేసియైన, మఱి దానము లెన్నియుఁ జేసియైన, నే*
*జపములఁ జేసియైన ఫలసంచయ మెవ్వనిఁ జేర్పకున్న హే*
*యపదములై దురంతవిపదంచితరీతిగ నొప్పుచుండు న*
*య్యపరిమితున్ భజించెద నఘౌఘనివర్తను భద్రకీర్తనున్.*



# ద్వితీయ స్కంధము – వృత్తాలవారీ సంఖ్యలు

వృత్తాల వారీ పద్యాల లెక్క
*పద్యగద్యలు = 288; +తేసీతో 36;. +ఆసీతో 11;* ***మొత్తం = 335***

| | | |
|---|---|---|
| పద్యం ఛందోప్రక్రియ | = | ద్వితీయ స్కంధ సంఖ్య |
| వచనం. | = | 82 |
| కంద పద్యం. | = | 68 |
| సీస పద్యం. | = | 47 |
| తేటగీతి సీసంతో. | = | 36 |
| మత్తేభం. | = | 41 |
| చంపకమాల. | = | 19 |
| ఉత్పలమాల. | = | 10 |
| ఆటవెలది. | = | 6 |
| తేటగీతి. | = | 5 |
| శార్దూలం. | = | 7 |
| ఆటవెలది సీసంతో. | = | 11 |
| తరలం. | = | 1 |
| మాలిని. | = | 1 |
| గద్యం. | = | 1 |
| ***మొత్తం*** | = | ***335*** |

ఇలాంటి అద్భుత రచనాశైలి, వస్తువు గల ద్వితీయ స్కంధమును ఆస్వాదిద్దాం రండి.. అంతే కాదు విష్ణువు అంటే వ్యాపకశీలుడు.. ఆ విష్ణు మాయా వ్యాపక తత్వాన్ని దర్శించేది ద్వితీయ స్కంధం అంటారు.

## సంకలన కర్త

ఊలపల్లి వంశంలో తల్లి వెంకటరత్నంగారు తండ్రి అచ్యుత రామయ్య గారలకు 1949లో జన్మించాను.. నన్ను సాంబశివరావు అంటారు.. భాగవత గణనాధ్యాయి అని కలంపేరు.. ఎలక్ట్రికలు ఇంజనీరుగా ఎమ్. ఇ. ఎస్. , రాష్ట్ర విద్యుత్ సంస్థలలో పనిచేసాను.. 2007లో పదవీ విరమణా నంతరం ఈ భాగవత కార్యక్రమం, గణనాధ్యాయం అని భావగ్రహణం (conceptualisation) చేసికొని, ఆ ప్రయత్నంలో భాగంగా ఈ తెలుగు భాగవతం యూనీకోడీకరించాను.. అందుకే



## కృతజ్ఞతలు

ఈ కృషికి ఉపయోగపడిన వివిధ పుస్తకముల రచయితలకు, ప్రచురణకర్త లకు, సహకరించిన ప్రోత్సహించిన మిత్రులకు, ఇతర వ్యక్తులకు, అంతర్జాల సంస్థ లకు.. మా తెలుగుభాగవతం జాలగూడు మున్నగునవి నిర్మించుట, నిర్వహించుట, ప్రతి పద్యగద్యకు గాత్ర ప్రదానం మున్నగు పనులకు తమ అమూల్య సమయాన్ని కేటాయించిన వారికి, అంతులేని సహకారం అందించిన కుటుంబ సభ్యులకు అందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు.

ఊలపల్లి సాంబశివ రావు,
భాగవత గణనాధ్యాయి.
తెలుగుభాగవతం. ఆర్గ్

విషయ సూచిక
ద్వితీయ స్కంధము


ఉపోద్ఘాతము ............................................1

శుకుని సంభాషణ ........................................1

భాగవతపురాణ వైభవం ................................. 2

ఖట్వాంగు మోక్ష ప్రకారం ................................ 2

ధారణా యోగ విషయం ................................. 3

విరాట్స్వరూపము తెలుపుట .............................. 4

తాపసుని జీవయాత్ర .................................... 7

సత్పురుష వృత్తి ........................................... 9

సృష్టి క్రమం ............................................. 11

అన్యదేవభజన ఫలం ......................................13

మోక్షప్రదుడు శ్రీహరి .....................................14

హరిభక్తిరహితుల హేయత ...............................14

రాజ ప్రశ్న ..............................................17

శుకుడు స్తోత్రము సేయుట ...............................18

నారదుని పరిప్రశ్న .....................................21

బ్రహ్మ అధిపత్యం బొడయుట .......................... 23

లోకములు పుట్టుట ................................... 25

నారయ కృతి ఆరంభం ................................ 29

పరమాత్ముని లీలలు ................................. 32
అవతారముల వైభవము............................. 33
నరనారాయణావతారం ............................. 35
మత్స్యావతారం ..................................... 38
రామావతారం ........................................ 40
కృష్ణావతారం ....................................... 44
గోవర్ధనగిరి ధారణ ................................ 48
భాగవత వైభవం .....................................51
ప్రపంచాది ప్రశ్న ..................................... 54
శ్రీహరి ప్రధానకర్త .....................................57
వైకుంఠపుర వర్ణన .................................. 59
బ్రహ్మకు ప్రసన్నుడగుట ............................ 63
మాయా ప్రకారం ..................................... 65
భాగవత దశలక్షణములు............................ 66
నారాయణుని వైభవం ............................. 68
శ్రీహరి నిత్యవిభూతి ................................. 69
శౌనకుడు సూతు నడుగుట ......................... 74
పూర్ణి ....................................................75

# పోతనామాత్యునిభాగవతం పరిచయము
## ద్వితీయస్కంధము

ఉపోద్ఘాతము

1. శ్రీమద్భక్త చకోరక
   సోమ! వివేకాభిరామ! సురవినుత గుణ
   స్తోమ! నిరలంకృతాసుర
   రామా సీమంతసీమ! రాఘవరామా!

భక్తులు అనెడి చకోర పక్షులకు చంద్రుని వంటివాడా! వివేకముతో విలసిల్లు వాడా! దేవతలచేత పొగడబడిన సుగుణములు గలవాడా! (రాక్షసులను సంహరించి) రాక్షస స్త్రీల పాపిట సింధూరాలంకరణలు తొలగించిన వాడ! రఘు వంశోద్భవుడ వైన శ్రీరామచంద్రప్రభూ! అవధరింపుము. 2 ఉన్నత గుణశీలురలో అగ్రేసరులైన ఆ మునీశ్వరులను చూసి సమస్త పురాణాల ప్రవచనోత్తముడైన సూతమహర్షి ఈ విధంగా చెప్పసాగాడు.. "ఆ విధంగా ప్రాయోపవేశం చేసిన పరీక్షిన్మహారాజుతో శుక మహర్షి ఈ విధంగా చెప్పాడు.

శుకుని సంభాషణ

3.. "ఓ పరీక్షిత్తు మహారాజా! ఇప్పుడు నీవడిగిన ప్రశ్న చాలా సమంజసమైనది.. దీనిని ఆత్మతత్త్వం తెలిసిన వాళ్లు మెచ్చుకుంటారు.. ఇది సమస్త శుభాలను సమకూరుస్తుంది.. లోకంలో వినదగిన విషయాలు వేలకొలది ఉన్నాయి.. అందులో అతి ముఖ్యమైనది, గొప్పది యిది.. సంసారంలో మునిగి తేలుతున్న గృహస్థులకు ఆత్మతత్త్వం కొంచెము కూడా తెలియదు.. వాళ్లకు స్త్రీ సంగమం, నిద్రలతో రేయి అంతా గడచిపోతుంది.. పగలంతా కుటుంబ వ్యవహారాలతో సరిపోతుంది.. పశువులు, భార్యాబిడ్డలు, చుట్టాలు, శరీరము ఇత్యాది పరివార మంతటినీ నిజమని నమ్ముకొని జీవితం సాగిస్తూ, కడకు వాళ్లు కన్నుమూసి కాటిపాలవుతారు.. అంత్యకాల దుర్దశ తెలిసినా తెలియనట్లే ఉండిపోతారు.. 4.

కావున, సర్వాత్మకుఁడు, మ
హావిభవుఁడు, విష్ణుఁ, డీశుఁ డాకర్ణింపన్,
సేవింపను, వర్ణింపను,
భావింపను భావ్యుఁడభవ భాజికినధిపా!

కనుక, రాజేంద్రా! మోక్షమార్గంలో పయనించేవాడికి సమస్తానికి ఆత్మయైన వాడు, మహావైభవంకలవాడు, జగదీశ్వరుడైనవిష్ణువే భావించడానికి, సేవించడానికి, వర్ణించటానికి, ఆకర్ణించడానికితగినవాడు.

5.. లోకులందరికి సాంఖ్యయోగం మేలు చేకూరుస్తుంది.. ఏ యోగం వల్లనైనా లేక ధర్మాచరణతో నైనా సరే అవసానకాలంలో హరిని చింతించాలి.. జన్మ మెత్తినందుకు ఓ నరవరా! ప్రయోజనం అలా హరిని చింతించటమే. 6.. మహారాజా! నిర్మలబుద్ధి గల మహనీయులు విధి నిషేధాలు విడనాడి గుణరహితమైన పరబ్రహ్మమును ఆశ్రయించి మనస్సులో సదా మాధవుని గుణాలను మననం చేస్తుంటారు.

భాగవతపురాణ వైభవం

7.. నా తండ్రి యైన వ్యాసభగవానుడు ద్వాపరయుగంలో వేదతుల్యమైన భాగవతం నా చేత చదివించాడు.. నేను పరబ్రహ్మమందు లగ్నచిత్తుడనై భగవంతుని అవతారలీలలు నన్నాకర్షించడంవల్ల దీనిని పఠించాను.. నీవు పంకజాక్షుని పాదపద్మాలను ఆశ్రయించిన భక్తుడివి.. అందువల్ల నీకు భాగవతతత్త్వం తెలియపరుస్తాను.. మహారాజా! వినవయ్యా! భాగవత శ్రవణం వల్ల విష్ణువును సేవించాలనే బుద్ధి విశాల మవుతుంది.. మోక్షం కాంక్షించువాడికి ముక్తి లభిస్తుంది.. జన్మము, జర, మరణాది సంసార భయాలన్నీ సమసిపోతాయి.. వాసుదేవ నామ సంకీర్తనలే యోగిసత్తములకు ఉత్తమ వ్రతాలు. 8. విష్ణుదేవుని తెలుసుకోకుండా మత్తెక్కి సంసారములో సంవత్సరాల తరబడి పొరలాడుతూ సతమత మవుతుండే అవివేకి ముక్తి కెలా పోగలడు.. వాడు సంసారబంధం నుండి ఎన్నటికీ బయటపడలేడు.. ఇది నిజం.. ఓ రాజా! ఒక్క క్షణమైనా హరినామం స్మరిస్తే చాలు.. అది ముక్తిని ప్రసాదిస్తుంది.

ఖట్వాంగు మోక్ష ప్రకారం

9.. ఓ కౌరవరాజా! పరీక్షిత్తు! పూర్వం ఖట్వాంగు డనే రాజు భూమండలంలోని సప్తద్వీపాలనూ పరిపాలిస్తూ ఉండేవాడు.. ఇంద్రాదిదేవతలు యుద్ధంలో భీకరులైన రాక్షసుల చేతుల్లో ఓడిపోయి, ఆయన దగ్గరకు వచ్చి తమకు సాయపడమని ప్రార్థించారు.. ఆయన భూలోకం నుంచి స్వర్గలోకానికి వెళ్లి దానవరాజుల నందరినీ సంహరించాడు.. అప్పుడు దేవతలు సంతోషించి ఖట్వాంగుణ్ణి వరంకోరుకో మన్నారు.. "నేనెంత కాలం బ్రతుకుతానో చెప్పండి.. ఇదే నేను కోరే వరం, మరో వరం నా కక్కరలే" దన్నాడు ఆ మహానుభావుడు.. "నీకు ఆయువు ఇక ఒక ముహూర్తకాలమే ఉంది. " అని వేల్పు లన్నారు.. వెంటనే ఆ భూపాలుడు విమాన మెక్కి భూలోకానికి వచ్చాడు. 10. అలా వచ్చిన ఖట్వాంగ మహారాజు ప్రగాఢమైన వైరాగ్యంతో పర్వతాలవంటి ఏనుగులను, గుఱ్ఱాలను, ప్రాణప్రియాలైన సుందరాంగులను, సన్నిహితులను, హితులను, పండితశ్రేష్ఠులను పరిత్యజించాడు.

11. గోవిందనామకీర్తనఁ
గావించి భయంబు దక్కి ఖట్వాంగ ధరి
త్రీవిభుఁడు సూర గొనియెనుఁ
గైవల్యముఁ దొల్లి రెండు గడియలలోనన్.

అలా ముక్తసంగుడైన ఖట్వాంగుడు, పూర్వం, గోవిందనామ సంకీర్తనం చేసి భయరహితుడై రెండు గడియల్లోనే చక్కగా మోక్షం పొందాడు.

ధారణా యోగ విషయం

12. రాజేంద్రా! విను.. నీకు ఏడు రోజులు తర్వాత గదయ్యా మరణం.. ఆపాటి సమయంలో పరలోకసాధనమైన పరమశుభాన్ని ఆర్జించడానికి ఎంతో అవకాశం ఉంది.. అవసానకాలం సమీపించగానే భయపడకుండా దేహధారి యైన వాడు శరీరం, భార్యాపుత్రులు మొదలైన వాటిపైగల మోహమనే వృక్షాన్ని నిష్కామమనే ఖడ్గంతో తెగనరకాలి.. ఇల్లు వదలి పవిత్రమైన తీర్థజలాల్లో స్నానమాడుతూ ప్రశాంతమైన ఏకాంత ప్రదేశం చేరుకోవాలి.. అక్కడ శాస్త్రం విధించినట్లు దర్భలూ, జింకచర్మము, వస్త్రము పరచుకొని కూర్చోవాలి.. జగమంతా పవిత్రం చెయ్యగలదీ, అకార ఉకార మకారాలనే మూడక్షరాలతో కూడినది, బ్రహ్మ బీజమైన ఓంకారాన్ని మనస్సులో స్మరిస్తూ ఉచ్ఛ్వాస నిశ్వాసాలను వశపరచుకోవాలి.. ఆ పైన విషయాల వెంబడి పరుగిడే ఇంద్రియాలను బుద్ధి అనే సారథితో, మనస్సనే పగ్గంతో బిగబట్టి

నిగ్రహించాలి.. గట్టివైన కర్మబంధాలలో చిక్కుకొని ఊగిసలాడే చిత్తాన్ని ప్రజ్ఞాబలంతో నిరోధించి భగవంతుని మీద నిశ్చలంగా నిలపాలి.. విషయరహిత మనస్సుతో ఆ దేవుని కరచరణాదులైన అవయవాలను క్రమంగా ధ్యానం చేయాలి.. రజోగుణం చేత, తమోగుణం చేత ఆకర్షింపబడి మోహానికి లోనయ్యే మనస్సును, ఆ గుణాలవల్ల కలిగిన మాలిన్యాలను ధారణతో తొలగించి నిర్మలం చెయ్యాలి.. అలా చేసినవాడు సర్వోత్కృష్టమైన విష్ణుపదం చేరుతాడు.. ధారణా నియమం సిద్ధిస్తే ఆతడు సుఖమయమైన విషయాన్ని చూస్తాడు.. అట్టి యోగి భక్తిలక్షణమైన యోగాన్ని ఆశ్రయించి శ్రీఘ్రమే మోక్షం చూరగొంటాడు. ” ఈ విధంగా పలుకుతున్న శుకయోగీంద్రునితో పరీక్షిన్నరేంద్రుడు ఇలా అన్నాడు. 13. ”ధారణ ఎలా నిలుస్తుంది మహర్షీ! దాని స్వరూపం ఎట్టిది ధారణ అంటే ఏమిటి అది జీవుని చిత్తమాలిన్యాన్ని ఎలా పోగొడుతుంది దయచేసి నాకు తెలియపరచండి. ”14. ఆ మాటలు విని అవధూతలలో శ్రేష్ఠుడైన శుకుడు పరీక్షిత్తు మహారాజును జూసి ఇలా పలికాడు.

15. “పండితుడైనవాడు శ్వాసవాయువులను జయించి, సంసారం తోడి తగులం వదలిపెట్టి, ఇంద్రియాల గర్వమంతా అణచి బుద్ధిబలంతో మనస్సును విష్ణుదేవుని విశాల స్వరూపమునందు స్థిరంగా నిలపాలి.

### విరాట్స్వరూపము తెలుపుట

16. పరీక్షిత్తు విభుడా! విను, భగవంతుడైన విష్ణుని విరాటస్వరూపంలో జరిగిన, జరగనున్న, జరుగుతున్న ప్రపంచమంతా గోచరిస్తుంది.

4 భూమి, అగ్ని, వాయువు, ఆకాశము, అహంకారము, మహత్తత్త్వము అనే ఆవరణాలు ఏడూ మహాండకోశమైన విరాట్పురుషుని శరీరమై ఉన్నాయి.. ఆ శరీరంలో ధారణకు నెలవై విరాట్పురుషుడు ప్రకాశిస్తున్నాడు.



4 ఆ మహాత్ముడికి పాతాళం అరికాలు; రసాతలం కాలిమడమ మునివ్రేళ్ళు; మహాతలం చీలమండలు; తలాతలం పిక్కలు; సుతలం మోకాళ్ళు రెండు; వితలము అతలము తొడలు; భూతలం పిరుదు; ఆకాశం బొడ్డు; గ్రహాలూ తారకలూ మొదలైన జ్యోతిస్సమూహంతో కూడిన నక్షత్రలోకం వక్షస్థలం; మహర్లోకం మెడ; జనలోకం ముఖం; తపోలోకం నొసలు; సత్యలోకం శిరస్సు; ఇంద్రుడు మొదలైనవారు భుజదండాలు; దిక్కులు చెవులు; శబ్దం శ్రోత్రేంద్రియం; అశ్వినీ దేవతలు ముక్కుపుటాలు; గంధం ఘ్రాణేంద్రియం; అగ్ని నోరు; అంతరిక్షం కళ్లు; సూర్యుడు నేత్రేంద్రియం;



4 రేయింబవళ్ళు కనురెప్పలు; బ్రహ్మపదం కనుబొమలు; జలాలు దవడలు; రసం జిహ్వేంద్రియం; సమస్త వేదాలు భాషణాలు; తుదిలేని సృష్టులే కడగంటి చూపులు; సిగ్గు, లోభం పెదవులు; ధర్మ మార్గాలు కడుపు; కొండలు ఎముకలు; నదులు నాడులు; చెట్లు రోమాలు; వాయువు నిట్టూర్పులు; కడలేని కాలమే ప్రాయం; పలువిధాలైన ప్రాణులతో గూడిన సంసారాలు కర్మలు; మబ్బులు శిరోజాలు; సంధ్యలు కట్టుబట్టలు; ప్రధానం హృదయం; చంద్రుడు వికారాలన్నింటికీ నెలవైన మనస్సు; మహత్తత్త్వం చిత్తం; రుద్రుడు అహంకారం; గుఱ్ఱాలు, కంచరగాడిదలు, ఒంటెలు, ఏనుగులు గోళ్ళు; పశువులు, మృగాదులు కటిప్రదేశం; పక్షులు చిత్రమైన మాటల నేర్పులు; మనువు బుద్ధి; పురుషుడు నివాసం; దానవులు వీర్యం.. అంతేకాదు.. ఆ మహాప్రభువునకు బ్రాహ్మణులు ముఖం; క్షత్రియులు బాహువులు; వైశ్యులు తొడలు; శూద్రులు పాదాలు; వసువులు, రుద్రులు మొదలైన పెక్కు దేవతల పేర్లే నామాలు; హవిర్భాగాలు ద్రవ్యాలు; యజ్ఞ ప్రయోగాలు కర్మలు అవుతున్నాయి.. ఇటువంటి విశ్వమయుడైన విరాట్పు రుషుని విగ్రహాన్ని మోక్షార్థి అయినవాడు తన మనస్సులో అనుసంధానం చేసుకోవాలి. ” అంటూ. ఇంకా ఈ విధంగా చెప్పసాగాడు శుకముని.

17. “హరిమయము విశ్వ మంతయు,
హరి విశ్వమయుండు, సంశయము పనిలే దా

హరిమయము గాని ద్రవ్యము
పరమాణువు లేదు వంశపావన; వింటే.

“కురు కులపావనుడ వైన రాజా! విశ్వమంతా విష్ణుమయం.. విష్ణువు విశ్వమయుడు.. ఇందులో సందేహం లేదు.. విష్ణుమయం కాని పదార్థం ఈ ప్రపంచంలో ఒక్క పరమాణువు కూడా లేదు.. వింటున్నావా!

18. కలలోన జీవుండు కౌతూహలంబునఁ–
బెక్కు దేహంబులఁ బేరువడసి,
యింద్రియంబుల వెంట నెల్లవృత్తంబులు–
నీక్షించి మఱి తన్ను నెఱుఁగు కరణి,
నఖిలాంతరాత్మకుఁడగు పరమేశ్వరుఁ–
డఖిల జీవుల హృదయముల నుండి
బుద్ధి వృత్తుల నెల్ల బోద్ధ యై వీక్షించు–
బద్ధుండు గాఁడు ప్రాభవము వలన,
సత్యుఁ డానంద బహుళ విజ్ఞానమూర్తి
యతని సేవింప నగుఁగాక, యన్యసేవఁ
గలుగనేరవు కైవల్య గౌరవములు
పాయ దెన్నఁడు సంసారబంధ మధిప!

రాజా! కలలు కనేటప్పుడు జీవుడు ఉబలాటంతో పలు శరీరాలు తాలుస్తాడు.. పలుపేర్లతో వ్యవహరింప బడతాడు.. ఇంద్రియాల ద్వారా విశేషాలన్నీ గమనిస్తాడు.. పిమ్మట మెళకువ వచ్చిన తరువాత, తన్ను తాను తెలుసు కుంటాడు.. ఇలాగే సమస్తానికి అంతరాత్మగా ఉన్న పరమేశ్వరుడు, సర్వ ప్రాణుల హృదయాలలో ఉండి ప్రజ్ఞావంతుడై బుద్ధివ్యాపారా లన్నింటినీ పరిశీలిస్తుంటాడు.. తానే అన్నిటికీ ప్రభువు కాబట్టి, దేనికీ బద్ధుడు కాడు.. తాను సత్యస్వరూపుడు.. ఆనందంతో నిండిన విజ్ఞానమూర్తి.. ఆయన సేవ వల్లే మోక్షం సిద్ధిస్తుంది.. ఇతరులను కొలిస్తే మోక్షం లభించదు.. ఈ సంసార బంధం వదలదు.

19. మహారాజా! పరీక్షిత్తు! పూర్వం ఆదిలో బ్రహ్మ జగత్తును సృష్టించాలనుకొన్నాడు.. పెక్కేండ్లు ప్రయత్నించాడు.. అయినా నేర్పరి కాలేకపోయాడు. ఆపైన ఏకాగ్రచిత్తంతో నారాయణుని ప్రార్థించాడు.. మహోన్నత మైన బుద్ధి వికాసం పొందాడు.. పిమ్మట ప్రాణి కోట్ల పుట్టుకను నిర్ణయించి జగన్నిర్మాణ దక్షుడై విహరించాడు.

తాపసుని జీవయాత్ర

20. సృష్టిలో అజ్ఞాని శబ్దప్రధానమైన వేదంలోని కర్మకాండ బోధించిన విధంగా నిరర్థకాలయిన స్వర్గాది సుఖాలలో లగ్నమౌతాడు.. నిద్రించేవాడు పూర్వ సంస్కారంతో కలలు కన్నట్లు మాయలో పరిభ్రమిస్తాడు.. అంతేకాని మోక్ష సుఖం పొందలేడు.. జ్ఞాని అలా కాదు.. అతడు శరీరధారణకు అవసరమైనంత మేరకే నిస్సారమైన భోగాలను స్వీకరిస్తాడు.. జాగరూకుడై మెలగుతాడు.. సంసారం సుఖ మనుకోడు.. దాని కతీతమైన త్రోవలో పయనిస్తేనే సిద్ధి కలుగుతుందని గుర్తించి అలా ప్రవర్తిస్తాడు.

21. కమనీయభూమిభాగములు లేకున్నవే–
పడియుండుటకు దూదిపఱుపు లేల?
సహజంబులగు కరాంజలులు లేకున్నవే–
భోజనభాజనపుంజ మేల?
వల్కలాజినకుశావళులు లేకున్నవే–
కట్ట దుకూల సంఘంబు లేల?
కొనకొని వసియింప గుహలు లేకున్నవే–
ప్రాసాదసౌధాది పటల మేల?
ఫలరసాదులు గురియవే పాదపములు;
స్వాదుజలముల నుండవే సకల నదులు;
పొసఁగ భిక్షము వెట్టరే పుణ్యసతులు;
ధనమదాంధుల కొలువేల తాపసులకు?

బుద్ధిమంతుల భావనలు ఇలా ఉంటాయి.. “పడుకోడానికి చక్కటి నేల ఉండగా, దూది పరుపు లెందుకు? పుట్టుకతో వచ్చిన చేతులు ఉండగా, ఇంకా కంచాలు గరిటలు ఎందుకు? నారచీరలు జింకచర్మాలు దర్భచాపలు ఉండగా, ఇంకా పట్టుబట్టలు అవి

ఎందుకు? చక్కగా ఉండటానికి గుహలు ఉండగా, మేడలు భవనాలు ఎందుకు? చక్కగా రసవంతమైన పళ్ళు కాసే చెట్లు, తియ్యటి మంచి నీటిని యిచ్చే నదులు, పుష్కలంగా భిక్ష పెట్టే పుణ్యస్త్రీలు ఉండగా, హాయిగా తపస్సులు చేసుకొనేవానికి, ధనమదంతో కన్నుమిన్ను కానని వాళ్లని ఎందుకు సేవించటం?" ముక్తికోరుతున్న పరీక్షిన్మహారాజునకు అవధూతోత్తముడు శుకబ్రహ్మ విరక్తి మార్గం చేపట్టి, తపస్సు చేసుకొనే జ్ఞానవంతుల ఆలోచనా సరళి జీవన విధానాలను ఇలా వివరించాడు.

22. రక్షకులు లేనివారల
రక్షించెద ననుచుఁ జక్రి రాజై యుండన్
రక్షింపు మనుచు నొక నరు
నక్షముఁ బ్రార్థింపనేల యాత్మజ్ఞులకున్?

దిక్కులేని వాళ్లకు దిక్కై రక్షిస్తానంటూ చక్రం ధరించే విష్ణుమూర్తి సిద్ధంగా ఉన్నాడు.. మరింకా ఆత్మజ్ఞానులు, ప్రాజ్ఞులు అయిన వారు ఎవరో అసమర్థుడైన మానవుణ్ణి ప్రాధేయపడటం అనవసరం కదా. "

ఇలా శుకబ్రహ్మ పరీక్షిత్తుకు విరాడ్విగ్రహం వివరించి భాగవత తత్వం చెప్పాడు.. 23. ఇలా భావించిన బుద్ధిమంతుడు స్వయంభువు, ఆత్మ స్వరూపుడు, ప్రియమైన వాడు, నిత్యుడు, సత్యుడు, భగవంతుడు అయిన వాసుదేవుణ్ణి సేవిస్తాడు.. ఆ సేవ వల్ల కలిగే ఆనందం అనుభవిస్తూ అతడు సంసార కారణ మైన అవిద్య నుండి విముక్తి పొందుతాడు. 24. ఓ రాజశ్రేష్ఠుడా! శ్రీహరిని చింతింపక మదోన్మత్త చిత్తుడై భోగయత్తుడై దినాలు గడిపేవాడికి యమభటుల గదలచేత వక్షస్థలం మొత్తించు కోవడం తప్పవు.. అతడు నరకద్వారం వద్ద వైతరిణీ నదిలోని భయంకర జ్వలన జ్వాలల్లో పడి మలమల మాడి పోతాడు. 25. భగవంతుని భజించని పాషండులను యమకింకరులు గదలతో మోదుతారు.. వాళ్ల శరీరాలను మంటలలో వేస్తారు.. వాళ్ల అవయవాలను కరకు కత్తులతో ముక్కలు ముక్కలుగా ఖండిస్తారు. 26. అంతేకాదు.. శ్రీ గోవింద చరణారవింద మకరంద మాధుర్యానికి విముఖులైన వాళ్ళు తమతమ కర్మబంధాల్లో తగుల్కొంటారు.. తత్ఫలితముగా యమమందిర ద్వారం వద్ద ప్రవహించే వైతరణీనదిలో భగభగమండే భయంకరాగ్ని జ్వాలలలో కాలిపోతున్న వారితో జతగూడుతారు; విశేష జ్ఞానసంపన్నులై జీవించే శరణాగతులు మాయకు లోబడక నేర్పుతో తమతమ హృదయాలలో భగవంతుని ధ్యానిస్తారు; ఆ భగవంతుడు

జానెడు కొలత గల దివ్యశరీరం కలవాడు; దిగ్గజాల తొండాలవలె పొడవైన నాలుగు చేతులు గలవాడు; చక్కదనంలో కోటి మన్మథులకు దీటైనవాడు; మందరగిరిని ధరించినవాడు; పున్నమనాటి చందమామ వంటి మోము కలవాడు; సౌభాగ్యానికి నెలవైన వాడు; ప్రాతఃకాలపు భానుబింబములాగా ప్రకాశించే పద్మరాగమణులు పొదిగిన కిరీటకుండలాలు తాల్చినవాడు; వక్షస్థలంలో శ్రీవత్సమనే పుట్టుమచ్చ కలవాడు; కమనీయకౌస్తుభరత్నం తాపిన కంఠాభరణం మెడలో అలంకరించు కొన్నవాడు; ఎప్పుడూ సువాసనలీనే వనమాలికతో ఒప్పారేవాడు; పలువిధాలైన పెద్దపెద్ద హారాలు; భుజకీర్తులు, కడియాలు, మురుగులు, మొలనూలు, ఉంగరాలు మొదలైన సొమ్ములతో శోభిల్లేవాడు; నొసట ముసురుకొన్న నిగనిగ లాడే నీలి ముంగురులు గలవాడు; కరుణామయమైన కడగంటి చూపులతో భ్రూవిలాసాలతో భక్తులపై పరమానుగ్రహం ప్రసరింప జేసేవాడు;

మహా యోగీశ్వరుల హృదయపద్మాలలో చివుళ్ళవంటి తన చరణాలు మోపిన వాడు; సదా ఆనందస్వరూపుడు; వేయి కోట్ల సూర్యుల సమాన ప్రకాశము కలవాడు; లోకాధిపుడు.. అట్టి పరమేశ్వరుణ్ణి విజ్ఞానసంపన్నులు ధారణతో చిక్కబట్టి ఆయన చీలమండలు, పాదాలు, మోకాళ్ళు, పిక్కలు మొదలైన అవయవాలలో ఒక్కొక్క దానిని క్రమంగా అనుక్షణం ధ్యానిస్తారు.. అచంచల పూర్ణభక్తియోగం సిద్ధించేవరకు ఆ పరమాత్ముని ధ్యానంలో నిమగ్నులై ఉంటారు." ఇలా చెప్పి శుకుడు మళ్ళీ ఈ విధంగా అన్నాడు. 27. రాజా! ప్రారబ్ధకర్మలు నశింపగా శరీరం త్యజించాలనుకొన్న యతి పుంగవుడు దేశకాలాలకోసం ఎదురు చూడడు.. ఆ భావన కలగగానే అతడు సుఖాసనాసీను డవుతాడు.. మనస్సుతో ప్రాణవాయువును నిగ్రహిస్తాడు.. మనోవేగాన్ని బుద్ధితో అరి కడతాడు.. బుద్ధిని క్షేత్రజ్ఞు డనబడే జీవాత్మతో పొందిస్తాడు.. జీవాత్మను శుద్ధాత్మలో చేరుస్తాడు.. శుద్ధాత్మను పరమాత్మలో లీనంచేస్తాడు.. అలా చేసి శాంతాత్ముడై కార్యాలు / కర్మలు అన్నింటినీ పరిత్యజిస్తాడు.. ఆపై నిత్యసుఖం కావాలని అభిలషిస్తాడు.

## సత్పురుష వృత్తి

28. రాజశేఖరుడా! విను.. పరమాత్మయైన బ్రహ్మమునకు తప్ప కాలానికి,
కాలప్రభావానికి లోబడ్డ బ్రహ్మాది దేవతలకు, సత్త్వరజస్తమస్సులనే త్రిగుణాలకు,
అహంకారానికి, మహత్తత్త్వానికి,సమస్త సృష్టికీ హేతుభూతమై ప్రధానమనబడే

ప్రకృతికీ అధిపత్యం లేదు.. అందుచేత పరమాత్మకు భిన్నమైన పదార్థమంటు ఏదీ లేదు.. సత్పురుషులు శరీరాదులపై ఆత్మభావన వదులుతారు.. ఇతర విషయాల మీద వ్యామోహం విడుస్తారు.. మహనీయములైన మాధవుని చరణారవిందాలను మనస్సులో అనుక్షణము నిల్పుకుంటారు.. విష్ణుసంబంధ మగు పరమపదమే అన్నింటికంటె ఉత్తమస్థానమని గ్రహిస్తారు.. ఈ రీతిగా శాస్త్ర జ్ఞాన బలము అనే మంటలో విషయవాసనలను తగులబెట్టి వారు దేని మీదా అపేక్ష లేకుండా ఉంటారు.
29. ఓ పురువంశపు రాజా! యోగి పాదమూలంతో గుదస్థానంలో ఉండే మూలాధారచక్రాన్ని అదిమి పడతాడు.. ఆ పైన ప్రాణవాయువును బిగబట్టి నాభిస్థానంవద్ద ఉండే మణిపూరక చక్రానికి తీసుకుపోతాడు.. అక్కడనుండి హృదయంలోని అనాహతచక్రానికి, అందుండి వక్షంలో ఉన్న విశుద్ధ చక్రానికి, అటునుండి ఆ చక్రాగ్రముండే తాలు మూలానికీ, ఆ తాలుమూలం నుండి కనుబొమ్మలమధ్య నున్న ఆజ్ఞా చక్రానికీ ప్రాణవాయువును తరలిస్తాడు.. అందుమీదట కళ్ళు, చెవులు, ముక్కు, నోరు మూసుకొని ఏ కోరికలు లేనివాడై అర్థముహూర్తకాలం ఇంద్రియాలతో ఏ మాత్రం సంబంధం లేకుండా ప్రాణాలను నిగ్రహిస్తాడు.. పిమ్మట బ్రహ్మ రంధ్రం భేదించుకొని పరబ్రహ్మంలో లీనమవుతాడు.
30. శరీరం విసర్జించేటప్పుడు ఇంద్రియాలతో సంబంధం వదలనివాడు వాటితో సహా గుణమయమైన బ్రహ్మాండంలో ఖేచరులు, సిద్ధులు, విహరించడానికి అనువైనది.

అణిమాదులైన ఐశ్వర్యాలన్నింటితో కూడినట్టి బ్రహ్మలోకం చేరుతాడు.. విద్య, తపస్సు, యోగం, సమాధులను అనుష్ఠించి లింగశరీరాన్ని వాయులీనం చేసిన యోగీశ్వరులు బ్రహ్మాండం లోపల, వెలుపల సంచరిస్తుంటారని పెద్దల మాట.. కర్మలతో ఎవ్వరూ అలాంటి స్థానం పొందలేరు.. బ్రహ్మలోకాభిముఖుడైన యోగి సుషుమ్నా నాడీ ద్వారం నుండి బయలుదేరి ఆకాశమార్గంలో పయనిస్తూ అగ్ని దేవతను చేరుకుంటాడు.. అక్కడ జ్యోతిర్మయమైన ప్రకాశంతో పుణ్యపాపాలు నశింపజేసుకొని నిర్మలుడై భాసిస్తాడు.. అతడు దేనిలోనూ తగుల్కొనడు.. నక్షత్రపథం గడచిపోతాడు.. ఆ పై సూర్యమండలం మొదలు ధ్రువమండలం వరకు మండలాలన్నీ వరుసగా దాటుకుంటాడు.. తుదకు విష్ణు సంబంధమైన శింశుమార చక్రం చేరతాడు.. అక్కడ ఒంటరిగా పరమాణు స్వరూపమైన లింగశరీరంతో బ్రహ్మవేత్తలు నివసించే మహర్లోకం ప్రవేశిస్తాడు.. మహా కల్పకాలం వరకు అందే

క్రీడిస్తాడు.. కల్పాంతంలో అనంతుని వదనమునుండి వెలువడే కరాళాగ్ని జ్వాలల్లో దగ్ధమయి పోతున్న త్రిలోకాలను చూస్తాడు.. అందువల్ల జనించే అగ్ని దాహం సహించలేక అక్కడనుండి బ్రహ్మలోకం చేరుకుంటాడు, అక్కడే నివసిస్తాడు. 31. నరేంద్రోత్తమా! భూలోకంలో పదునల్గురు మనువులు పుట్టి గిట్టే కాలమంతా కలిస్తే బ్రహ్మలోకంలో ఒక పగలు అవుతుంది.. అక్కడ మహనీయులైన సిద్ధుల విమానాలు సూర్యతేజంతో విరాజిల్లుతుంటాయి.. శోకం, వార్ధక్యం, మృత్యువు, కృశత్వం, భయం, దుఖం – ఇలాంటి బాధ లక్కడలేవు.. హరిచరణాలను ధ్యానించాలనే తెలివి లేక మూఢులైన వారి శోకస్థితిని బ్రహ్మలోకం నుండి గమనించవచ్చు.. శ్రేష్ఠులైన సిద్ధులూ, యోగులూ అమృతాప్రాయంగా సంభాషించుకోవడాన్ని చెవుల పండువుగా అక్కడ వినవచ్చు.. అలాంటి బ్రహ్మలోకంలో అతడు నివసిస్తాడు.. మళ్ళీ ఆ లోకంనుండి తిరిగి రానేరాడు.

సృష్టి క్రమం

32. ఇంకొక విశేషముంది వినుము.. గొప్ప పుణ్యం వల్ల బ్రహ్మలోకం చేరిన వారు మరొక కల్పంలో తమ తమ పుణ్యాల హెచ్చు తగ్గులను బట్టి ఆ యా అధికారాలను పొందుతారు.

బ్రహ్మ మొదలైన దేవతలను సేవించి శరీరత్యాగం చేసినవాడు ఆ బ్రహ్మ జీవించినంతకాలం బ్రహ్మలోకంలో నివసించి కడపట ముక్తి పొందుతారు.. శ్రీహరి పాదపద్మాలపై అత్యంత భక్తి కలిగి దేహం వీడినవారు స్వేచ్ఛతో నిరాటంకంగా పయనం సాగించి బ్రహ్మాండాన్ని భేదించుకొని అత్యున్నతమైన వైష్ణవస్థానం అధిష్ఠించి ప్రకాశిస్తారు.. ఈశ్వరు డధిష్ఠించిన ప్రకృతి అంశంతో మహత్తత్త్వం పుడుతుంది.. మహత్తత్త్వం అంశంతో అహంకారం పుడుతుంది.. అహంకారం అంశంతో శబ్దతన్మాత్ర పుడుతుంది.. శబ్దతన్మాత్ర అంశంతో (1) ఆకాశం పుడుతుంది.. ఆకాశం అంశంతో స్పర్శ తన్మాత్ర పుడుతుంది.. స్పర్శతన్మాత్ర అంశంతో (2) వాయువు పుడుతుంది.. రూపతన్మాత్ర అంశనుండి (3) అగ్ని పుడుతుంది.. అగ్ని అంశంతో రసతన్మాత్ర పుడుతుంది.. రసతన్మాత్ర అంశనుండి (4) జలం పుడుతుంది.. జలాంశం నుండి గంధ తన్మాత్ర పుడుతుంది.. గంధ తన్మాత్ర అంశతో (5) పృథ్వి పుడుతుంది.. వీటన్నిటి కలయిక వల్ల పదునాల్గు భువనాల స్వరూపమైన విరాట్రూపం ఉద్భవిస్తుంది.. ఆ రూపానికి కోటి యోజనాల విస్తీర్ణమైన అండకటాహమే (బ్రహ్మాండపు పైకప్పు) మొదటి ఆవరణమైన భూమి అవుతుంది..

కొందరు దీనిని ఏబదికోట్ల యోజనాల విశాలమని వర్ణిస్తారు.. ఈ ఆవరణం మీద జలం, తేజస్సు, వాయువు, ఆకాశం, అహంకారం, మహత్తత్త్వం అనే ఆరు ఆవరణాలున్నాయి.. అవి క్రమంగా ఒకదాని కొకటి పదేసి రెట్లు పెద్దవిగా ఉన్నాయి.

ఆ యేడావరణాల మీద ఎనిమిదవదైన ప్రకృత్యావరణం గొప్పగా వ్యాపించి ఉంది.. ఈ బ్రహ్మాండాన్ని భేదించుకొని విష్ణుపదం అధిష్ఠించినవాడు మరణాది భయరహితు డవుతాడు.. అతడు మెల్లగా లింగశరీరంతో పృథివీ తత్త్వం పొందుతాడు.. ఆ పృథివీ తత్త్వంలో ఘ్రాణేంద్రియంతో గంధాన్ని గ్రహిస్తాడు.. జలస్వరూపుడై రసనేంద్రియంతో రసాన్ని గ్రహిస్తాడు.. తేజోరూపుడై నేత్రేంద్రియంతో రూపాన్ని గ్రహిస్తాడు.. వాయు స్వరూపుడై త్వగింద్రియంతో స్పర్శాన్ని గ్రహిస్తాడు.. గగన స్వరూపుడై శ్రోత్రేంద్రియం తో శబ్దాన్ని గ్రహిస్తాడు.
అన్నింటినీ అతిక్రమించి ఆ యోగి ఆకాశాది పంచభూతాలకూ, సూక్ష్మేంద్రి యులకు లయస్థానమైన అహంకారావరణం చేరుకుంటాడు.. అక్కడ మనోమయము, దేవ మయము ఐన సాత్త్వికాహంకారంతో మహత్తత్త్వంతో ప్రవేశిస్తాడు.. ఆ పైని సత్త్వరజ స్తమోగుణాలు లయించిన ప్రకృతిని పొందుతాడు.. ఆ ప్రకృత్యాత్మకత్వంతో దేహాన్నీ, ఉపాధి పరంపరలన్నీ ముగిసిన పిమ్మట ప్రకృతినీ పరత్యజించి ఆనందమయు డవుతాడు.. ఆ ఆనందంతో పరమాత్మ స్వరూపమైన వాసుదేవ పరబ్రహ్మంలో లీనమవుతాడు. " ఈ విధంగా చెప్పి శుకుడు పరీక్షిత్తుతో ఇంకా ఇలా అన్నాడు. 33.

"కురురాజా! ఇది భాగవతోత్త ములు అనుసరించే మార్గం.. ఈ మార్గాన పయనించిన యోగి వందలకొలది కల్పాలు గడచినా మళ్ళీ తిరిగిరాడు.. ఇందుకు సందేహం లేదు. 34. సద్యోముక్తి, క్రమముక్తి అనే రెండు మార్గాలు నీవు అడిగావు.. ఇవి రెండూ వేదగీతలలో వివరింప బడ్డాయి.

పూర్వం బ్రహ్మ తనను ఆరాధింపగా భగవంతుడైన విష్ణువు ఆయనకు వీటిని బోధించాడు.. సంసారంలో ప్రవేశించిన వానికి తపస్సు, యోగం మొదలైన మోక్ష మార్గాలు ఎన్నో ఉన్నాయి.. అన్నింటి కంటే సులభమైనది భక్తి మార్గం.. 35. ఇది ఇంకా వివరంగా చెపుతాను వినుము.. పూర్వం బ్రహ్మ మనసులో మూడుసార్లు వేదాన్ని ధర్మపరాయణ దృష్టితో పరామర్శించాడు.. అలా పరామర్శించి భక్తితో తప్ప మరో మార్గాన మోక్షం లభించదని నిశ్చయించాడు.. ఆ మార్గాన్నే తరుణోపాయంగా

నిర్ణయించుకొని వికారానికి లోనుగాకుండా జనార్దనుని ఆత్మస్వరూపాన్ని భక్తితో ధ్యానించాడు.. 36.. జగదధిదేవుడు అయిన శ్రీమన్నారాయణుడు సమస్తప్రాణులలో సదా ఆత్మ రూపుడై ఉన్నాడు.. బుద్ధి మొదలైన లక్షణాలతో ఆయన మనకు గోచరిస్తాడు.. విజ్ఞులకు ఆయన సేవింప దగినవాడు.. సమస్తవేళల నమస్కరింపదగిన వాడు.. భక్తులపై వాత్సల్యం కురిపించే వాడు.. నియమ నిష్ఠలు కల్గి ఏకాగ్రమైన బుద్ధితో ఆత్మస్వరూపుడైన శ్రీహరి కథా సుధాపూరాన్ని తనివి దీరా, చెవులార గ్రోలేవారు ధన్యులు.. అట్టివారు పలు కుటిల విషయాలతో దూషితాలైన తమ శరీరాలను త్వరగా త్యజించి విష్ణు దేవుని పాదపద్మాలను చేరుకుంటారు.. కౌరవేశ్వరా! ఇది సత్యం.

37. మానుషజన్మము నొందిన
మానవులకు, లభ్యమాన మరణులకు, మహా
జ్ఞానులకుఁ, జేయవలయు వి
ధానము నిగదింపఁ బడియె ధరణీనాథా!

నరేంద్రా! మనుష్యులుగా జన్మించినవాళ్ళూ, మరణము ఆసన్నమైన వాళ్ళూ, మహాజ్ఞానులు చేయవలసిన కర్తవ్యం ఇలా నొక్కి వక్కాణింపబడి ఉంది.

అన్యదేవభజన ఫలం

38. శ్రద్ధగా వినుము.. బ్రహ్మవర్చస్సు కోరేవాడు వేదపాలకుడైన చతుర్ముఖ బ్రహ్మను సేవించాలి.. అలాగే ఇంద్రియశక్తి కాంక్షించేవాడు ఇంద్రుణ్ణి, సంతానం అభిలషించే వాడు దక్షుడు మొదలైన ప్రజాపతులను, భోజనం అశించేవాడు అదితినీ పూజించాలి.. స్వర్గం వాంఛించేవాడు ఆదిత్యులను, రాజ్యాభిలాష కలవాడు విశ్వేదేవతలను, ప్రజలను అధీనం చేసుకొనగోరువాడు సాధ్యులను, సిరిని వరించేవాడు దుర్గను ఉపాసించాలి.. తేజస్సు కోరే వాడు అగ్నిని, ధనాభిలాషి వసువులను, వీర్యం అర్థించేవాడు రుద్రులను, ఆయువు కోరేవాడు అశ్వినీ దేవతలను, పుష్టి కావాలనేవాడు భూమిని అర్చించాలి.. ప్రతిష్ఠను అపేక్షించేవాడు లోకమాతమాతలైన ఆకాశభూదేవత లను, అందం కోరేవాడు గంధర్వులను, వనితలపై వాంఛకలవాడు అప్సరసయైన ఊర్వశిని, సర్వాధికారం కాంక్షించేవాడు పరమేష్ఠిని భజించాలి..

కీర్తికోరేవాడు యజ్ఞమూర్తి. విష్ణువును, విత్తం ఆశించేవాడు ప్రచేతసుణ్ణి, విద్యపై కోరిక గలవాడు శివుణ్ణి, దాంపత్యసుఖం అర్థించేవాడు పార్వతిని కొలవాలి.. ధర్మార్థాలపై అభిలాష కలవాడు పుణ్యచరిత్రుడైన విష్ణువును, సంతానం కోరేవాడు పితృదేవతలను, రక్షణ కాంక్షించేవాడు యక్షులను, బలం కోరేవాడు మరుద్గణాలను, రాచరికం కావాలనేవాడు మనురూపంలో ఉన్న దేవతలను, శత్రుమరణం వాంఛించేవాడు నిరృతిని, భోగాలను అభిలషించేవాడు చంద్రుణ్ణి ఆరాధించాలి.

మోక్షప్రదుడు శ్రీహరి

39.. కామింపకయును సర్వముఁ
. . . గామించియునైన ముక్తిఁ గామించి తగన్
. . . లో మించి పరమపురుషుని
. . . నేమించి భజించుఁ దత్త్వనిపుణుం డధిపా!

రాజశేఖర! పై చెప్పిన వాటి నన్నింటినీ కోరినా, కోరకపోయినా తత్త్వం తెలిసిన వాడు మోక్షం మాత్రం తప్పక కోరుతాడు.. హృదయంలో పరమేశ్వరుణ్ణి ప్రతిష్ఠించి భజిస్తాడు. 40. పృథ్వీపతి! ఇలాంటి భౌతికమైన కోరికలతో ఇంద్రుడు మొదలైన వారిని సేవించినట్లే పద్మ నేత్రుడైన విష్ణుని భజిస్తే నిర్మల జ్ఞానము, వైరాగ్యము, మోక్షము సిద్ధిస్తాయి.. పలుమాట లెందుకు ఆ లక్ష్మీనాథుని కథా ప్రసంగాలనే నదీతరంగాలలో ఓలలాడటం కంటే అదృష్ట మేముంటుంది.. శ్రీహరి కథలు ఎవరికైనా చెవుల పండువు చేయకుండా ఉంటాయా?"41. ఇలా పరీక్షిన్మహారాజుకు శుకయోగి చెప్పాడని సూతుడు పలుకగా విని శౌనకుడు సూతునితో ఈ విధంగా అన్నాడు. 42. "శుకబ్రహ్మ ఈ విధంగా చెప్పిన మాటలు శ్రద్ధగా విన్న పరీక్షిత్తు, శ్రేయోభిలాషియై ఆతృతతో యేమని ప్రశ్నించాడో వివరించవయ్యా సూతా!43. చవులూరించే మనోజ్ఞమైన నీ మాటలు వింటుంటే ఇంకా ఎలాంటి మంచి మంచి హరికథలు చెపుతాడో అని మా మనస్సులో ఉబలాటం పెల్లుబుకు తున్నది. "44.. శౌనకుని ఈపలుకులు వినిన సూతమహర్షి ఇలా చెప్పాడు.. 45. "మునులార! ఆ పరీక్షిన్మహారాజు బాల్యంలో తూలిపడే జులపాల జుట్టుతో, తోటి బాలురతో ఆడుకునే రోజుల్లోకూడ శ్రద్ధతో శ్రీహరి పాదాలను అర్చించే వాడు. 46. అట్టి భాగవత శ్రేష్ఠుడైన పరీక్షిత్తుతో వాసుదేవ భక్తుడైన శుకముని ఇలా చెప్పాడు.

హరిభక్తిరహితుల హేయత

47. భగవంతుని కథలు వింటూ కాలం గడిపెడి పుణ్యాత్ముడు ఆయుస్సు తప్ప, ఇతరుల ఆయుస్సును సూర్యుడు ఉదయాస్తమయ సమయాలలో మోసగించి లాక్కుపోతూ ఉంటాడు.. ఆ సంగతి తెలియక మూఢుడు నేను తప్పక బహుకాలం జీవిస్తాను అనుకుంటాడు.. సంసార కారణాలైన ఆలుబిడ్డలు, ఇల్లువాకిళ్లు, తోటలు, దొడ్లు, ధనము మొదలైన వాటి తగులంలో చిక్కు వడతాడు.. కాలం అయినప్పుడు, యమభటులు తోలుకుపోతుంటే, అతను అయ్యో.. నేను పుణ్యం చేయలేదే, పాపం చేశానే అంటూ గోడుగోడున ఏడుస్తాడు. 48. అందుచేత. 49. అలాగే ఓ మహారాజా! పూలగుత్తులతో ఆకసమంటుతూ అడవులలో చెట్లు జీవించడం లేదా? ఆహారమైథునాది వాంఛలతో పశువులు పల్లె పట్టుల్లో బ్రతకడం లేదా? కొలిమితిత్తులు కూడ ఎడతెరిపి లేకుండా ఉచ్ఛ్వాస నిశ్వాసలు సాగిస్తున్నాయి కదా.. ఊరపందులు, కుక్కలు గుంపులు గుంపులుగా ఇల్లిల్లు తిరుగుతు దిక్కుమాలినవై దీనంగా తిరగటం లేదా.. ఒంటెలు, గాడిదలు పెద్దపెద్ద బరువులు మోస్తున్నాయి కదా.. అదే విధంగా

పద్మాక్షుని తెలియనేరని నరపశువులు అడవుల్లో, గృహాలలో సంసారభారాన్ని మోస్తూ జీవిస్తున్నారు.. వాళ్ల బ్రతుకు వ్యర్థం.. 50.

భాగవతం అంటే భగవంతుడు, భగవద్భక్తి, భక్తుడు కదా.. అట్టి భాగవత విశిష్టత పరమ భాగవతుడు, భాగవత ప్రయుక్త, బ్రహ్మర్షి, అవధూతోత్తముడు, వ్యాసపుత్రుడు అయిన శుకుడు పరమ పావనుడు, నిర్మల భక్తుడు, పాండవ పౌత్రుడు అయిన

విష్ణుకీర్తనములు వినని కర్ణంబులు –
కొండల బిలములు కువలయేశ!
చక్రిపద్యంబులఁ జదువని జిహ్వలు –
గప్పల జిహ్వలు కౌరవేంద్ర!
శ్రీమనోనాథు వీక్షింపని కన్నులు –
కేకిపింఛాక్షులు కీర్తిదయిత!
కమలాక్షు పూజకుఁ గాని హస్తంబులు –
శవము హస్తంబులు సత్యవచన!
హరిపద తులసీ దళామోద రతి లేని
ముక్కు పందిముక్కు మునిచరిత్ర!
గరుడగమను భజనగతి లేని పదములు
పాదపముల పాదపటల మనఘ!

పరీక్షిన్మహారాజుకి వివరిస్తున్నాడు –
భూమండలేశ! కురువంశోత్తమ! యశోనాథ! సత్యం పలికేవాడ! రాజర్షి! పాపరహితుడా! విష్ణుమూర్తి నామ కీర్తనలు వినని చెవులు కొండ గుహలు.. చక్రధారుడిమీద స్తోత్రాలు చదవని నాలుకలు కప్పల నాలుకలు.. లక్ష్మీపతి మీద దృష్టిలేని కళ్ళు నెమలి పింఛాల మీది కళ్ళు.. నారాయణుని చరణాలపై పూజింపబడే

తులసీ దళాల సువాసన ఆఘ్రాణించని నాసిక పంది ముక్కు.. పక్షివాహనుని స్తుతిస్తూ అడుగులు వేయని కాళ్ళు అచరములైన చెట్ల వేళ్ళు. 51. శ్రీమన్నారాయణుని పవిత్ర నామాక్షర స్మరణతో ద్రవించనివి మనస్సులే కావు.. అవి కరకు బండలు.. పద్మనాభుని కథలకు ఆనందబాష్పాలు రాలగా, పొంగి పులకించనిది శరీరమే కాదు, అది వట్టిమొద్దు.. పరమాత్మునకు ప్రణమిల్లని మూఢుని తలమీదిది బంగారు కిరీటం కాదు, అది కట్టెలమోపు, భగవంతునికి అర్పణంగాని మానవుని ఐశ్వర్యం ఐశ్వర్యం కాదు, అడవిగాసిన వెన్నెల, వాసుదేవుని సేవింపనివాడు ప్రాణవాయువు లోపల ఉండంవల్ల కదిలే శవం.. పద్మనాభుని పాదములు ఆశ్రయింపనివాని జీవితం పొత్తి నూలికాయలోని పురుగు జీవితం. ”52. ఇలా పలికిన వ్యాస పుత్రుడైన శుకుని పలుకులకు ఉత్తర కుమారుడైన పరీక్షిత్తు హృదయం వికసించింది.. అతడు నిర్మలమైన బుద్ధి విశేషం కలవాడైనాడు.

53. సుతుల హితుల విడిచి, చుట్టాల విడిచి, యి
ల్లాలి విడిచి, బహు బలాళి విడిచి
రాజు హృదయ మిడియె రాజీవనయనుపై
ధనము విడిచి, జడ్డుఁదనము విడిచి.

ఆ రాజు పరీక్షిత్తు బిడ్డలను, హితులను, బంధువులను, భార్యను, ఇతర పరిజనాన్ని, ధనాన్ని, జడత్వాన్ని వదలిపెట్టి పద్మాక్షుడైన భగవంతుని మీద మనస్సు నిలిపాడు.

## రాజ ప్రశ్న

54. ఇలా మరణభీతిని నిరాకరించిన, ధర్మార్థకామములనే త్రివర్గాన్ని తిరస్కరించిన పరీక్షిన్మహారాజు, పరమ పురుషునందు మనస్సును ఏకాగ్రంగా కేంద్రీకరించి, శ్రీమన్నారాయణుని లీలావిశేషాలను అభివర్ణింపగా ఆకర్ణించాలనే సంకల్పంతో ఇలా అడిగాడు. 55. ”శుకమహర్షి! బ్రాహ్మణోత్తమా! సర్వమూ తెలిసిన నీవు సర్వానికీ ఆత్మయైన వాసుదేవుణ్ణి వినుతించేసరికి నాలోని భ్రమలన్నీ తొలగిపోయి, మనస్సు సంతోషంతో పరవశం పొందింది. 56. మునిపుంగవా! శుకముని! సర్వేశ్వరుడు, సర్వవ్యాపి అయిన శ్రీహరి ఈ జగత్తును ఎలా సృష్టించి, పోషించి, సంహరిస్తున్నాడు? అవ్యయుడైన ఆ పరమాత్మ అనేక శక్తులతో గూడినవాడు.. అతడు మొదట ఏ శక్తుల సాయంతో బ్రహ్మ, ఇంద్రుడు మొదలైన రూపాలు తాల్చి వినోదించాడు? ఆయన

ప్రకృతి గుణాలను పరిగ్రహించడం క్రమంగా జరుగుతుందా? లేక ఒకే సమయంలో జరుగుతుందా? ఏకమూర్తియైన ఈశ్వరుడు అనేక మూర్తులు ధరించి అనేక విధాల ఎందుకు ప్రవర్తిస్తాడు? అలా ప్రవర్తించక పోతే ఆయనకు వచ్చే నష్టమేమిటి? నీవు అంతా తెలిసినవాడవు.. నాకు ఈ విషయములన్నీ వివరించుము".

శుకుడు స్తోత్రము సేయుట

57. పరీక్షిన్మహారాజు అలా అడిగేసరికి మౌనం వహింప దలచక, తగు సమాధానం చెప్పాలన్న కుతూహలంతో లోకోత్తరమైన ఉత్తమ గుణములు గలవాడైన శుకయోగి మనస్సులో ఇలా భగవంతుణ్ణి ప్రార్థించాడు.. 58.. ప్రకృతికంటే జీవునికంటే పరుడు, ఈశ్వరుడు, గొప్ప మహిమ కలవాడు, సృష్టిస్థితిలయాలను ఆటగా సాగించేవాడు, బ్రహ్మ విష్ణు మహేశ్వరులనే త్రిమూర్తుల శక్తి కలవాడు, అందరికి అంతరాత్మగా వెలుగొందేవాడు, బ్రహ్మాది దేవతలు అందుకోడానికి వీలుకాని దుస్తరమైన త్రోవలో ప్రకాశించే వాడు అయిన శ్రీహరికి తత్త్వాభిలాషతో నమస్కరిస్తున్నాను..

59. సత్పురుషుల పాపాలను పరిహరించెడివాడు, దుర్జనులను శిక్షించేవాడు, సమస్త రూపులు తన రూపమే అయినవాడు, పరమహంసాశ్రమంలో ఉండే మునుల హృదయ కమల మధ్యంలో వెలుగొందెడివాడు, సాత్వత వంశస్థులలో శ్రేష్ఠుడు, సమస్త కల్యాణ గుణాలతో శోభిల్లేవాడు, ఉత్తములైన భక్తులకు సులువుగా లభించే వాడు, భక్తి లేనివారికి ప్రాప్తించనివాడు, అత్యుత్తమము, అనుపమానము, అనంతమైన ప్రవర్తన గలవాడు, స్వస్వరూపమైన బ్రహ్మములో విహరించేవాడైన పరమేశ్వరునకు ప్రణమిల్లుతున్నాను.

60. ఏ విభువందనార్చనములే, విభుచింతయు, నామకీర్తనం,
బే విభులీల, లద్భుతము లెప్పుడు సంశ్రవణంబు సేయ దో
షావలిఁ బాసి లోకము శుభాయతవృత్తిఁ జెలంగు నంద్రు; నే
నా విభు నాశ్రయించెద నఘౌఘనివర్తను భద్రకీర్తనున్. 0

61. ఏ పరమేశు పాదయుగ మెప్పుడు గోరి భజించి నేర్పరుల్
లోపలి బుద్ధితో నుభయలోకములందుల జడ్డుఁ బాసి, యే

తాపము లేక బ్రహ్మగతిఁ దారు గతశ్రములై చరింతు; రే
నా పరమేశు మ్రొక్కెద నఘౌఘనివర్తను భద్రకీర్తనున్.

62. తపములఁ జేసియైన, మఱి దానము లెన్నియుఁ జేసియైన, నే
జపములఁ జేసియైన, ఫలసంచయ మెవ్వనిఁ జేర్పకున్న హే
యపదములై దురంత విపదంచిత రీతిగ నొప్పుచుండు; న
య్యపరిమితున్ భజించెద నఘౌఘనివర్తను భద్రకీర్తనున్.

పరమేశ్వరుణ్ణి ఉద్దేశించి చేసిన నమస్కారం, పూజ, చింతన, నామసంకీర్తన అమోఘమైనవి అని, అతని కథలు వింటే దోషాలన్నీ తొలగి లోకం మంగళకర మౌతుందని పెద్దలు చెప్తారు. పాపనిచయ నివర్తనుడు, మంగళమయ కీర్తనుడైన ఆ పరమేశ్వరుణ్ణి ఆశ్రయిస్తున్నాను. పరమేశ్వరుని పాదాలను ఎల్లవేళలా కోరి సేవించి నిపుణులైనవారు అంతర్ముఖ. బుద్ధితో ఇహపరలోకాలతో తగులం వదలుకొని, ఏ తాపమూ లేక పరబ్రహ్మను చేరే మార్గంలో ఏ కష్టము లేనివారై సంచరిస్తారు.. పాపసమూహాలను పటా పంచలు చేయు, మంగళమయ కీర్తనుడైన ఆ పరమేశ్వరుణ్ణి భజిస్తున్నాను.

ఎన్నేసి తపస్సులు, దానాలు, జపాలు చేసినప్పటికి వాటివల్ల కలిగే ఫలాలను పరమేశ్వరుడికి అర్పించకుంటే అవన్నీ నింద్యాలై ఆపదలుగా పరిణమిస్తాయి.. . పరిమితి లేనివాడు, పాపనిచయ నివర్తనుడు, మంగళమయ కీర్తనుడైన ఆ పరమేశ్వరుణ్ణి సేవిస్తున్నాను. 63. యవనులు, కిరాతులు, పుళిందులు, హూణులు, శకులు, కంకులు, ఆభీరులు, చండాలురు–ఇలాంటి జాతుల్లో పుట్టినవారు, ఇతర పాపాత్ములు కూడ పరమపావనుని సేవించినచో భాగవత శ్రేష్ఠుల నాశ్రయించినవారు, పరిశుద్ధ శరీరులు, మంగళాకారులై ఉంటారు.. వికారరహితుడు, సర్వసమర్థుడు అయినట్టి ఆ పరమాత్మకు నా మనస్సులో ఎల్లవేళల నమస్కరిస్తాను. 64. బ్రహ్మ, రుద్రుడు మొదలైన వారు పరమేశ్వరుని దివ్యసన్నిధికి ఎలా చేరగలం, తపస్సులు, మనోనిగ్రహం, దానాలు, వ్రతాలు, జపాలు, మంత్రాలు, శ్రుతి స్మృతులను వల్లించడం, లేక ఉత్తమభక్తితోనా అని చింతిస్తుంటారు.. ఆట్టి ఆ మోక్షప్రభువు, ఆత్మస్వరూపుడు నాకు ఎల్లవేళలా సులభుడవుగాక.

65. శ్రీపతియు, యజ్ఞపతియుఁ, బ్ర
జాపతియున్, బుద్ధిపతియు, జగదధిపతియున్,
భూపతియు, యాదవశ్రే
ణీపతియున్, గతియునైన నిపుణు భజింతున్.

లక్ష్మికి, యజ్ఞానికి, ప్రజలకు, బుద్ధికి, జగత్తుకు, భూమికి, యాదవ వర్గానికి, పతి గతి అయిన ఆ భగవంతుని సేవిస్తాను.

66. **అణువో? గాక కడున్ మహావిభవుఁడో? యచ్ఛిన్నుఁడో? ఛిన్నుఁడో?
గుణియో? నిర్గుణుఁడో? యటంచు విబుధుల్ గుంఠీభవత్తత్త్వమా
ర్గణులై యే విభుపాదపద్మ భజనోత్కర్షంబులం దత్త్వ వీ
క్షణముం జేసెద; రట్టి విష్ణుఁ, బరమున్, సర్వాత్ము సేవించెదన్.**

ఆ పరమాత్ముడు అతి సూక్ష్మమైన అణుస్వరూపుడా? లేక విశ్వమంతా వ్యాపించిన మహాస్వరూపుడా? దేశకాలాదులచేత అపరిచ్ఛిన్నుడా? లేక పరిచ్ఛిన్నుడా? ఆయన సగుణుడా? లేక నిర్గుణుడా? అంటు పండితులు వ్యర్థమైన తత్త్వాన్వేషణలు చేసి చేసి చివరకి ఏ భగవంతుని పాదపద్మాలను ఆశ్రయించి అతిశయంగా భజించుట ద్వారా తత్త్వస్వరూపాన్ని గుర్తించగలరో అట్టి సర్వవ్యాపకుడు, సర్వోత్కృష్టుడు, సర్వాత్మకుడు అయిన ఆ పరాత్పరుడిని కొలిచెదను.
★ (*శుకమహర్షి శ్రీహరి కృత సృష్ట్యాదుల రహస్యాలు మున్నగునవి పరీక్షిత్తునకు వివరించటానికి ఉద్యుక్తుడై దైవ, గురు ప్రశంస సందర్భంలోది ఈ పద్యం.* )

యద్భావం తత్భవతి అన్నట్లు చూసే దృష్టికి అనుకూలమైన విధంగా దర్శన మిచ్చే ఆ పరమాత్మ భక్తిమార్గంలో చేరిన వారికే ఆయా సర్వదృష్టులలో దర్శించే సమస్తాన్ని సమన్వయం చేసి సత్యమైన తత్త్వస్వరూప దర్శనం అనుగ్రహిస్తాడు. 67. భగవంతుడు పూర్వం జగత్తును సృష్టించాలనే బుద్ధి బ్రహ్మకు పుట్టించాలనే ఊహతో, సరస్వతిని పంపగా ఆమె బ్రహ్మను భర్తగా స్వీకరించి లోకసామ్రాజ్యంలో ఆయనను సృష్టి నిపుణుణ్ణి చేసింది.. అట్టి గుణవంతుడైన ఆ భగవంతుని భజనకు ఉపక్రమిస్తాను. 68. తాను పరిపూర్ణుడై ఉండికూడ పృథివ్యాది పంచ మహాభూతాలను కలిపి శరీరాలనే పురాలను సృష్టించి వాటిలో పురుషుడనే పేరుతో ఎవడు సదా ధీరుడై ప్రకాశి

స్తుంటాడో; పంచభూతాలను, పదకొండు ఇంద్రియాలను ప్రకాశింపజేసి గొప్ప ప్రభావంతో షోడశకళాత్మకుడై శోభిల్లుతూ ఎవడు జీవత్వ మనే నృత్తవిలాసం ప్రదర్శన ఇస్తుంటాడో; ఆ అవ్యయుడు, అచ్యుతుడు అయిన భగవంతుడు, మనోజ్ఞ నవరసాలనే తేనెలు జాలువారుతూ నా మనస్సునుండి పుట్టిన వాక్కులనే పుష్పమాలికలతో సజ్జనుల హృదయాల నలరించుగాక. 69. మానమే ధనముగా గలవారు, మహనీయులు, సమాధినిష్ఠులు, వ్యాసభగవానుని ముఖపద్మధ్యాన మనే తేనె త్రాగుతూ, భయరహితులై, భవబంధ విముక్తులై ప్రకాశిస్తారు.. అట్టి ఆ మునిజన మకుటాయమానుడు, గాఢమైన అజ్ఞానమనే చీకటికి సహస్రభానుడు, శిష్యులలో ప్రధానుడైన వ్యాసభగవానునికి వందనములు ఆచరిస్తున్నాను.. 70.. అని ఇలా హరికి, తండ్రియైన వ్యాసమహర్షికి ప్రణమిల్లి శుకయోగీంద్రుడు పరీక్షిన్మహారాజుకు ఇలా చెప్పసాగాడు.

71. "ఓ మహారాజా! నీ విపుడు నన్నడిగిన విషయమునే, పూర్వం బహ్మదేవుడు నారాయణునివల్ల విన్నాడు.. నారదుడు అడుగగా దానినే ఆయన వివరించాడు.. ఆపైన నారదుడు నాకది తెలియజేశాడు.. వినదగినది, మహాద్భుతమైనది, సంశయం తొలగించే ఆ విషయం నీకు చెపుతాను, విను. 72. నారదమహర్షి బ్రహ్మదేవుడిని ఇలా అడిగాడు. 73. "తండ్రీ! నీవు చతుర్ముఖుడవు.. దేవతలలో పెద్దవాడవు.. లోకాలకు సృష్టికర్తవు.. వేదాలన్నీ నీ ముఖపద్మాలలోనే ప్రకాశిస్తుంటాయి.. శబ్దార్థమయమైన విశ్వమంతా నీకు అరచేతిలోని ఉసిరికాయలా తేటతెల్లమై ఉంటుంది.. పైగా నీకు సరస్వతీదేవి ఇల్లాలట.. ఈ నా సందేహం తీర్చు తండ్రీ!

## నారదుని పరిప్రశ



74.. జగత్తును సృష్టించటం ప్రారంభించే విజ్ఞానం నీ కెవడు ప్రసాదిస్తున్నాడు? ఆ ప్రారంభ సంపదకు ఆధార మేమిటి? ఈ సృష్టి నిర్మాణానికి హేతు వేమిటి? దీనికి

ప్రయోజన మేమిటి? దీని స్వరూప మేమిటి? సాలెపురుగులా ఎడతెగ కుండా సృష్టికార్యం సాగిస్తున్నా నీకు శ్రమ అనేది లేకుండా ఉన్నది.. నీ జీవన పద్ధతి అందరికీ లభ్యపడేది కాదయ్యా సరస్వతీ పతి! 75. నా మట్టుకు నేను నీవే ప్రభువని అనుకుంటున్నాను.. వాస్తవానికి నీకంటే అధికుడైన ప్రభువు మరొక డున్నాడా? నీవే అందరికి ప్రభుడవా? అయితే యే ప్రయోజనం కాంక్షించి నీ వీ లోకాలు సృష్టిస్తున్నావు? ఈ జీవసముదాయం ఎక్కడినుండి ఉద్భవిస్తున్నది? ఎక్కడ ఉంటున్నది? ఎక్కడ లయ మవుతున్నది? సత్యం తెలియ జెప్పవయ్యా! బ్రహ్మయ్యా!76. సత్తు, అసత్తుల కలయిక వల్ల నామరూపగుణాలతో కనిపిస్తున్న ఈ ప్రపంచం నీ హృదయానికి లోబడిందే కదా! నీ కంటే అధికులు, నీతో సమానులు ఎవ్వరూ లేరు.. నీ స్థానం కడు దొడ్డది.. ఇలాంటి నీవు ఏ పరమేశ్వరుణ్ణి ఉద్దేశించి నేర్పుతో తపస్సు చేశావు? ఆ దారి ఏదో చూపవయ్యా.. పద్మసంభవ!77. ఓ పద్మాసనా! ఒకవేళ నీకు ఒక ప్రభువున్నాడు అంటావేమో.. అట్లయితే ఈ బ్రహ్మాండం ఏ ప్రభువు కటాక్ష విలాసంతో పుట్టుతున్నదో, పెరుగుతున్నదో, గిట్టుతున్నదో ఆ ప్రభువు గూర్చి ముచ్చటించుకోవచ్చునా? ఆయన స్వరూప మెలాంటిది?78.

తోయజసంభవ నా కీ
తోయము వివరింపు, చాలఁ దోఁచిన నే నా
తోయము వారికి నన్యుల
తోయములం జెందకుండ ధ్రువ మెఱిఁగింతున్.

ఓ బ్రహ్మ దేవుడా! నాకు ఈ విషయం బాగా అర్థమయ్యేలా వివరించు.. నన్ను అనుసరించేవాళ్లకి, ఈ సత్యం తెలియజెప్పి, ఇతర మార్గాలకు పోకుండా గట్టిగా బోధిస్తాను.

★ ***(నారదుడు బ్రహ్మ దేవుని నీవే కదా అధిదేవుడివి.. నీవు ఎవరిని ధ్యానిస్తున్నావు?. అని అడుగుతున్న సందర్భంలోది ఈ పద్యం.. దీంట్లో తోయము అనే పదానికి ఉన్న నీరు, విధము, పరివారము, తెగ అనే నానా అర్థాలు వాడిన పోతన గారి పలుకుల చమత్కృతి చక్కగా ఉంది. )***

79. బ్రహ్మదేవుడా! తండ్రీ! జరిగిన, జరుగనున్న, జరుగుతున్న వ్యవహారా లన్నిటికీ నీవే కర్తవు.. నీకు తెలియని విషయమంటూ ఏదీ లేదు.. ఈ ప్రపంచవిధానం నాకు

తెలియజెప్పుము" అని నారదుడు ప్రశ్నించాడు.. అందుకు విప్పారిన వదనంతో విధాత ఇలా అన్నాడు.

బ్రహ్మ అధిపత్యం బొడయుట

80. "కుమారా! నారదా! ఎందరో పండితులు నిత్యం నా వద్దకు వస్తుంటారు.. వారందరు విరక్తులే.. అయినా వాళ్లెవరూ నీ లాగా నన్ను ప్రశ్నించలేదు.. నీ యభిప్రాయం నాకెంతో ఆనందం కలిగిస్తున్నది. ఆశ్చర్యం నా ప్రభువు. మర్మమే అడిగావు. 81. ఓ నారదా! విను.. నానా రూపాలతో ఉన్న ఈ చరాచర ప్రపంచాన్ని నా అంతట నేనే సృజించటానికి చాలిన తెలివి ఏ కొంచెము లేక పూర్వం తబ్బిబ్బు పడుతున్నాను.. ఆ స్థితిలో సమస్త సృష్టిని ప్రారంభించడానికి అవసరమైన విజ్ఞానాన్ని నాకా ప్రభువు ఎంతో ఉదారబుద్ధితో అనుగ్రహించాడు.. అలాంటి పరమేశ్వరుని ఆనతి లేకపోతే ఈ లోకాలు నిర్మించే శక్తి నాకెక్కడిది నాయనా 82. పాపరహితుడా! ఈ ప్రపంచాన్నంతటినీ ప్రకాశింపజేసే సామర్థ్యం నాకు లేదు.. ఎవని దివ్య ప్రకాశం వల్ల సూర్యుడు, చంద్రుడు, అగ్ని, నక్షత్రాలు, గ్రహాలు ఆలాగే ఈ లోకాలన్నీ కూడ సముజ్జ్వలంగా ప్రకాశించే దివ్యదీప్తితో తేజరిల్లుతున్న పరమేశ్వరునకు నే నెల్ల వేళలా ప్రణమిల్లుతున్నాను.. 83. ఈ విషయం ఇంకా విశదంగా వినిపిస్తాను, నారదా! విను.. మాయ ఈశ్వరుని దృష్టిపథంలో ప్రవేశించడానికి శంకించి సిగ్గుతో కుంచించుకు పోతుంది.. ఈ మాయవల్ల తమ ప్రజ్ఞ కుంఠితం కాగా బుద్ధిలేని వాళ్లు నన్నే లోకవిభుడని భావించి నాకు నమస్కరిస్తుంటారు.. వత్సా! అలాంటి మూర్ఖులను చూసి ఇది శ్రీహరి మాయవల్ల జరిగే పని కదా అని నాలో నేను నవ్వుకొని వాళ్లను త్రోసి పుచ్చుతాను. 84. ఇంకా ఆ పైన.. శరీరనిర్మాణానికి ఉపయోగపడే పృథివ్యాది పంచ మహాభూతాలు, పుట్టుకకు హేతువులైన కర్మలు, కర్మ ప్రవృత్తికి హేతువైన కాలం, కాల మార్పులకు కారణమైన స్వభావం, వీటిని అనుభవించే జీవుడు సమస్తము ఆ శ్రీమన్నారాయణుడే.. అన్యమైనది ఏది లేదు.. ఇది నిజం. ఈ లోకాన్ని నియమించే వాడు వాసుదేవుడే.. వేల్పులు నారాయణుని శరీరం నుండి పుట్టినవారే; వేదాలు, యాగాలు, తపస్సులు, ప్రాణాయామాది యోగాలు, విజ్ఞానము సమస్తము నారాయణుని ఆరాధనా రూపమైనవే; జ్ఞానం వల్ల సాధించే ఫలం కూడా నారాయణుని అధీనంలోనే వుంది.. నిర్వికారుడు, సర్వాంతర్యామి, సర్వదర్శనుడు అయిన భగవంతుని క్రీగంటిచూపుచే ప్రేరేపింపబడి, గుణరహితుడైన ఈశ్వరుని నుండి రజస్సు, సత్త్వము, తమస్సు అనే మూడు గుణాలు పుడుతున్నాయి.. అవి

ఉత్పత్తికి, స్థితికి, లయాలకి హేతువు లవుతున్నాయి.. కార్యభావంలో, , కర్తృభావంలో ద్రవ్యాలైన పృథివ్యాది పంచ మహాభూతాలను, జ్ఞానరూపాలైన బ్రహ్మాది దేవతలను, క్రియారూపాలైన ఇంద్రియాలను ఆశ్రయిస్తున్నాయి.

జీవుడు సదా ముక్తుడే అయినా మాయతో కూడి ఉండడం వల్ల ఆ త్రిగుణాలు అతణ్ణి బంధిస్తున్నాయి.. జీవుణ్ణి కప్పివేసే ఉపాధులైన ఈ మూడు గుణాలను కల్పించి తద్వారా ఈశ్వరుడు ఇతరులకు ఏ మాత్రం గోచరించక తనకు మాత్రం గోచరించే తత్త్వంతో ఈ విధంగా వినోదిస్తూ ఉంటాడు. 85. నారదా! కుమారా! ఆ పరమేశ్వరుడు తుది లేనివాడు.. ఆ శ్రీహరి ఈ లోకాలకు, నాకు, నీకు, మాయకు, ప్రాణికోటికి ప్రభువు.. ఆయన కంటే అన్యమైనది ఏది ఈ జగత్తులో లేనే లేదు. 86. మాయకు నియామకుడు ఈశ్వరుడు, ఆ ప్రభువుకు తన మాయవలన, దివ్యవైన యోగము వలన కాలము, జీవదృష్టము, స్వభావము అప్రయత్నంగా సిద్ధించాయి.. వాటిని ఆయన వివిధరూపాలుగా చేయాలని నిశ్చయించుకొని సృష్టి కార్యానికి సహకారులుగా స్వీకరించాడు.. ఈశ్వరునిచే అధిష్ఠింపబడ్డ మహత్తత్త్వం కారణంగా కాలంనుండి జన్మములు సిద్ధించాయి.

రజోగుణం చేత, సత్త్వగుణం చేత, వృద్ధిపొందిన మహత్తత్త్వం వికారానికి లోనయింది.. దానినుంచే తమోగుణ ప్రధానమైనది, పంచభూతాలు, పంచజ్ఞానేంద్రియాలు, పంచకర్మేంద్రియాలు రూపంగా కల అహంకారం జనించింది.. ఆ అహంకారం మళ్లీ వికారానికి లోనై ద్రవ్యశక్తి యైన తామసమని, క్రియాశక్తియైన రాజసమని, జ్ఞానశక్తియైన సాత్త్వికమని మూడు రూపాలుగా పంచభూతాలకు మూలకారణమైన తామసాహంకారం నుండి ఆకాశం పుట్టింది.. ద్రష్ట అయిన ఆత్మకు, దృశ్యమైన జగత్తుకు బోధకమూ, సూక్ష్మరూపమై వున్న శబ్దం ఆకాశానికి గుణమయింది.. వికారానికి లోనైన ఆకాశం నుండి స్పర్శ గుణప్రధానమైన వాయువు పుట్టింది.. తనకు కారణమైన ఆకాశమందలి శబ్దము, తనకు సహజమైన స్పర్శము అనే రెండు గుణాలు వాయువునకు ఉన్నాయి.. వాయువు శరీరాలలో ప్రాణరూపంలో వుంటుంది.. అది ఇంద్రియ పాటవానికి, మనోబలానికి, శారీరక శక్తికి హేతువవుతున్నది..
వికారం పొందిన వాయువు నుండే రూపం, స్పర్శం, శబ్దం అనే మూడు గుణాలతో పాటు తేజస్సు జనించింది.. తేజస్సు నుండి రసం, రూపం, స్పర్శం, శబ్దం అనే

నాలుగు గుణములతో జలము పుట్టినది.. జలమువలన గంధ, రసం, రూపం, స్పర్శం, శబ్దములు అనెడి అయిదు గుణాలతో పృథ్వి పుట్టింది.. పై జెప్పినవన్నీ తామసాహంకారంనుండి కల్గినవే.. వికారానికి లోనైన సాత్త్విక అహంకారం నుండి మనస్సు పుట్టింది.. దానికి చంద్రుడు అధిదేవత, అంతేకాక ఆ సాత్త్వికాహంకారం నుండే దిక్కులు, వాయువు, సూర్యుడు, వరుణుడు, అశ్వినీ దేవతలు, అగ్ని, ఇంద్రుడు, ఉపేంద్రుడు, మిత్రుడు, ప్రజాపతి అనే పదిమంది దేవతలు పుట్టారు.. తైజసమైన రాజసాహంకారం నుండి శ్రవణం వంటి ఐదు జ్ఞానేంద్రియాలు, వాక్కు మొదలైన ఐదు కర్మేంద్రియాలు, బుద్ధీ, ప్రాణము కలిగాయి.. ఆ పది యింద్రియాల అధిదేవతల వివరములివి.

4 శ్రవణేంద్రియానికి దిక్కులు, త్వగింద్రియానికి వాయువు, నేత్రేంద్రి యానికి సూర్యుడు, రసనేంద్రియానికి ప్రచేతసుడు, ఘ్రాణేంద్రియానికి అశ్వినీ దేవతలు, వాగింద్రియానికి అగ్ని, హస్తేంద్రియానికి ఇంద్రుడు, పాదేంద్రి యానికి ఉపేంద్రుడు, గుదేంద్రియానికి మిత్రుడు, ఉపస్థేంద్రియానికి ప్రజాపతీ దేవతలుగా ఉన్నారు.. బుద్ధి జ్ఞానం కలిగించే అంతఃకరణంలో ఒక భాగం ప్రాణం క్రియను కల్గించే అంతఃకరణం.. శ్రోత్రం మొదలైన పది యింద్రియాలతో కూడిన భూతాలు, ఇంద్రియాలు, మనస్సు, శబ్దస్పర్శాది గుణాలు విడిగా ఉంటే బ్రహ్మాండమనే శరీరాన్ని నిర్మించలేక పోయాయి.

4 ఇల్లు కట్టాలంటే అనేక వస్తువులను ఒక్కచోట చేర్చితే కాని సాధ్యం కాదు గదా అదే రీతిగా పైన జెప్పిన భూతాలు, ఇంద్రియాలు, మనస్సు.. గుణాలు దేవుని. శక్తివల్ల ప్రేరణ పొంది ఒక్కటిగా చేరాయి.. సమష్టిగా, వ్యష్టిగా కలిసి చేతనాలను, అచేతనాలను కల్పించాయి.. అలా యీ బ్రహ్మాండాన్ని నిర్మించాయి.. అలా నిర్మింపబడ్డ అండం కోటి సంవత్సరాల వరకు నీళ్లలోనే ఉండి పోయింది.

4 ఆ పైన కాలకర్మస్వభావాలకు లోను గానివాడు, అన్నిటినీ ప్రాణ వంతాలుగా చేయగలవాడైన ఈశ్వరుడు ప్రాణరహితమైన దానిని ప్రాణ సహితం చేసాడు.. కాలకర్మస్వభావాలకు ప్రేరకుడైన ఆ పరమేశ్వరుడు మహావరణ జలమధ్యంలో జీవరూపంలో ప్రవేశించి దాన్ని మిక్కిలి విస్తృతం చేసాడు.. చివరికి ఆ అండాన్ని భేదించుకొని వెలికి వచ్చాడు.. అది ఎలా జరిగిందో విను.

## లోకములు పుట్టుట

87. భువనాత్మకుఁ డా యీశుఁడు
భవనాకృతితోడ నుండు బ్రహ్మాండంబున్
వివరముతోఁ బదునాలుఁగు
వివరంబులుగా నొనర్చె విశదంబులుగన్

- ప్రపంచ స్వరూపుడైన ఆ ఈశ్వరుడు ఒక భవనం లాగ ఉన్న బ్రహ్మాండాన్ని విడివిడిగాచేసి విపులమైన చతుర్దశభువనాలుగా తీర్చిదిద్దాడు.. 88.. బుద్ధి మంతుడవైన నారదా! ఆ దేవుడు అనేకాలైన పాదాలు, ఊరువులు, భుజాలు, ముఖాలు, నేత్రాలు, శిరస్సులు, నోళ్లు, చెవులతో కూడి ఉన్నాడు.. అలా ఉంటూ అనేక ప్రాణుల శరీరాలలో నెలకొని విహరిస్తూ వుంటాడు.. పండితులు చక్కగా విమర్శించి ఆ భగవంతుని అనేక రూపాలైన అవయవాలలో సమస్త భువనాల ఉనికినీ విచారిస్తూ ఉంటారు.. మహామహుడు, ఆశ్చర్యకర స్వరూపుడైన ఆ భగవానుడు యోగుల హృదయాలలో అర్చింపదగి ఉన్నాడు.. 89. ఈ పదునాలుగు లోకాలలో, పై యేడు లోకాలూ శ్రీ మహా విష్ణువునకు నడుమునుండి పై శరీరమంటారు.. అలాగే క్రింది యేడు లోకాలు నడుము నుండి క్రింది శరీరమని చెపుతారు.. ప్రపంచమే భగవంతునికి శరీరం.. ఆయన ముఖంనుండి బ్రహ్మకులము, బాహువులనుండి క్షత్రియ కులము, తొడలనుండి వైశ్యకులము, పాదాలనుండి శూద్రకులము పుట్టాయని వర్ణిస్తారు.
- ఆ మహావిష్ణువుకు కటిస్థలం భూలోకం, నాభి భువర్లోకం, హృదయం సువర్లోకం, వక్షం మహర్లోకం, కంఠం జనలోకం, స్తనాలు తపోలోకం, శిరస్సు సనాతనమైన బ్రహ్మ నివసించే సత్యలోకం, జఘనం అతలం, తొడలు వితలం, మోకాళ్లు సుతలం, పిక్కలు తలాతలం, చీలమండలం మహాతలం, కాలి ముని వేళ్లు రసాతలం, అరికాలు పాతాళం;
- ఈ కారణంగా ఆయనను లోకమయుడని భావిస్తారు.. మరికొంతమంది ఆయన పాదతలం నుండి భూలోకము, బొడ్డు నుండి భువర్లోకము, శిరస్సునుండి స్వర్లోకము పుట్టాయని మూడు లోకాల సృష్టిని వివరిస్తారు.. శ్రీమన్నారాయణుని ముఖంనుండి సమస్త ప్రాణుల వాక్కులు, వాక్కుల కధిష్ఠానమైన అగ్ని పుట్టాయి.. చర్మం, రక్తం, మాంసం, మెదడు, ఎముకలు, మజ్జ, శుక్లం అనే ఇవి యేడు ఆ దేవుని యేడు ధాతువులని చెబుతారు.. మరొక

పద్ధతిలో రోమాలు, చర్మం, మాంసం, ఎముకలు, స్నాయువులు, మజ్జ, ప్రాణాలు అనే ఇవి ఏడు ధాతువులని వర్ణిస్తారు.. వాటిలో రోమాలు ఉష్ణికం ఛందస్సు, చర్మం ధాత్రీఛందస్సు, మాంసం త్రిష్టుప్ ఛందస్సు, స్నాయువు అనుష్టుప్ ఛందస్సు, శల్యం జగతీఛందస్సు, మజ్జ పంక్తిచ్ఛందస్సు, ప్రాణం బృహతీ ఛందస్సు అని వ్యవహరిస్తారు.

- దేవతల కర్పించే పురోడాశరూపమైన హవ్యానికి, పితృదేవతలకిచ్చే చరురూప మైన కవ్యానికి, అమృతాన్నానికి, తీపి మొదలయిన ఆరు రసాలకు, రసనేంద్రియానికి, రసానికి అధీశ్వరుడైన వరుణుడికి విష్ణు దేవుని రసనేంద్రియమే జన్మస్థానం.. అలాగే అన్ని ప్రాణాదులకు, వాయువుకు విష్ణుని నాసా రంధ్రం నెలవు.. దగ్గరగా, దూరంగా వ్యాపించే వాసనలకు, ఓషధులకు, అశ్వినీ దేవతలకు ఆ పరమేశ్వరుని ఘ్రాణేంద్రియం స్థానం.. దేవలోకానికి, సత్యలోకానికి, తేజస్సుకు, సూర్యుడికి, సకల నేత్రాలకు లోకనేత్రుడైన పరమాత్ముని చక్షురింద్రియమే నివాసం, దిక్కులకు, ఆకాశానికి, శ్రవణాంశా లకు, శబ్దానికి సర్వేశ్వరుని శ్రోత్రేంద్రియం జన్మభూమి.. ప్రశస్తాలైన వస్తువు లకూ, కొనియాడదగిన సౌందర్యాలకు పరమ పురుషుని శరీరమే స్థానం.. స్పర్శానికి, గాలికి, సకల స్నిగ్ధత్వాలకి ఆ దివ్యశరీరుని త్వగింద్రియమే గృహం.. యాగపశువును బంధించే స్తంభాది యజ్ఞపరికరాలైన చెట్లూ,పొదలు, తీగలు మొదలైన వాటికి పురుషోత్తముని రోమాలు స్థానాలు, రాళ్లు, లోహాలు ఆ విశ్వమయునికి గోళ్లు, మబ్బులు సరోజాక్షుని శిరోజాలు.. మెరపులు సర్వేశ్వరుని మీసాలు, భూలోక భువర్లోక సువర్లోకాలను కాపాడే లోకపాలకుల పరాక్రమా లకు, భూలోకం మొదలైన లోకాల క్షేమానికీ, శరణానికీ నారాయణుని పరాక్రమం నట్టిల్లు.. ఎల్లకోరికలకు, శ్రేష్ఠమైన వరాలకు ఆ పవిత్రపాదుని పాదపద్మాలే నిలయాలు.. జలాలు, శుక్లం, పర్జన్య, ప్రజాపతి సృష్టి అనే వీటన్నింటికీ ఆ సర్వేశ్వరుని పురుషాంగం జన్మస్థలం.. సంతతికి, కామం మొదలైన పురుషార్థాలకు, మనస్సుకు కలిగించే ఆనందాలకు, శరీరసుఖానికి అచ్యుతుని గుహ్యేంద్రియం స్థానం.. యముడికి, మిత్రుడికి, మలవిసర్జనానికి ఆ దేవుని గుదేంద్రియం ఇల్లు..

- హింసకు, నిర్రృతి(నైరుతిదిక్పాలకుడు), మృత్యువుకు, నరకానికి ఆ సర్వరూపుని గుదం నెలవు.. అవమానానికి, అధర్మానికి, అవిద్యకు, చీకటికి, అంతము లేని ఆ

దేవుని పృష్ఠప్రదేశం నివాసం.. నదీనద సమూహాలకు ఈశ్వరుని నాడీ సంఘం పుట్టిల్లు.. కొండలకు అధోక్షజుని ఎముకలు జన్మస్థానాలు.. ప్రధానానికి, అన్నరసానికి, సముద్రాలకు, భూతాల విలయానికి ఆ బ్రహ్మాండగర్భుని ఉదరం ఉనికిపట్టు.. మానసిక వ్యాపార రూపమైన లింగదేహానికి గొప్పమహిమ గల ఆ దేవుని హృదయం సృష్టి స్థానం.. అంతే కాదు. 90. శివునికి, నీకు, నాకు, సనత్కుమారుడు మొదలైన కుమారవర్గానికి, ధర్మానికి, సత్త్వానికి, విజ్ఞానానికి శ్రేష్ఠమైన ఉనికిపట్టు ఆ పరమేశ్వరుని అత్మే.



91. నర సురాసుర పితృ నాగ కుంజర మృగ–
గంధర్వ యక్ష రాక్షస మహీజ
సిద్ధ విద్యాధర జీమూత చారణ–
గ్రహ తారకాప్సరోగణ విహంగ
భూత తటిద్వస్తు పుంజంబులును నీవు–
ముక్కంటియును మహామునులు నేను
సలిలనభస్థ్సలచరములు మొదలైన–
వివిధ జీవులతోడి విశ్వమెల్ల
విష్ణుమయము పుత్ర! వేయేల బ్రహ్మాండ
మతని జేనలోన నడఁగి యుండు;
బుద్ధి నెఱుఁగరాదు భూతభవద్భవ్య
లోకమెల్ల విష్ణులోన నుండు.

ఓ కుమారా! మానవులు, దేవతలు, దానవులు, పితరులు, ఉరగులు, గజాలు, మృగాలు, గంధర్వులు, యక్షులు, రాక్షసులు, వృక్షాలు, సిద్ధులు, విద్యాధరులు, మేఘాలు, చారణులు, గ్రహాలు, నక్షత్రాలు, అచ్చరలు, పక్షులు, భూతగణాలు, మెరపులు, కనకాది ధనరాసులు, నీవూ, శివుడూ, మహర్షులు, నేను నీళ్లలో, ఆకాశంలో, భూమిమీద సంచరించే వివిధ ప్రాణులతో గూడిన ఈ ప్రపంచము – అంతా విష్ణుమయమే.. వేయిమాట లెందుకు బ్రహ్మాండభాండాలన్నీ అతని జానలో ఇమిడిపోతాయి.. కేవలం బుద్ధిబలంతో మనం ఆ దేవదేవుని తెలుసుకో లేము.. కడచినవీ, ఇపుడున్న, రానున్న లోకాలన్నీ విష్ణువులోనే వున్నాయి.

92. మండలములోన భాస్కరుఁ
డుండి జగంబులకు దీప్తి నొసఁగెడి క్రియ బ్ర
హ్మాండములోపల నచ్యుతుఁ
డుండుచు బహిరంతరముల నొగి వెలిఁగించున్.

తన మండలంలోనే తానుంటూ సూర్యుడు లోకాలకు కాంతి నిస్తున్నాడు.. అట్లే అచ్యుతుడు బ్రహ్మాండంలో ఉంటూనే లోపల, వెలుపల ప్రకాశింప జేస్తున్నాడు.

నారయ కృతి ఆరంభం

93. అటువంటి అనంతశక్తి గల విశ్వాత్ముని బొడ్డు తామరలో నేను పుట్టాను.. నాకు యజ్ఞం చేయాలనే బుద్ధి పుట్టింది.. కాని యజ్ఞాని కవసరమైన పదార్థా లేవీ నాకంటికి కనిపించలేదు.. అపుడు అతి స్వచ్ఛమైన ఆ భగవంతుని స్వరూపాన్ని దృఢంగా బుద్ధిలో నిలిపి ధ్యానం చేశాను. అపుడు నా మనస్సులో ఒక ఉపాయం తోచింది. 94. యజ్ఞపశువులు, యాగశాల, యూపస్తంభము, పాత్రలు, మట్టి కుండలు, మూకుళ్లు, యాగానికిక తగిన వసంత ఋతువు, నేయి, వడ్లూ మొదలైన ఓషధులు, కాంచనాదులైన వివిధలోహాలు, నలుగురు హోతలతో గూడిన దర్శపూర్ణిమాసాది కర్మలూ, జ్యోతిష్టోమాది నామాలు, మంత్రాలు, సంకల్పము, ఋగ్యజుస్సామ వేదాలలోని వషట్కారాలతో గూడిన మంత్రాలు, యాగదక్షిణలు, దేవతాధ్యానము, దానికి తగిన తంత్రాలు, వ్రతాలు, భూసురులు, దేవతల నుద్దేశించి చేసే కర్మ సమర్పణము, బోధాయనాది కల్పగ్రంథాలలోని కర్మక్రమము, యజ్ఞానికి కావలసిన ఇతర సంభారాలు; ఇవన్నీ ఆ పరమేశ్వరుని అవయవాలుగా కల్పించాను.. ఆపై శాస్త్రోక్త విధిని అనుసరించాను.

95. యజ్ఞాంగి యజ్ఞఫలదుఁడు
యజ్ఞేశుఁడు యజ్ఞకర్తయగు భగవంతున్
యజ్ఞపురుషుఁగా మానస
యజ్ఞముఁ గావించితిం దదర్పణ బుద్ధిన్.

యజ్ఞం శరీర మైన వాడు, యజ్ఞానికి ఫలితా న్నిచ్చే వాడు, ప్రభువు, కర్తా అయినట్టి ఆ భగవంతుని యజ్ఞ పురుషునిగా చేసుకొన్నాను.. ఆ యజ్ఞాన్ని ఆయనకే అర్పించా లనే బుద్ధితో మానసయజ్ఞం చేశాను.

బ్రహ్మదేవుడు నారదునికి విశ్వ ప్రకారం వివరించి చెప్తున్నాడు.. ఇది నారయ పూరించిన భాగంలోని దని అంటారు. 96. అప్పుడు మరీచి మున్నగు ప్రజా పతులు నేను చేసిన యాగం చూసి తాము గూడా ఉత్సుకులై ఆ భగవానునికి ప్రీతి కలగేటట్లు యజ్ఞం చేశారు. 97. అది చూసి స్వాయంభువుడు మొదలైన మనువులు, దేవతలు, దానవులు, రాజులు, మనుష్యులు మున్నగు వారు అందరూ, వాళ్ల వాళ్ల కిష్టమైన దేవతలను కొలుస్తూ సాటిలేనివాడు, యజ్ఞ స్వరూపుడైన లక్ష్మీనాథునకు ఫలం చెందునట్లుగా మహానిష్ఠతో యజ్ఞాలు చేశారు. 98. స్పష్టమైన తంత్రరూపం కలవాడు, ఇతరులకు వ్యక్తం కానివాడు, తుదిలేనివాడు, పుట్టుక లేనివాడు, చ్యుతి లేనివాడు,జగదీశ్వరుడు, అవ్యయుడైన శ్రీహరి దేవతలకు సేవింపదగినవాడు, యజ్ఞఫలాలను అనుగ్రహించేవాడు కావడం వల్ల పైన చెప్పిన వారందరూ అయన నుద్దేశించే యజ్ఞాలు చేశారు. 99. నారదా! పవిత్ర చరిత్రుడా! పరమేశ్వరుడు నిర్గుణుడైనా జగత్తులను సృష్టించడానికై నేర్పుతో ఆయన తన మాయా ప్రభావం వల్ల గుణసహితుడు అవుతున్నాడు.. అందుకే ఆయన భగవంతుడు అని చెప్పబడుతున్నాడు. 100.

విశ్వాత్ముఁడు, విశ్వేశుఁడు,
విశ్వమయుం, డఖిలనేత, విష్ణుఁ, డజుం, డీ
విశ్వములోఁ దా నుండును
విశ్వము దనలోనఁ జాల వెలుఁగుచు నుండన్.

(పుత్రుడు నారదునికి విష్ణుతత్వాన్ని బ్రహ్మదేవుడు ప్రబోధిస్తున్నాడు) విశ్వమే తానైన వాడు; విశ్వమునకు ప్రభువు; విశ్వమంతయు నిండి ఉన్నవాడు; సర్వమును నడిపించు వాడు; విశ్వమంతా వ్యాపించి యుండువాడు; పుట్టుక లేనివాడైన విష్ణువు ఈ జగత్తులో ఉండును; జగత్తు సమస్తము విష్ణుని లోపలే మిక్కిలి ప్రకాశిస్తూ ఉండును. 101. ఆ దేవదేవుని ఆనతిని అనుసరించి, చరాచర ప్రాణులతో గూడిన ఈ సృష్టిని నేను విస్తారంగా సృజిస్తున్నాను.. ప్రభావసంపన్నుడైన విష్ణువు దీనిని పోషిస్తున్నాడు.. పార్వతీనాథుడైన శివుడు దీనిని లయింప జేస్తున్నాడు.. పద్మనాభుడు, మొదటి వేలుపు, అచ్యుతుడైన శ్రీహరి సృష్టి స్థితిలయాల కన్నిటికి మూలహేతువై ఆ మూడు విధాలైన శక్తులతో కూడి వుంటాడు. 102. నీవు నన్ను అడిగిన ప్రశ్నకు

సమాధానం చెబుతాను, విను.. కుమారా! ఈ సమస్త విశ్వానికి ఆధారభూత మైనది పరబ్రహ్మము ఒకటే సుమా. 103.

పుత్రా! శ్రీహరి భగవానుడు, అంతము లేనివాడు, దయాసముద్రుడు, సృష్టి అనే కార్యానికి కారణభూత మైనవాడు.. ఆలోచించి చూచినచో ఆ ప్రభుని కంటే శ్రేష్ఠుడు ఇంకొక డెవ్వడూ లేడు.. 104. ఇప్పుడు నేను చెప్పినదంతా నిజం.. నేను అసత్యమాడను.. పండిత స్తుతి పాత్రుడవైన ఓ నారదా! విను.. కోరి ఆ భగవంతుని గుణాలను ధ్యానించడం వల్ల కలిగిన ప్రభావంతో, నే నేమి పలికినా అదంతా నిజమే అవుతుంది.. ఓ బుద్ధిమంతుడా! నా ఇంద్రియాలు ఏ సందర్భంలో గాని పొరపాటునగూడ అసత్యం వైపు ప్రసరించవు.. అంతే కాదు.. నా శరీరం వేదంతో సమానం.. దేవేంద్రునికి గూడ ఇది నమస్కరింపదగిన దయింది.. సంసార సాగరాన్ని దాటించేది, శుభాలకు హేతువైనది, సమస్తసంపదలను సమకూర్చేదైన ఆ దేవాదిదేవుని పాదపద్మ యుగళానికి నేను భక్తి భావంతో ప్రణామాలు చేస్తున్నాను. 105. నేను ఆ పద్మలోచనుని కుమారుడనే, ప్రజాపతినే, యోగ విద్యలో నేర్పరినే అయినను, నా పుట్టుక ఎలా జరిగిందో నేనే తెలుసుకో లేకున్నాను.. ఇక ఆ ప్రభుని ప్రదీప్త ప్రభావం ఎలా తెలుసుకోగలను ఆ లక్ష్మీనాథుడు కల్పించిన ఈ ప్రపంచం కొంచెం కొంచెం నాకు గోచరిస్తుంది..

. 106. ఓ మునివరా! వేయి మాట లెందుకు ఇది విను.. విశ్వస్వరూపుడైన ఈ పరమేశ్వరుడు తన మాయావైభవాన్ని కడముట్టా తానే గ్రహించలేడు ఇది వాస్తవం.. అలాంటప్పుడు నేను గాని, మీరు గాని, ఇంద్రాది దేవతలు గాని, కడకు శివుడు గానీ, మన జ్ఞానంతోటి, క్రియలతోటి ఉపాయాలతో సత్యంగా తెలిసికోనుట సాధ్యామా? 107. ఆ మహాత్ముడైన పద్మనేత్రుడు సర్వజ్ఞుడు గదా.. తన మహిమ అయన కెందుకు తెలియదు అని నీవు ప్రశ్నించవచ్చు.. ఆ విషయం వివరిస్తాను, విను. 108. ఆకాశం తన సరిహద్దులను తెలుసుకోలేదు.. అదే విధంగా భగవంతుడు తన సమగ్రతను తానే ఎరుగలేడు.. సరిహద్దుల నెరుగదు అన్నంత మాత్రాన ఆకాశ సర్వ వ్యాప్తిత్వాన్ని కాదన లేము కదా.. అలాగే తన అంతు తనకే తెలియదు అన్నంత మాత్రాన భగవంతుని సర్వజ్ఞత్వానికి లోటు వాటిల్లదు.

*బ్రహ్మదేవుడు నారదునికి భగవత్తత్వం ఉపదేశించే సందర్భంలో ఇలా చెప్తున్నాడు.. భగవంతుడు సర్వజ్ఞుడు కనుక తన పరిధి, వ్యాప్తుల పరిమితులు తెలియవు అనడంలో అసంభవం ఏమి లేదు.*

పరమాత్ముని లీలలు

109. జగద్రక్షణకు పూనుకొని ఆ యా అవతారాలలో ఆ మహాత్ముడు చేసిన పనులను, నాలాంటి వాళ్ళం అందరం వేల రకాలుగా వినుతిస్తూ వుంటాం.. మహామహుడు, తుది లేనివాడు, చిదచిత్స్వరూపుడు, మొదటివాడు, తనకు ప్రభువు లేనివాడు, తానే ప్రభువైనవాడైన ఆ దేవదేవుని ఎంత ప్రయత్నించినా మనం తెలుసుకోగలమా? దివ్యశీలుడైన ఆ దేవదేవునకు నేను నమస్కరిస్తాను.. 110. పరమాత్ముడు, పుట్టుకలేని వాడు ప్రతికల్పంలో ఈ విశ్వాన్ని పుట్టిస్తాడు, పోషిస్తాడు, సంహరిస్తాడు.. పాపరహితుడు, బ్రహ్మస్వరూపుడు, శాశ్వతుడు, జగమంతా నిండినవాడు, కేవలుడు, సాటిలేనివాడు, నిర్మలమైన జ్ఞానం కల వాడు, సర్వాంతర్యామి, తుదిమొదళ్లు లేనివాడు, గుణరహితుడు, నిత్యుడైన ఆ పరమేశ్వరుణ్ణి ధ్యానిస్తున్నాను. 111. నారదమునీశ్వరా! మునీశ్వరులు తమ శరీరం, ఇంద్రియాలు, మనస్సు ప్రసన్నంగా ఉన్నప్పుడు మాత్రమే ఆ పరమాత్ముని మహితకళావిలసితమైన స్వరూపం చూడగలరు.. ఎప్పుడు కుతర్కము అనే తమస్సు కమ్ముకుని అజ్ఞానం కలుగుతుందో అప్పుడు ఆ దేవుని స్వరూపం గుర్తించలేరు. ”112. అని నారదమహర్షికి చెప్పి మళ్లీ బ్రహ్మదేవుడు ఇలా చెప్పసాగాడు.

“పాపరహితుడు వేల తలలు, వేల నేత్రాలు, వేల పాదాలు కలిగి ప్రకృతిని ప్రవర్తింపజేసే ఆదిపురుషుని రూపమే మహాతేజస్వి అయిన ఆ దేవదేవుని మొదటి అవతారం.. ఆ అవతార స్వరూపం నుండి కాలము, స్వభావము అనే రెండు శక్తులు పుట్టాయి.. అందులోనుంచి కార్యకారణ రూపమైన ప్రకృతి పుట్టింది.. ప్రకృతి నుండి మహత్తత్త్వం పుట్టింది.. దానినుండి రాజసాహంకారం, సాత్త్వికాహంకారం, తామసాహంకారం అనే మూడు అహంకారాలు పుట్టాయి.. వాటిలో రాజసాహంకారంనుండి ఇంద్రియాలు పుట్టాయి.. సాత్త్వికాహంకారం నుండి ఇంద్రియగుణాలు ప్రధానంగా గల ఇంద్రాది దేవతలు పుట్టారు.. తామసాహంకారం నుండి పంచభూతాలకు హేతువులైన శబ్దం.. స్పర్శం, రూపం, రసం, గంధం అనే తన్మాత్రలు పుట్టాయి.. ఆ తన్మాత్రలనుండి ఆకాశం.. వాయువు, అగ్ని, జలం, భూమి

అనే పంచభూతాలు ప్రభవించాయి.. వాటి నుండి త్వక్కు, చక్షువు, శ్రోత్రం, జిహ్వ, ఘ్రాణం అనే జ్ఞానేంద్రియాలు మనస్సు పుట్టాయి.. వీటన్నిటి చేరికవల్ల విశ్వరూపుడైన విరాట్పురుషుడు ఉదయించాడు.. అతని నుండి స్వయంప్రకాశుడైన స్వరాట్టు ఆవిర్భవించాడు.. అతనిలో నించి చరాచర రూపాలతో స్థావరజంగమాత్మకం అయిన జగత్తు పుట్టింది.. అందుండి సత్త్వగుణ స్వరుపూడైన విష్ణువు, రజోగుణ స్వరూపుడనైన హిరణ్యగర్భుడనబడే నేను, తమోగుణ స్వరూపుడైన రుద్రుడు జన్మించాము.. అందుండి సృష్టి ఉత్పత్తికి హేతువైన నాలుగు ముఖాల బ్రహ్మ (చతుర్ముఖ బ్రహ్మ) ఉద్భవించాడు.. ఆయనవల్ల దక్షుడు మొదలైన తొమ్మిది మంది ప్రజాపతులు పుట్టారు.. నీవు, సనకుడు, సనందుడు మొదలైన యోగీశ్వరులు, స్వర్గలోకంలో వుండే ఇంద్రాదులు, పక్షిలోక రక్షకులైన గరుడాదులు, మానవలోకాన్ని పాలించే మనువు, మాంధాత మొదలగు వారు, రసాతలలోకాన్ని పాలించే అనంతుడు, వాసుకి మొదలైన వారు, ఇంకా గంధర్వులు, సిద్ధులు, విద్యాధరులు, చారణులు, సాధ్యులు, రాక్షసులు, యక్షులు, ఉరగులు, నాగులు, ఆయా జాతులను పాలించేవారు, ఋషులు, పితృదేవతలు, దైత్యులు, భూతాలు, ప్రేతాలు, పిశాచాలు, కూశ్మాండులు ఇంకా అన్ని పశుమృగాదులు ఉద్భవించాయి.. ఇలాంటి జగత్తు మొదటి పుట్టుకను మహత్తత్త్వ సృష్టి అంటారు.. రెండవది అండగతమైన సృష్టి, మూడవది సమస్త భూతగతమైన సృష్టి, అందులో ఐశ్వర్యము, తేజస్సు, బలము గల పురుషులు సర్వాంతర్యామి అయిన శ్రీ మన్నారాయణుని అంశ యందు పుట్టినవారుగా తెలుసుకో.. ఆ అరవిందాక్షుని లీలావతారాలకు అంతం లేదు.. ఆయన ఆచరించే మంచి పనులు లెక్కించడం ఎవరికీ శక్యం గాదు.. అయినను, నాకు తోచినంత వరకు నీకు వినిపించెదను, విను.

# అవతారముల వైభవము

113. పగలురాత్రి ఎప్పుడైనా ఇతర కథాప్రసంగాలు వింటూ ఏ మాత్రం పుణ్యకథల చొరనీయని వీనులకు విష్ణుకథలు విందుచేస్తాయి.. సకల లోకపూజనీయమై వెలుగొందే ఆ దేవదేవుని దివ్యమంగళ కథాసుధారసాన్ని నేను నీకు అందిస్తాను.. సద్బుద్ధితో ఆస్వాదించవయ్యా.. విజ్ఞానశేఖరులకు ఆరాధనీయుడవైన నారదా!"

114. ఈవిధంగా పలికి, నారదునితో బ్రహ్మ మళ్లీ ఇలా చెప్పసాగాడు. 115. "పూర్వం హిరణ్యాక్షుడనే రాక్షసుడు బాహుబలాటోపంతో భూమండలాన్ని చాపచుట్టినట్లు చుట్టి

తీసుకొనిపోయాడు.. అప్పుడు శ్రీమన్నారాయణుడు యజ్ఞవరాహరూపం ధరించి, ఆ దానవరాజుతో దారుణమైన యుద్ధం చేసాడు.. అపార పారావారం నడుమ కోరలతో క్రుమ్మి ఆ రక్కసుడి ఉక్కడగించాడు.

వజ్రాయుధం వేటుకు నేలగూలే మహాపర్వతం లాగా వాడు అతిభీకరాకారంతో మట్టిలో కలిసాడు.. ఇది యజ్ఞవరాహావరతార కథ. 116.

ఇక సుయజ్ఞావతారం ఎలా జరిగిందో చెబుతాను విను" మని నారదునితో బ్రహ్మ మళ్లీ ఇలా వివరించాడు. 117. పూర్వం రుచి అనే ప్రజాపతికి, స్వాయం భువ మనువు కూతురైన ఆకూతి అనే సుగుణవతికి సుయజ్ఞుడు అనేవాడు పుట్టాడు.. అతడు దక్షిణ అనే కాంతను భార్యగా స్వీకరించాడు.. ఆమె కడుపున సుయములు అను పేరుగల వేల్పులను జన్మింపజేశాడు.. ఇంద్రుడై దేవతలకు నాయకత్వం వహించాడు.. విష్ణువులాగా సమస్తలోకాల దుఃఖాన్నీ పరిహరింప జేశాడు.. తాత యైన స్వాయంభువమనువు తన మనుమని చరిత్రకు మనసులో ఎంతో సంతోషించి ఈ పరమ పవిత్రుడు శ్రీహరియే అని పలికాడు.. మునీంద్రా ఆ కారణంవల్ల ఉత్తమ జ్ఞానానికి నిధియైన సుయజ్ఞుడు హరి అవతారంగా ప్రశస్తి వహించాడు. "

118. ఇలా సుయజ్ఞావతారం గురించి చెప్పి బ్రహ్మదేవుడు, షడ్దర్శనాలలో ఒకటైన సాంఖ్య యోగం ప్రవర్తింపజేసిన కపిల మహర్షి అవతారగాథను ఆలకించ" మంటూ ఇలా అన్నాడు.

119. "దేవహూతి నిశ్చలమతి అయిన సతి.. దివ్యతేజస్వి యైన కర్దమ ప్రజాపతి ఆమె పతి.. ఆ దంపతులకు ఆనందం అతిశయింపగా తొమ్మండుగురు ఆడు తోబుట్టువులతో సహా శ్రీహరి కపిలుడు అన్న పేరుతో ఆవిర్భవించాడు.. ఏ యోగంతో నారాయణుని పొందటానికి వీలవుతుందో, ఆ మనోజ్ఞ. సాంఖ్య యోగాన్ని ఆ మహనీయుడు తల్లికి బోధించాడు.. ఆ విధంగా ఆమె పాపాలు రూపుమాపి మునులు అపేక్షించే మోక్షాన్ని ఆమెకు ప్రసాదించాడు. "120. ఇక దత్తాత్రేయుని అవతారం ఎలా విలసిల్లిందో వివరిస్తాను విను. 121.

"అత్రిమహర్షి మునులలో ముఖ్యుడు.. ఆయన తనకు పుత్రుణ్ణి ప్రసాదించమని లక్ష్మీనాథుణ్ణి ప్రార్థించాడు.. అప్పుడు శ్రీహరి "పాపరహితుడవైన ఓ మునీంద్రా! నేను

నీకు దత్తుడ నయ్యాను" అని అన్నాడు.. అందువల్ల హరియే అత్రికి దత్తాత్రేయుడై జన్మించాడు.. ఆ మహనీయుని పాదపద్మపరాగం సోకి హైహయ వంశానికి, యదువంశానికి చెందిన వారందరు పవిత్ర దేహులయ్యారు.

ఆయన అనుగ్రహంవల్లనే వాళ్లు ఇహపరలోకాలు ప్రసాదించే యోగబలం ఆర్జించుకొన్నారు.. జ్ఞానఫలాన్ని, సుఖాన్ని, ఐశ్వర్యాన్ని, శక్తిని, శౌర్యాన్ని పొందారు.. తమ కీర్తి మింట వెలుగొందుతుండగా ఉభయలోకాలలో ప్రసిద్ధి వహించారు.. అట్టి దివ్యరూపుడైన విష్ణుదేవుని వినుతించడం సాధ్యమా! 122.. ఇక సనకాదుల అవతార ప్రకారం ఆకర్ణించు. 123.

పవిత్రాత్మా! నారదా! నేను కల్పారంభంలో విశ్వాన్ని సృష్టింపదలచు కొన్నాను.. అందుకై తపస్సు చేస్తూ "సన" అని పలికాను .. అందువల్ల **సన** పేరుతో "సనకుడు, సనందుడు, సనత్కుమారుడు, సనత్సుజాతుడు" అనే నలుగురు పుట్టారు.. వాళ్లు బ్రహ్మమానసపుత్రులుగా ప్రపంచంలో ప్రసిద్ధికెక్కారు.. గతించిన కల్పం చివర అంతరించిపోయిన ఆత్మ తత్త్వాన్ని వాళ్లు మళ్లీ లోకంలో సంప్రదాయానుసారంగా ప్రవర్తింపజేశారు.. నయశీలుడా! ఆ విష్ణుదేవుని కళలతో జన్మించిన వాళ్లు నలుగురైననూ నిజానికి వారి అవతారం ఒక్కటే.

నరనారాయణావతారం



124. ఇంక నరనారాయణుల అవతార పద్ధతి ఆలకించు. 125. మిక్కిలి ప్రసిద్ధమైన గుణాలు గలవారు, మిక్కిలి పవిత్ర మూర్తులైన నరనారాయణు లనేవారు ధర్మానికి అధిష్ఠానమైన ధర్ముడికి, దక్షుని కుమార్తె ఐన మూర్తి యందు, జన్మించారు. 126. అలా అవతరించిన నరనారాయణులు బదరికావనంలో గొప్ప తపస్సు చేయసాగారు. అందువలన, తన పదవికి ప్రమాదం వాటిల్లుతుంది అని ఇంద్రుడు బెదిరాడు.. అందుచేత ఇంద్రుడు దేవకాంతలను పిలిపించి "నరనారాయణుల తపస్సు చెడగొట్టండి" అని పంపాడు.

127.. అప్సరసలు ఎంతో సంతోషంతో మన్మథుని చతురంగసేనలా అన్నట్లు జయలుదేరి బదరీవనానికి వెళ్ళారు. 128. అంతట, ఆ బదరికా వనంలో. 129. నరుడు, నారాయణుడు తపస్సు చేస్తున్న ప్రదేశానికి దేవకాంతలు సవిలాసంగా వచ్చారు. అందచందాల తీరు, కళానైపుణ్యాల సౌరు ఉట్టిపడేలా పరాచికాలాడుతూ, ఆటలాడుతూ, పాటలు పాడుతూ విహరించారు.. అలా విలాసలీలలతో తపో వనంలో విచ్చలవిడిగా విహరిస్తున్న అప్సరసలను నరనారాయణులు చూసారు.. కాని ఏ మాత్రం చలించలేదు.. కామానికి లోను కాలేదు.. నిశ్చింతులై, నిర్మోహులై వాళ్ళు అలాగే నిరతిశయ నిశ్చల ధ్యానంతో మహా తపస్సుతో నిమగ్నులై ఉండి పోయారు.

130. క్రోధము దమ తపములకును
బాధక మగు టెఱిఁగి దివిజభామలపై న
మ్మేధాత్మకు లొక యింతయు
క్రోధముఁ దేరైరి సత్వగుణయుతు లగుటన్.

తమ తపస్సులకు కోపం నష్టదాయకమని తెలిసిన సత్త్వ సంపన్నులు, బుద్ధి మంతులైన నరనారాయణులు సురసుందరులపై ఏ మాత్రం కోపం చూపలేదు. 131. అప్పుడు నారాయణుడు తన ఊరుభాగాన్ని గోటితో గీరాడు.. అతని తొడలో నుండి అమరాంగ నలు అచ్చెరువొందేలా ఊర్వశి మొదలైన అప్సరస స్త్రీ సమూహం ఉద్భవించింది. 132. నారాయణుని ఊరువు నుండి పుట్టడంవల్ల ఆమె ఊర్వశి అని పేరుగాంచింది.. ఇంద్రుడు పంపగా వచ్చిన అప్సరసలు ఊర్వశి మొదలైన వాళ్ల అందచందాలు, హావభావాలు, వినోదవిహారాలు చూసి లజ్జతో కుంచించుకు పోయారు. 133.. నరనారాయణులు తలపు మాత్రంచే సృష్టిస్థితిలయాలు చేయగలరు.. అంతటి మహానుభావుల తపస్సుకు భంగం కలిగించడానికి చేసిన తమ శృంగార విలాసాలు. కృతఘ్నుడికి చేసిన ఉపకారాలలా నిరుపయోగాలయ్యాయని దేవరమణులు గ్రహించారు.. దానితో వాళ్లు సిగ్గుతో పరితపించారు.. ఆ ఊర్వశినే తమకు నాయకురాలుగా చేసుకొని వచ్చనదారినే వెళ్ళిపోయారు..

134. కామానికి అధిదేవతయైన మన్మథుని, పూర్వం శివుడు తన కోపపు తీవ్రతచే కాల్చివేసాడు.. అంతటి అలవికానిది కోపము.. అటువంటి కోపాన్ని కూడ

జయించారు ఆ మహా జ్ఞానులు నరనారాయణులు.. ఇక కామాన్ని గెలవటం గురించి చెప్పేదేం ఉంది. 135. అలాంటి నరనారాయణుల అవతారం భువనత్రయాన్ని పవిత్రం చేసినది.. ఇక ధ్రువావతారం వివరిస్తాను, విను.. 136. ఉత్తమచరిత్రుడైన ఉత్తానపాదుడనే రాజుకు సత్పుత్రుడుగా ధ్రువుడు జన్మించాడు, ప్రభావసంపన్నుడై పేరుగాంచాడు. చిన్న తనంలో ఒకనాడు తండ్రివద్ద ఉన్నప్పుడు సవతితల్లి సురుచి అతణ్ణి నిందావచనాలనే అస్త్రాలతో నొప్పించింది.. దుఃఖితుడైన ధ్రువుడు గొప్ప తపస్సు చేసాడు. ఆ తపస్సుఫలించింది. భగవంతుడుసాక్షాత్కరించి అతణ్ణి అనుగ్రహిం చాడు.. అతడు సశరీరంగా ఆకాశంలో మహోన్నత ధ్రువస్థానంలో స్థిరపడ్డారు.. ఆ స్థానానికి పైన వుండే భృగువు మొదలైన మహర్షులూ, క్రింద వుండే సప్తర్షులూ ఆ మహనీయుణ్ణి గొప్పగా ప్రశంసించారు.. అతడు ధ్రువుడనే పేరుతో ప్రకాశించి విష్ణువుతో సమానుడైనాడు.. ఇప్పుడు కూడా ఆ పుణ్యాత్ముడు ధ్రువస్థానం లోనే వున్నాడు. 137. మరింక పృథుచక్రవర్తి అవతారం గురించి విను. 138. వేను డనే భూపాలుడు భూసురుల శాపాలనే వజ్రాయుధం దెబ్బలు తిని, సిరిని పౌరుషాన్ని కోల్పోయాడు.. తుదకు నరకం పాలయ్యాడు.. అతనికి పృథుడనే కుమారుడు కలిగాడు.. అతడు తండ్రిని పున్నామనరకం నుండి రక్షించాడు. శ్రీహరి కళాంశభవుడైన ఆ పృథుచక్రవర్తి భూమిని ధేనువుగా జేసి అమూల్య మైన అనేక వస్తువులను పిదికాడు. ”

★*గమనిక:- వేనుడు పుత్రులు లేక మరణించడంతో పున్నామనరకంలో పడ్డాడు,* అతని శరీరాన్ని మథించగా జన్మించిన పృథువు గొప్ప చక్రవర్తి అయ్యాడు.. తండ్రి పున్నామనరకం నుండి బయటపడ్డాడు.. 139. ఇలా చెప్పిన బ్రహ్మదేవుడు మళ్లీ నారదునికి ఇలా చెప్పసాగాడు.. “ఇప్పుడు వృషభుని అవతారం తెలియపరుస్తాను.. ఆలకించు.

అగ్నీధ్రు డనే వాడికి నాభి అనే కొడుకు పుట్టాడు.. నాభి భార్య సుదేవి.. అమెకు మేరుదేవి అని మరో పేరుంది.. ఆమెకు హరి వృషభావతారుడై అవతరించాడు.. అతడు జడశీలమైన యోగం పూనాడు.. ప్రశాంతమైన చిత్తం పొంది ఇతరుల పొత్తు వదిలాడు.. ఇది పరమహంసలు పొందదగిన స్థితి అని తన్ను గూర్చి మహర్షులు ప్రశంసించేటట్లు మెలగాడు.. మరింక హయగ్రీవుని అవతార విశేషాలు చెప్తాను ఆలకించు. 140. నారద! సచ్చరిత్ర! మేలిమిబంగారు కాంతికలవాడు, వేద స్వరూపుడు, సర్వాంతర్యామి, సాటిలేని యజ్ఞపురుషుడు హయగ్రీవునిగా దేవదేవుడు

నేను చేసిన యజ్ఞంలోనుండి అవతరించాడు.. సర్వాన్నీ పవిత్రం చేసే ఆ హయగ్రీవుని ముకుపుటాలలోని శ్వాసవాయువుల నుండి వేదాలు ప్రాదుర్భవించాయి.



## మత్స్యావతారం

141. మరిప్పుడు మత్స్యావతారం గురించి చెబుతాను ఆకర్ణించు. 142. ప్రళయకాలంలో సమస్తము జలమయమైపోయింది.. ఆ పరిస్థితి ముందే తెలుపబడిన వైవస్వతమనువు ఒక పడవపై ఎక్కి కూర్చున్నాడు. అంతట భగవంతుడు విచిత్రమైన మత్స్యావతార మెత్తాడు.. భూతలానికి ఆశ్రయమైన ఆ దేవుడప్పుడు ఎల్లప్రాణులకూ నివాసభూతుడైనాడు.. నా వదనంనుండి జారిపోయిన వేదశాఖలు సంకీర్ణం కాకుండా విభజించి దేవతల కోరికమేరకు మళ్ళీ నాకు ప్రీతితో అందజేశాడు.. వైవస్వతమనువు అధిష్ఠించిన నావ సముద్రంలో మునిగిపోకుండా కాపాడాడు.. నాయనా! ఆ మత్స్యావతార మహత్యాన్ని వివరించడం ఎవరికి సాధ్యం. 143.



. తరువాత కూర్మావతార వృత్తాంతం విను...... . 144. నారదా! పూర్వం దేవతలు, రాక్షసులు కలిసి. సాధించాలనే ప్రయత్నంలో మందర గిరిని కవ్వంగా జేసుకొని క్షీరసాగరాన్ని మథించారు.. ఆ కవ్వపు కొండ కడలి నడుమ మునిగిపోయింది. అప్పుడు శ్రీమన్నారాయణుడు తన వీపుదురద తొలగించుకోవ టానికా అన్నట్లు గిరగిర తిరుగుతున్న గిరిని కూర్మరూపం ధరించాడు..

145.. పిమ్మట నృసింహావతారం గురించి వివరిస్తాను.. ఆకర్ణించు. 146. ఒకప్పుడు రాక్షసుడు హిరణ్యకశిపుడు, దేవలోకంపై దండెత్తి దేవతలను బాధించ

ప.. ప్రచండమైన గదాదండం చెబూని వస్తున్న ఆ దానవుణ్ణి శ్రీహరి చూచాడు.. వాణ్ణి ఫరిమార్చి ముల్లోకాలకు క్షేమం కలిగించాలనుకొన్నాడు.. వెంటనే కోరలతో భీతికొలిపే నోరు, కోపంతో ముడివడ్డ కనుబొమ్మలు కలిగిన నరసింహావతారం ధరించాడు.. వాడి గోళ్లతో ఆ రాక్షసేశ్వరుని వక్షం చీల్చి హతమార్చాడు.. 147.. మరిప్పుడు ఆదిమూలావతారము వివరము తెలుపుతాను.. ఆలకించు.. 148.

ఓ మహర్షి! నారదా! గజేంద్రుడు మొసలిచేత పట్టువడి దుఃఖించసాగాడు.. వేయి సంవత్సరాలు దానితో పెనగులాడి రక్షణకై విశ్వమయునికి మొరపెట్టుకొన్నాడు.. నీవే నాకిక దిక్కు అని ఆర్తుడై ఆక్రందనం చేసాడు.. తక్కిన దేవతలు విశ్వ మయులు కారు.. కాబట్టి అతని ఆపద మాన్పలేక పోయారు.. అది విన్న వెను వెంటనే పరమాత్ముడు, శ్రీహరి ఆదిమూల స్వరూపుడై వచ్చి పరమఉత్సాహంతో మకరిని చంపి కరిని కాపాడాడు. 149. ఇక వామనావతారం వర్ణిస్తాను,విను..



150. యజ్ఞాధిపుడైన విష్ణువు అదితి బిడ్డలలో. . కనిష్ఠుడైనా ఉత్తమ గుణాలలో అందరికంటే జ్యేష్ఠుడు.. అయన వామనాకారంతో బలి చక్రవర్తి దగ్గరకు వచ్చి మూడడుగుల నేల అతణ్ణి యాచించి పుచ్చుకొన్నాడు.. ఆ మూడడుగులతో ముల్లోకాలను ఆక్రమించి వంచనతో అపహరించాడు.. తాను సర్వేశ్వరుడై వుండికూడ ఇంద్రుడికి రాజ్యం ముట్టజెప్పడానికై ఆయన వంచనతో బలిని యాచించవలసి వచ్చింది.. సత్య ధర్మాత్ముల సొమ్ము వినయంగా వెళ్లి ఉచిత పద్ధతిలో గ్రహించాలి.. అంతే కాని మూర్ఖత్వంతో పోట్లాడి ఆక్రమించ గూడదు సుమా.. ఇది నిజం. 151. పరమదాత అయిన బలిచక్రవర్తి ఆ బ్రహ్మచారి వామనుని పాదపద్మాలు కడిగిన పవిత్ర తీర్థాన్ని ఉత్సుకతతో తలమీద చల్లుకున్నాడు.. తనతోపాటు మూడులోకాలను నారాయణుడికి ధారాదత్తం చేసాడు.. విశ్వమంతట శాశ్వతమైన యశస్సు నిలుపుకొన్నాడు.. ఆ దానంవల్ల దేవలోకం మీద తనకున్న పెత్తనం పోతుందని జంక లేదు.. తనకు హాని జరుగుతుందని శుక్రాచార్యుడు చెప్పినా

లక్ష్య పెట్టలేదు. 152. ఓ నారదా! అంతేకాదు.. ఆ పరమేశ్వరుడు హంసావతార మెత్తాడు.. అతిశయమైన భక్తియోగంతో సంతసించిన వాడయ్యాడు.. నీకు ఆత్మతత్త్వం తెలియపరచే భాగవత మనే మహాపురాణం ఉపదేశించాడు.. మనువుగా అవతరించి తన తేజో మహిమతో అమోఘమైన చక్రం చేబూని దుర్జనులైన రాజులను శిక్షించాడు, సజ్జనులను రక్షించాడు.. తన కీర్తిచంద్రికలు సత్యలోకంలో ప్రకాశింప జేశాడు.. ఇంకా ధన్వంతరిగా అవతారం దాల్చాడు.. తన నామస్మరణతోనే భూమిమీది జనానికి రోగాలన్నీ పోగొట్టుచూ ఆయుర్వేదం కల్పించాడు.. ఇక పరశురామావతారం ఎలా జరిగిందో వివరిస్తాను, ఆకర్ణించు. 153.

మునీంద్రులలో అగ్రగణ్యుడవైన నారద! హైహయరాజులు లోక విరోధులై దురుసుగా ప్రవర్తించారు.. వాళ్లను శిక్షించడానికి శ్రీమన్నారాయణమూర్తి జమదగ్నిసుతుడైన ఆ పరశురాముడుగా అవతరించాడు.. రణరంగంలో ఇరవై యొక్కసార్లు ఈ రాజసమూహాన్ని దారుణమైన తన గండ్రగొడ్డలితో చెండాడు.. బ్రాహ్మణులు వేడుకోగా భూమండల మంతా వాళ్లకు దానం చేసాడు.. ఆ భార్గవరాముడు అలా శాశ్వత కీర్తితో వెలుగొందాడు.

రామావతారం

154. శ్రీ మహావిష్ణువు లోకోపకారం చేయడానికై జగదభిరాముడైన శ్రీరాముడుగా అవతరించాడు.. ఆ వృత్తాంతం వివరిస్తాను విను. 155. ఆయన సూర్యవంశమనే పాల్కడలికి పున్నమ చంద్రుడు.. కోసలరాజు కూతురైన కౌసల్యాదేవి గర్భమనే ముత్తెపు చిప్పలో పుట్టిన మేలి ముత్యము.. తన పాద సేవకుల శోకమనే చిమ్మచీకట్లను పోకార్చే సూర్యభగవానుడు.. దశరథ మహారాజు గారి పుత్రకామేష్ఠి యాగశాల ముంగిట మొలకెత్తిన కల్పవృక్షం.. దానవులనే దారుణారణ్యాన్ని దహించే కార్చిచ్చు.. రావణుని గర్వమనే పర్వతాన్ని బద్దలు చేసే ఇంద్రుడు.. అయిన శ్రీరాముడుగా, చక్రధారి శ్రీ మహావిష్ణువు లోకోపకారం చేయుటకొరకు జగదభిరాముడై అవతరించాడు.

156. చిత్రముగ భరత లక్ష్మణ
శత్రుఘ్నుల కర్థి నగ్రజన్ముం డగుచున్
ధాత్రిన్ రాముఁడు వెలసెఁ బ
విత్రుఁడు దుష్కృత లతా లవిత్రుం డగుచున్.

శ్రీరామచంద్రునిగా అవతరించాడు.. భరత లక్ష్మణ శత్రుఘ్నులకు అన్నగా జన్మించాడు.. భూలోకంలో పరమ పవిత్రుడుగా, పాపాలనే కలుపు తీగలను కోసి వేసే కొడవలి వంటి వాడుగా ప్రసిద్ధికెక్కాడు. 157. అప్పుడు.. 158.. శ్రీరాముడు శివుని ధనుర్భంగం ఓలి కాగా జనకమహారాజు పుత్రిక సీతాదేవిని చేపట్టాడు..

ఆ మహాదేవి పాదాలు చివుళ్ల వంటివి, ఫాలం అర్ధచంద్రుని వంటిది, భుజాలు తామరతూండ్ల వంటివి, దంతాలు మొల్లల వంటివి, హస్తాలు పద్మాల వంటివి, నేత్రాలు కలువల వంటివి, పిక్కలు మృదంగముల వంటివి, తొడలు ఏనుగు తొండము వంటివి, స్తనాలు చక్రవాకాల వంటివి, నడుము ఆకాశం వంటిది, పిరుదులు ఇసుక తిన్నెల వంటివి, కంఠం శంఖం వంటిది, చెక్కిళ్లు అద్దాల వంటివి, శరీర పరిమళం చందనం వంటిది, పెదవి దొండపండు వంటిది, ముక్కు సంపెంగ వంటిది, మోము చంద్రుని వంటిది.. శరీరం స్వర్ణం వంటిది, చూపులు చేపల వంటివి, కనుబొమలు ధనుస్సు వంటివి, తల వెండ్రుకలు నీలాల వంటివి ముంగురులు తుమ్మెదల వంటివి, నవ్వు అమృతం వంటిది, బొడ్డు సుడి వంటిది.. 159.. పిమ్మట. 160.



రామున్ మేచకజలద
శ్యామున్ సుగుణాభిరాము సద్వైభవసు
త్రామున్ దుష్టనిశాటవి
రాముం బొమ్మనియెఁ బంక్తిరథుఁ డడవులకున్.

నల్లని మేఘఛాయతో మెరిసిపోతు ఉండే వాడు, సర్వసుగుణాలతో ఒప్పి ఉండే వాడు, ఐశ్వర్యంతో ఇంద్రునికి సాటివచ్చే వాడు, దుష్ట రాక్షసులను చెండాడెడి శ్రీరామచంద్రుడిని దశరథుడు అడవులకు పొమ్మన్నాడు.. 161.. అలా పంపేసరికి. 162. లక్ష్మణుడు, సీత అడవులకు వెళ్తున్న రాముడి వెంట వెళ్ళారు.. అలా రఘువంశ లలాముడైన శ్రీరాముడు సివంగులు, సింహాలు, అడవిపందులు, ఏనుగులు, పులులు, కోతులు, ఖడ్గమృగాలు, జింకలు, తోడేళ్లు, పాములు, ఎలుగుబంట్లు, అడవి దున్నలు మొదలైన అడవి మృగాలు వసించే అత్యంత భీకరమైన దండకారణ్యం ప్రవేశించాడు.. 163. రాజుల లందరిలో నీతిసంపన్నుడు, దయాసముద్రుడైన శ్రీరాముడు. దండకారణ్యం లో లోకాలను పవిత్రం చేసే మునులు అందరికీ అభయాలు యిచ్చాడు.

164. ఖరకర కుల జలనిధి హిమ
కరుఁ డగు రఘురామవిభుఁడు గఱకఱితోడన్
ఖరుని వధించెను ఘనభీ
కర శరముల నఖిల జనులుఁ గర మరుదందన్.

సూర్యవంశమనే సముద్రానికి చంద్రునివంటివాడైన ఆ రామచంద్రుడు అందలి జనులందరు ఆశ్చర్యపడగా కోపంతో మిక్కిలి భయంకరమైన బాణాలు ప్రయోగించి ఖరుడనే రక్కసుణ్ణి సంహరించాడు.

165. హరిసుతుఁ బరిచరుఁగాఁ గొని
హరిసుతుఁ దునుమాడి పనిచె హరిపురమునకున్;
హరివిభునకు హరిమధ్యను
హరిరాజ్యపదంబు నిచ్చె హరివిక్రముఁడై.

సింహపరాక్రముడైన శ్రీరామచంద్రుడు సూర్యసుతుడైన సుగ్రీవుణ్ణి అనుచరునిగ స్వీకరించాడు.. ఇంద్ర పుత్రుడైన వాలిని నేలగూల్చి యమపురికి పంపాడు.. వానరాధిపుడైన సుగ్రీవునికి కిష్కింధ రాజ్యాన్ని, సింహం వంటి నడుము గల రుమని అప్పగించాడు. 166. అటుపిమ్మట శ్రీరామచంద్రుడు సీత కొరకై ముల్లోకాలను బాధించేవాడైన రావణుణ్ణి సంహరింప దలచాడు.. వానర సేనలను వెంటబెట్టుకొని లంకవైపు పయనించాడు.. దక్షిణ సముద్రతీరం చేరాడు.. దాటుటకు వీలుగాని ఆ సాగరం దారి చూపనందున ఆయనకు ఆగ్రహం వచ్చింది. 167. ఆ మహావీరుడు రాముడు నొసట కనుబొమలు ముడివడగా, కోపం వల్ల ఎరుపెక్కిన నేత్రాలతో సముద్రం వైపు చూసాడు.. అలా చూసేసరికి సముద్రం, నీటికోళ్లు, తాబేళ్లు, పాములు, మొసళ్లు, తిమింగిలాలు, పగడపు తీగలు, తరంగాలు, కొంగలు, కన్నెలేడి యను పక్షులు, చక్రవాకాలు మొదలైన జలజంతువులతో సహా నీళ్లు తుకతుక ఉడకగా ఇంకి పోయింది. 168. అప్పుడు సముద్రుడు దయాసముద్రుడైన రామభద్రుడికి శరణాగతు డయ్యాడు.. రాము డతనిపై దయచూపి యథాప్రకారం ఉండమని అనుగ్రహించాడు.. నలుడనే వానర ప్రముఖునిచే వంతెన కట్టించి రాముడు సముద్రం దాటాడు.. 169.. పూర్వము శివుడు ఒకే బాణంతో త్రిపురాలను కాల్చివేసి నట్లు, రాముడు పెద్దపెద్ద గోపురాలు, శాలలు, ముంగిళ్లు, మేడలు , రాజగృహాలు, రచ్చలు, తలుపులు, రథాలు,

గుఱ్ఱాలు, ఏనుగులు, ఆయుధాగారాలు, రాక్షసగణాలతో నిండివున్న లంకానగరాన్ని చిటికలో భస్మీపటలం చేసాడు. 170.

. . . . . రావణు నఖిల జగద్వి
. . . . . ద్రావణుఁ బరిమార్చి నిలిపె రక్షోవిభుఁగా
. . . . . రావణుననుజన్ముని నై
. . . . . రావణసితకీర్తి మెఱసి రాఘవుఁ డెలమిన్.

ఈ విధంగా ఐరావత గజం వలె తెల్లని కీర్తితో ప్రకాశించిన శ్రీరాముడు సమస్త భువనాలనూ వేధించి బాధించిన రావణుని హతమార్చాడు.. అతని తమ్ముడైన విభీషణుణ్ణి రక్కసులకు రాజుగా చేసాడు.

171. ధర్మ సంరక్షకత్వప్రభావుం డయ్యు–
ధర్మవిధ్వంసకత్వమునఁ బొదలి
ఖరదండనాభిముఖ్యముఁ బొంద కుండియు–
ఖరదండ నాభిముఖ్యమున మెఱసి
బుణ్యజనావన స్ఫూర్తిఁ బెంపొందియుఁ–
పుణ్యజఁనాంతక స్ఫురణఁ దనరి
సంతతాశ్రిత విభీషణుఁడు గాకుండియు–
సంతతాశ్రిత విభీషణత నొప్పి
మించెఁ దనకీర్తిచేత వాసించె దిశలు;
దరమె నుతియింప జగతి నెవ్వరికినైనఁ
జారుతరమూర్తి నవనీశచక్రవర్తిఁ
బ్రకటగుణసాంద్రు దశరథరామచంద్రు.

ఆయన ధర్మాన్ని రక్షించినవాడు అనే మహత్వం కలిగి కూడ ధర్మవిధ్వంసకుడై ప్రకాశించాడు, అనగా శివధనుర్భంగం చేశాడన్నమాట.. ఖరదండనలో అభిముఖుడు కాకపోయినా ఖరదండనలో అభిముఖుయ్యాడు. అంటే కఠినశిక్షలు విధించడానికి విముఖుడైన ఆ రాముడు ఖరుడనే రాక్షసుణ్ణి దండించడానికి సుముఖుడయ్యాడు.. పుణ్య జనరక్షకుడై కూడ పుణ్యజనులను హతమార్చాడు, అనగా పుణ్యాత్ములను రక్షించి రక్కసులను శిక్షించాడన్నమాట.. ఆశ్రితవిభీషణుడు

కాకపోయినా ఆశ్రితవిభీషణుడయ్యాడు,అంటే ఆశ్రయించిన వారిపట్ల భయంకరుడు కాడు, కాని విభీషణుని కాశ్రయం ఇచ్చినవాడయ్యాడు.. తన విశాల యశస్సును దశదిశల వ్యాపింపజేసి సుప్రసిద్ధు డయ్యాడు.. మహాసుందరుడు, మహారాజులలో మేటి, సుగణాభిరాముడైన ఆ దశరథ రాముణ్ణి కీర్తించడానికి లోకంలో ఎవరికీ సాధ్యం కాదు.

*★ఈ అమృత గుళిక ఆస్వాదించారా? ఇదొక ముక్తపదగ్రస్త శ్లేష అలంకారాల సమ్మిళితం.. ముందు ఒక పదం చెప్తారు.. ఆ పదాలతో దీనికి వ్యతిరేకార్థం స్ఫురించేలా మరొకటి చెప్తూ రెంటికీ సమన్వయం కుదురుస్తారు.. ఏమి అందం! ఏమి చమత్కారం! నీకు నమస్కారమయ్యా, పోతయ్యా!*

# కృష్ణావతారం

172. అటువంటి శ్రీరాముని అవతారం లోకపావనమై అస్మదాదులకు అనుగ్రహ కారణ మయింది.. ఇక కృష్ణావతారాన్ని వర్ణిస్తాను, విను.. 173.. మునిశ్రేష్ఠుడా! నారదా! రాక్షస అంశలతో పుట్టిన రాజులు అనేకమంది తమ అపారసేనాబలాలతో అధర్మమార్గాన ప్రవర్తించారు.. భూదేవికి పెక్కుబాధలు కలిగించారు.. ఆమె దుఃఖిస్తూ విష్ణుమూర్తికి మొరపెట్టుకుంది.. పరాత్పరుడైన శ్రీహరి మదోన్మత్తులైన దానవులను సంహరించి భూ భారాన్ని తొలగించాలి అనుకొన్నాడు.. యదువంశంలో వన్నెకెక్కిన వాసుదేవునకు రోహిణి, దేవకి అనే భార్యల యందు తన తెల్లని వెంట్రుకలతో బలరాముడుగా, నల్లని వెంట్రుకలతో కృష్ణుడుగా అవతరించాడు. 174. ఈ విధంగా పద్మాక్షుడైన శ్రీమన్నారాయణుడు భూభారమంతా నివారించడానికి తన రెండు వెంట్రుకలే చాలనుకున్నాడు.

తన ప్రభావం తెలపడానికి తన అంశలతో పుట్టిన రామ కృష్ణుల శరీరకాంతులు తెలుపు నలుపులుగా చేసాడు.. ధవళము, నీలమైన. రెండువెంట్రుకల నెపంతో రాముడు, కృష్ణుడు అను పేర్లతో అవతరించాడు. అందు షడ్గుణైశ్వర్య సంపన్నుడు, సాక్షాద్విష్ణు స్వరూపుడు అయిన కృష్ణుడు ఇతర జనులు నడిచిన మార్గంలో నడిచినను మానవాతీతమైన కార్యాలెన్నో చేసాడు.. అందువల్ల పరమేశ్వరుడుగానే ప్రసిద్ధి

చెందాడు.. ఆ మహనీయు డొనర్చిన కార్యాలు గణించడం ఎవరికీ సాధ్యం కాదు.. అయినా నాకు తెలిసినంత వరకూ తెలుపుతాను, విను.

175. నూతన గరళస్తని యగు
పూతనఁ బురిటింటిలోనఁ బొత్తుల శిశువై
చేతనముల హరియించి ప
రేతనగరమునకు ననిచెఁ గృష్ణుఁడు పెలుచన్.

శ్రీకృష్ణుడు పురుటింటిలో చంటిబిడ్డగా పొత్తిళ్లలో ఉన్న సమయ మది.. పాలిళ్లలో ప్రత్యేక విషం కలిగిన పూతన అనే రాక్షసి పాలివ్వటానికి వచ్చింది.. ఆ శైశవ కృష్ణుడు ఆమె ప్రాణాలను తాగేసి యమలోకానికి పంపేసాడు.

176. వికటముగ నిజపదాహతిఁ
బ్రకటముగా మూఁడు నెలల బాలకుఁడై యా
శకటనిశాటుని నంతక
నికటస్థునిఁ జేసె భక్తనికరావనుఁడై.

భక్తలోక రక్షకుడైన శ్రీకృష్ణుడు మూడునెలల పిల్లవాడుగా ఉన్నాడు.. శకటరూపంలో ఒక రాక్షసుడు అతణ్ణి పరిమార్చటానికి వచ్చాడు.. అది గమనించిన బాలకృష్ణుడు తన కాలితన్నుతో ఆ దానవుణ్ణి దండధరుని వద్దకు సాగనంపాడు.

177. ముద్దుల కొమరుని వ్రేతల
రద్దులకై తల్లి ఱోల రజ్జులఁ గట్టం
బద్దులకు మిన్నుముట్టిన
మద్దుల వడిఁ గూల్చె జనసమాజము వొగడన్.

కృష్ణుడు అల్లరి చేస్తున్నాడని గోపికలు యశోదవద్ద గోలపెట్టారు.. యశోద అతణ్ణి త్రాటితో రోటికి కట్టివేసింది.. అతడు ఆ రోటిని ఈడ్చుకొంటూ వెళ్లి ఆకాశాన్ని అంటే జంట మద్దులను నేలగూల్చాడు.. అప్పుడు అక్కడి జనమంతా కృష్ణుణ్ణి కీర్తించారు.

178. యోగివరేణ్యుడ! నారద! ఇలాంటి పరమాద్భుతాలు ఎన్నో బాల్యంలోనే చేసిన కృష్ణుడు యశోద కొడుకని నేను నమ్మలేకుండా ఉన్నానయ్యా.. ఒకనాడు అతడు తల్లికి సకలచరాచర జీవులు, అడవులు, నదీనదాలు, పర్వతాలు, సముద్రాలు సమస్తంతో

కూడిన వివిధ జగజ్జాలాలని అపూర్వంగా తన నోట చూపాడు.. అది చూసి ఆ తల్లి అమితాశ్చర్యంతో చకితురా లయింది..




179. కాళీయుడనే సర్పరాజు యమునా నది మడుగులో నివసించేవాడు.. అతని కోరలలో భయంకరమైన విషం వుండేది.. అతడు క్రక్కిన ఆ గరళం కలిసిన నీళ్లు త్రాగి ప్రజలు ప్రాణాలు గోల్పోయే వారు.. ఇలా వుండగా యాదవశ్రేష్ఠుడైన కృష్ణుడు కాళియుణ్ణి ఆ మడుగునుండి వెడలగొట్టి గోవులను, గోపాలురను కాపాడాడు.. 180. కుమార! గోపకు లందరు ఒకనాటి రాత్రి నిద్రిస్తున్నారు.. ఇంతలో అమాంతంగా కార్చిచ్చు వాళ్లను చుట్టుముట్టింది.. "కృష్ణా! మంటల్లో చిక్కుకొన్నాము.. మమ్మల్ని కాపాడు, కాపాడు" అంటు వాళ్లందరూ తన్ను వేడుకొన్నారు.. అప్పుడు పద్మాక్షుడు "మీరంతా కళ్లు మూసుకొండి ఇదిగో క్షణంలో నేను ఆ దావానలాన్ని ఆర్పి వేస్తాను అన్నాడు. " వారలా చేశారు.. కృష్ణుడు అలవోకగా కార్చిచ్చును కబళించి వేశాడు. 181. ఒక రాత్రివేళ నందుడు మందమతి వలె యమునా నదీ జలాలలో స్నానం చేస్తూ మునిగి, వరుణుని పాశాలలో చిక్కకొన్నాడు.. అప్పుడు దయాసింధుడైన హరి ఆ బంధంనుండి అతణ్ణి విడిపించాడు. 182.

నారదమునీశ్వర! వ్యోమాసురుడు మయుని కుమారుడు.. అతను ఒకసారి తన మాయా ప్రభావంతో కృష్ణుని సహచరులైన గోపకులందరినీ ఒక గుహలో దాచేసాడు.. ఇంకెవ్వరు ఆ గుహలోకి వెళ్లడానికి లేకుండా మూసివేశాడు.. అంతట మహావేగంతో కృష్ణుడు ఆ క్రూరదానవుణ్ణి పోరాటంలో చంపాడు.. గోపాలకుల నందరినీ కృపతో కాపాడాడు.. అట్టి కృష్ణుని మహా మహిమలను ఇంతింతని చెప్పతరమా! 183.

గోపకులు ప్రతిసంవత్సరము ఇంద్రుడికి ప్రీతిగా చేసే యాగాన్ని శ్రీకృష్ణుడు మానిపించగా,గోపకులు యాగం చేయడం మానివేశారు.. దానితో ఇంద్రుడు కోపంతో. 184. వ్రేపల్లె కలతపడేటట్టు జోరున ఎడతెరపిలేని వాన వెంటనే కురవండి అంటూ ఇంద్రుడు మేఘాలను ఆదేశించాడు.. ప్రచండమైన మారుతవేగానికి పై కెగిరి ప్రళయకాలంలోని సంవర్తకాలవంటి భయంకరమైన మేఘాలు. 185. వాన ప్రారంభ మయింది.. అగ్ని జ్వాలల్లాగా మిరుమిట్లు గొలిపే మెరుపులతో, మాటిమాటికి ఉగ్రంగా ఉరిమేఉరుములతో దేవేంద్రునిచే ప్రేరేపింపబడిన వర్షం అంతకంతకూ భయంకర మయింది.. సూర్య చంద్రమండలాలతో సహా గగనాన్ని కప్పివేసి దిగంతరాలకు వ్యాపించాయి.. కారుమబ్బులతో ధారాళంగా కుండపోతగా రాళ్లవాన కురియసాగింది.

186. విరామం లెకుండా అలా కురిసే అంత పెద్ద వానజల్లుకు గోకులమంతా వ్యాకుల మయిపోయింది.. జనులందరూ కలత చెంది మూర్ఛిల్లారు.. ఆ విధంగా ఆర్తితో “కృష్ణా! కృష్ణా! కాపాడు; కాపాడు” అంటూ మొరపెట్టుకొన్నారు.. అంత అనంత దయాసముద్రుడు, భక్త జనుల పాలిటి కల్పవృక్షమైన పద్మనేత్రుడు.



# గోవర్ధనగిరి ధారణ

187... సప్తాబ్దంబుల బాలుఁడై నిజభుజాస్తంభంబునన్ లీలమై
..... సప్తాహంబులు శైలరాజము లసచ్ఛత్త్రంబుగాఁ దాల్చి, సం
..... గుప్తప్రాణులఁ జేసె మాధవుఁడు గోగోపాలకవ్రాతమున్
..... సప్తాంభోధి పరీతభూధరున కాశ్చర్యంబె చింతింపఁగన్.

శ్రీకృష్ణుడు ఏడేళ్ల బాలుడై ఉన్నా ఏడు రోజులు స్తంభములాంటి తన భుజముపై అలవోకగా శ్రేష్ఠశైలము గోవర్ధనగిరిని ఓ ప్రకాశించే గొడుగులాగ ఎత్తిపట్టుకుని గోవులను, గోపాలకులను దాని మరుగున దాచి అందరి ప్రాణాలు రక్షించాడు.. సప్తసముద్రాలతో చుట్టబడిన భూమి నంతటిని ధరించిన ఆ పరమపురుషునికి ఇది వింత పనేం కాదు. 188.

సాంద్రశరచ్చంద్ర చంద్రికా ధవళిత–
    విమల బృందావన వీథియందు
రాసకేళీ మహోల్లాసుఁడై యుత్పుల్ల–
    జలజాక్షుఁ డొక నిశాసమయమునను
దనరారు మంద్ర మధ్యమ తారముల నింపు –
    దళుకొత్త రాగభేదములఁ జెలఁగి
ధైవత ఋషభ గాంధార నిషాద పం–
    చమ షడ్జ మధ్యమ స్వరము లోలిఁ

..... గళలు జాతులు మూర్ఛనల్ గలుగ వేణు
..... నాళ వివరాంగుళన్యాస లాలనమున
..... మహితగతిఁ బాడె నవ్యక్త మధురముగను
..... పంకజాక్షుండు దారువు లంకురింప.

అది ఒక శరత్కాలపు రాత్రి.. పండువెన్నెలలో బృందావన మంతా తెల్లగా మెరిసిపోతోంది.. విరబూచిన తామరలవంటి కన్నులు గల కృష్ణుడు ఆ వనంలో రాసకేళికి ఉపక్రమించాడు.. ఆ క్రీడోల్లాసంతో పిల్లనగ్రోవి చేత బట్టాడు.. దాని

రంధ్రాలపై వ్రేళ్లూనుతూ ఇంపుగా అనేక రాగాలను ఆలపించాడు.. వాటిలో మంద్ర స్థాయి, మధ్యమస్థాయి, తారస్థాయి వినిపించాడు.. షడ్జమం, ఋషభం, గాంధారం, మధ్యమం, పంచమం, ధైవతం, నిషాదం అనే స్వరాలు, కళలు, జాతులు, ఆరోహణావరోహణ క్రమాలు తేటపడేటట్లుగా అవ్యక్త మధురంగా గానం చేసాడు.. ఆ గానానికి మ్రోళ్లు చివురించాయి. 189. మధుర స్వరాల పిలుపులు శ్రీహరి వేణువు నుండి వెలువడి ఆకర్షిస్తున్నాయి.. గోపికలు పరుగెత్తుకు వచ్చారు.. అప్పుడు కుబేరుని అనుచరుడైన శంఖచూడుడనే గంధర్వుడు వాళ్ల నెత్తుకుపోయాడు, వాళ్ళు "కృష్ణా!, కృష్ణా!" అంటూ మొరపెట్టుకొన్నారు.. వెంటనే మాధవుడు శంఖచూడుని భుజగర్వం పోకార్చి ఆ రమణీమణులను రక్షించాడు.. అలాంటి వనమాలిని కొనయాడడం ఎవరికి శక్యం కాదు. 190.. శ్రీకృష్ణ పరమాత్ముడు నరకాసురుడు, మురా సురుడు, ప్రలంబుడు, కాలయవనుడు, కువలయాపీడము అనే ఏనుగు, ముష్టికుడు చాణూరుడు మొదలైన మల్లురు, కంసుడు, శంబరుడు, శిశుపాలుడు, పౌండ్రక వాసుదేవుడు, పల్వలుడు, దంతవక్త్రుడు, ద్వివిదుడు అనే వానరుడు, గర్దభాసురుడు, సాల్వుడు, వత్సాసురుడు, బకాసురుడు, విదూరథుడు, రుక్మి, కేశి, దర్దురుడు, వృషభాకారాలు గల ఏడుగురు దనుజులు, ధేనుకుడు మొదలైన పెక్కుమంది రక్కసులను ఒక్క త్రుటిలో రూపుమాపాడు.

★*(భూభారం తొలగించుటకై వీరందరి సంహారముల కారకుడు కృష్ణుడే అని తాత్పర్యము. )*

191. అంతేకాదు. 192. బలరాముడు, భీముడు, అర్జునుడు మొదలైన విలుకాండ్ర రూపాలతో శ్రీకృష్ణుడు అవతరించి కఠినులు, నీచులు, దుర్మార్గులైన రాజులను రణరంగంలో ఆరితేరిన భుజబలక్రీడతో హతమార్చి, సమస్తభూభారాన్ని తొలగించి సజ్జనులను రక్షించాడు.. అట్టి అనంతుణ్ణి నేను అనుక్షణమూ ఆరాధిస్తాను. 193. అటువంటి సర్వలోకశ్రేష్ఠుడైన శ్రీకృష్ణుని అవతారాన్ని ప్రభావాన్ని చెప్పాను.. మరిక వ్యాసావతారం చెప్తాను వినుము. 194. ప్రతి యుగంలో అల్పబుద్ధులు, అల్పా యుష్కులు, దుర్గతి పాలయ్యేవారు అయిన మానవు లుంటారు.. వాళ్లకు భగవంతుడు నిర్మించినవి, శాశ్వతములు అయిన వేదాలు బోధపడవు.. అలాంటి వాళ్లను అనుగ్రహించాలనే బుద్ధితో శ్రీహరి సజ్జనస్తుతి పాత్రుడై పరాశర మహర్షి ప్రియపుత్రుడైన వ్యాసుడుగా అవతరించి ఆ వేదవృక్షాన్ని శాఖలు శాఖలుగా

విభజించాడు. 195. ఇంక బుద్ధావతారమును తెలుపుతాను ఆలకించు. 196.. మిక్కిలి చపలస్వభావులు, అసత్యవాదులు, భేదాచార పరాయణులు చెలరేగి శుద్ధ పాషండ మతమనే అభాస ధర్మములు పాటించేవారైన దైత్యులు అధర్మంగా ప్రవర్తిస్తుంటే.. పుండరీకాక్షుడు బుద్ధుడుగా అవతరించి రక్కసులను దురాచారాల తోపాటు నిర్మూలించాడు.. 197. మరియు కల్క్యవతారము గురించి వినుము.. 198. కలియుగంలో బ్రాహ్మణులు భగవంతుని వినుతించరు.. వేదవిహితమైన యజ్ఞయాగాది కర్మలు ఆచరించరు.. వాళ్ల నోటినుండి "వషట్", "స్వాహా", "స్వధా" అనే మంగళ వచనాలు వినిపించవు.. వాళ్ళు సత్యం పాటించరు..

. . . . . . . . . . . . . 

నాస్తికులై ప్రవర్తిస్తారు.. శూద్రులు రాజులవుతారు.. ఇలాంటి పరిస్థితి సంభవించి నప్పుడు భగవంతుడు కల్కిగా అవతరిస్తాడు.. అధర్మం తొలగిస్తాడు.. భూతలంలో ధర్మం స్థాపిస్తాడు. "

199. ఇలా చెప్పి బ్రహ్మదేవుడు మళ్లీ నారదునితో ఇలా చెప్ప సాగాడు.. ఓ నారద మునిశ్రేష్ఠా! శ్రీ మన్నారాయణుడు స్వీకరించిన లీలావతారకథా విశేషాలు నే నిప్పుడు నీకు చెప్పాను.. ఇంతకు ముందే శ్రీహరి ఆదివరాహం మొదలైన అవతారాలు స్వీకరించి చేయవలసిన పనులన్నీ చేసాడు.. మన్వంతరములు సంబంధమైన అవతారాలు ఇంతవరకూ జరిగినవి ఉన్నాయి.. ఇక జరగబోయేవీ ఉన్నాయి..

వర్తమాన కాలంలో ఆయన ధన్వంతరి, పరశురామావతారాలు ధరించి ఉన్నాడు.. భవిష్యత్తులో శ్రీరాముడు మొదలైన అవతారాలు తాల్చ గలడు.

ఆ మహాత్ముడు సృష్టి మొదలైన వివిధ కార్యాలు నెరవేర్చడానికి మాయా గుణంతో నిండిన అవతారాలు స్వీకరిస్తాడు.. అనేక శక్తులతో కూడిన ఆ భగవంతుడు సృష్ట్యాదిలో తపస్సుగా, నేనుగా, ఋషులుగా, తొమ్మిదిమంది ప్రజాపతులుగా అవతరించి లోకాన్ని సృష్టిస్తూ ఉంటాడు.. ధర్మ, విష్ణువు, యజ్ఞాలు, మనువులు, ఇంద్రుడు మొదలైన దేవతల రూపాలతో, రాజుల రూపాలతో అవతరించి లోకాలను రక్షిస్తూ ఉంటాడు.. అధర్మము, రుద్రుడు, భీకరసర్పాలు, రాకాసి మూకలుగా అవతరించి విశ్వాన్ని సంహరిస్తూ ఉంటాడు.. పరమేశ్వరుడు, సర్వస్వరూపుడు అయిన శ్రీహరి ఈ విధంగా ఈ విశాల విశ్వం సృష్టికి, స్థితికి, లయానికి హేతువై ప్రకాశిస్తాడు.. భూమిలోని ధూళికణాల నయినా లెక్క పెట్టవచ్చుగాని ఆ భగవంతుని లీలావతారాలలోని అద్భుత కృత్యాలను లెక్కపెట్టడం ఎవ్వరికీ అలవికాదు.. నీకు సంగ్రహంగా చెప్పాను.. సువిస్తరంగా చెప్పడం నాకే సాధ్యం కాదు.. ఇక ఇతరుల మాట చెప్పడ మెందుకు ఇంకా విను. 200. ఆ మహాత్ముడు త్రివిక్రమావతారం ధరించాడు.. ఆయన పాదాల విసురుకు ముల్లోకాలూ తల్లడిల్లాయి.. అంతేకాదు.. ఆ ముజ్జగాలకు ఆవల వెలుగొందే సత్యలోకం గూడా వణకిపోయింది.. అప్పుడు దయతలచి కాపాడి, రక్షించే ఆ పాదపద్మాల కుండే అప్రతిహతమైన శక్తి ఇంతింతని వర్ణించడం ఎవరికీ శక్యం కాదు.

## భాగవత వైభవం

201. నేనే శ్రీహరి మాయాశక్తిని తెలుసుకోలేకున్నాను.. ఇక తెలుసుకోవడానికి సనందుడు, సనకుడు, సనత్కుమారుడు మొదలైన సజ్జన సంఘాలకు మాత్రం వీలవుతుందా! ఆదిశేషుడు ఇతర ఆలోచనలన్నీ వదలి పెట్టి బుద్ధిని సదా భగవత్సేవకే అంకితం చేసాడు.. వేయి నోళ్లతో ఆ పరమేశ్వరుని చరిత్రను అనురక్తుడై కీర్తిస్తూ ఉంటాడు.. అట్టి శేషుడు గూడ ఆయన మాయామహిమ ఎలాంటిదో తెలుసుకోలేకున్నాడు.. ఇక ఇతరుల సంగతి చెప్పాలా. 202.

ఎవరు ఇతర చింతలు మాని సదా శ్రీమన్నారాయణుణ్ణే దృఢంగా నమ్మి సేవిస్తారో, వాళ్లను, ఆశ్రితులు అర్చించే పాదపద్మాలు కలవాడైన పద్మనాభుడు మిక్కిలి దయగలిగి, కల్లాకపటంలేని మనస్సుతో అనుగ్రహిస్తాడు.. అలా భగవంతుని సేవించి

ఆయన కృపకు పాత్రులైనవాళ్లు మాత్రమే సాటిలేనిది, దాటరాని ఆ భగవంతుని మాయను నిరంతరం దాటుతూ తరింప గలుగుతారు.. 203.

ఇంతేకాదు.. ఇంక కొందరు పుణ్యాత్ములున్నారు.. వాళ్ల సంగతి వివరిస్తాను విను.. వాళ్లు సంసారంలో మునిగి తేలుతూ దినాలు గడిపిన చివరకి కుక్కలు, నక్కలు పీక్కొని తినే ఈ శరీరాలపై మమకారం పెట్టుకోలేదు.. తమ దేహాలను పూర్తిగా భగవంతునికే అర్పించారు.. నేను బ్రహ్మదేవుడిని గదా అన్న గర్వంతో ఒక్కొక్కసారి రజోగుణం నన్ను ఆక్రమిస్తుంది.. ఆ సందర్భంలో నే నా మహాత్ముని తత్త్వం ఇలాంటిదని తెలుసుకోలేను.. రజోగుణం వదలి భక్తి యుక్తుడనై ఆయన పాద పద్మాలను శరణాగతి భావంతో సేవించేటప్పుడు మాత్రమే ఆ భగవన్మహిమ తెలుసుకోగలుగుతున్నాను.. అందుచేతనే శాస్త్రాలపై ఆధారపడక భక్తి జ్ఞాన యోగాలతో మాత్రమే నేను ఆ పరమాత్మను సేవిస్తాను.. నేను కాదు, సనకుడు, సనందనుడు, సనత్కుమారుడు, సనత్సుజాతుడు, నీవు మొదలైన వాళ్లు, భగవంతుడైన శివుడు, దైత్యులను పాలించే ప్రహ్లాదుడు, స్వాయంభువుడనే మనువు, అతని భార్య శతరూప అనే సతీమణి, వాళ్ల కుమారులైన ప్రియవ్రతుడు, ఉత్తానపాదుడు, పుత్రికలైన దేవహూతి మొదలైనవారు, రాజేంద్రుడు ప్రాచీనబర్హి, మహర్షి ఋభువు, వేనుని తండ్రి అయిన అంగుడు, ఉత్తాన పాదుని కుమారుడగు ధ్రువుడు భగవన్మాయను తరింపగల్గినవారే.. ఇంకా విను.

204. గాధి,గయుడు మున్నగువారు, ఇక్ష్వాకుడు, దిలీపుడు, మాంధాత, భీష్ముడు, యయాతి, సగర చక్రవర్తి, రఘు మహారాజు, ముచుకుందుడు, ఐలుడు, రంతిదేవుడు, ఉద్ధవుడు, సారస్వతుడు, ఉదంకుడు, భూరిషేణుడు, శ్రుతదేవుడు, హనుమంతుడు, శతధన్వుడు, పిప్పలుడు, బలిచక్రవర్తి, విభీషణుడు, శిబిచక్రవర్తి, అర్జునుడు, విదురుడు, అంబరీషుడు, పరాశరమహర్షి, అలర్క మహారాజు, దేవలుడు, సౌభరి, జనకమహారాజు, అభిమన్యుడు, ఆర్ష్టిషేణుడు వంటి నిర్మల మతులైన మహాత్ములందరూ అనురక్తులై భక్తితో ఆ దేవదేవుని తమ మనస్సులో నిల్పారు.. ఆయనే గతి అని సేవించి దాట వీలుగాని విష్ణుమాయను దాటగలిగారు..

205. అనఘా! వీరల నెన్ననేమిటికిఁ; దిర్యగ్జంతుసంతాన ప
క్షి నిశాటాటవికాఘ జీవనివహస్త్రీ శూద్ర హూణాదులై
నను నారాయణభక్తి యోగమహితానందాత్ములై రేని వా
రనయంబుం దరియింతు రవ్విభుని మాయావైభవాంభోనిధిన్.

పుణ్యాత్ముడ! నారద! సహజంగా పుణ్యాత్ములయిన వీళ్లను గూర్చి చెప్పవలసిన పనిలేదు.. పశువులైన, పక్షులైన, రాక్షసులైన, అడవిలో జీవించేవారైన, పాప జీవనులైన, స్త్రీలైన, శూద్రులైన, హూణులు మొదలైన వారైన లేదా మరి ఎవరైనా సరే శ్రీమన్నారాయణునిపై భక్తి యోగంతో అఖండ ఆత్మానందం పొందినవారైతే చాలు.. అవశ్యం ఆ దేవదేవుని మాయావైభవమనే మహా సముద్రాన్ని సులభంగా తరిస్తారు. 206. అందువల్ల.. 207. నారదమునీశ్వర! ఎల్లవేళల మిక్కిలి శాంతుడై వుండేవాడు, భయరహితుడు, విశ్వమయుడు, కేవల జ్ఞానస్వరూపుడు, సర్వేశ్వరుడు, శుద్ధాత్ముడు, శాశ్వతుడు, సముడు, సత్తు అసత్తులకు అతీతుడు అయిన పరమేశ్వరుణ్ణి సదా నీ హృదయంలో ప్రతిష్ఠించుకో.. 208..

ఎవరైతే పరమాత్ముని తమ చిత్తంలో ప్రతిష్ఠించుకొంటారో, అట్టి పుణ్యాత్ములు, సచ్చరిత్రులు అయిన మహనీయుల చెంతకుపోలేక అవిద్య సిగ్గుతోతలవంచుకొని పెడ మొగమై దూరదూరంగా తొలగిపోతుంది. ఇంతేకాదు. 209. పరమాత్ముడు, చ్యుతి లేనివాడు, అంతంలేనివాడు అయిన శ్రీమహావిష్ణుని మనస్సులో స్థిరంగా భావించిన వాళ్లు, శోకంలేని సుఖస్థితిపొందుతారు. అలాంటి బుద్ధిమంతులు భగవంతుని స్మరణ తప్ప ఇతరకార్యాలు ఏమరుపాటునగూడ చేయరు. ఆలోచిస్తే అది అంతే.

- ॐ వర్షం కురిపించే దేవేంద్రుడైనా దాహంవేసిన పిమ్మట నీళ్లకొరకై బావి త్రవ్వడానికి పరుగెడతాడా?



. . . . . . . . . . .

210. ఆ భగవంతుడు అందరికీ తగిన ఫలితాలు అన్నీ ఇచ్చేవాడు.. అందరికీ శరణు పొందదగినవాడు.. అన్ని శక్తులు గలవాడు.. అన్ని లోకాలలో ప్రసిద్ధి పొందినవాడు.. అంతటా వ్యాపించినవాడు.. సుదర్శన మనే చక్రం ధరించిన బ్రహ్మస్వరూపుడైన ఆ దేవుడు, తక్కిన ఈ సమస్త ప్రాణులు చిక్కి స్రుక్కి శిథిలమై అంతరించిపోయిన కల్పాంత కాలంలో గూడ ఆకాశంలాగ తానొక్కడు చెక్కు చెదరకుండా నిర్వికారుడై

నిలిచి ఉంటాడు.. 211. నాయనా! నారద! అటు కారణాలకు, ఇటు కార్యాలకు అన్నిటికి కారణభూతుడైనవాడు ఆ కమలాక్షుడే.. ఆయన కంటే ఇతరు లెవరూ ఆశ్రయింపదగిన వాళ్లు లేరు.. షడ్గుణైశ్వర్య సంపన్నుడు, తుది లేనివాడు, ప్రపంచసృష్టి గావించే ఉదారుడైన ఆ పరమాత్ముని సద్గుణ పుంజాలను గొప్ప మనస్సుతో కొనియాడాలి.. లేకుంటే మనస్సులు ప్రకృతికి అతీతమైన నిర్గుణ బ్రహ్మను పొందలేవు. 212. కుమారా! నారదా! ఈ భాగవతం అనే పురాణకథ వేదార్థాలను ప్రతిపాదించడం చేత ప్రశస్తమై వుంది.. మోక్షప్రదంగా ఉండేటట్లు ఆ భగవంతుడు దీన్ని రచించాడు.. ఇది భగవద్భక్తులకు కల్పవృక్షం, శాస్త్రాలన్నిటి కంటె శ్రేష్ఠమైనఈ పురాణకథను నేను నీకు సంగ్రహంగా చెప్పాను. నీవు దీన్ని లోకంలో బహు విస్తృత కృతిగా కావించుము.. 213. అన్ని జన్మలలో పురుషజన్మం చాలా అపురూపం.. అందులోను బ్రాహ్మణకులంలో పుట్టడం మరీ అరుదు.. అందువల్ల మానవులు అనిత్యమైన నిష్ప్రయోజన కార్యాలలో బడి దురవస్థల పాలు కాకుండ, శ్రీహరిని సేవించి నిత్యమైన పరమపదం పొందడం సముచితం కదా. 214. పద్మాక్షుడు, అన్నిటి యందు మించినవాడు, లక్ష్మీపతి, పాపనాశకుడు, పరమేశ్వరుడు, చ్యుతి రహితుడు ఐన శ్రీహరిని నిర్మలభక్తిగలిగి ఆసక్తితోభజించాలి. అలాచేయకుండా ఉపవాసాలు, వ్రతాలు, శౌచాలు, శీలాలు, యాగాలు, సంధ్యో పాసనలు, అగ్ని కార్యాలు, జపాలు, దానాలు, వేదాధ్యయనాలు లాంటి వెన్ని చేసినా మోక్షం లభించదు. 215. నారదమునిశ్రేష్ఠ! ఎల్లవేళలా కమలనయనుని మహిమను స్తుతించాలి.. ఇతరులు స్తుతిస్తూ వుంటే వినాలి.. మనస్సులో ఆ మహిమను మననం చేస్తూ సంతసించాలి.. అలా చేసే వాళ్లు దేవుని మాయకు లోను గారు. ”216. ఇలా పూర్వం బ్రహ్మదేవుడు ఋషీశ్వరుడైన నారదునికి భాగవత ముఖ్యకథను వివరించాడు.. ఆ విషయాన్ని యోగీశ్వరుడైన శుకుడు మహాభక్తితో పరీక్షిన్మహారాజుకు తెలియజెప్పాడు.

# ప్రపంచాది ప్రశ్న

217. తరువాత పరీక్షిత్తు శుకమహర్షిని ఇలా అడిగాడు – ఓ మునీశ్వరా! బ్రహ్మదేవుడు నారదమునికి భగవత్సాక్షాత్కారం కలగడానికి చెప్పిన ఉపాయం దయతో నాకు చెప్పండి.. సత్త్వరజస్తమోగుణాలకు అతీతుడు, పద్మనేత్రుడు అయిన శ్రీహరి కథలు లోకానికి మంగళం చేకూరుస్తాయి.. అవి నాకు తెలియపరచండి.. మీరు చెప్పింది విని సంగరహితమయిన నా హృదయ కమలంలో శుభచరిత్రుడు,

తుది మొదళ్లు లేనివాడు, చిన్మయస్వరూపుడు, పాపరహితుడు, లక్ష్మీ సహితుడు అయిన కృష్ణుణ్ణి నిలుపుకొంటాను.. చంచలము, హేయాలన్నిటికీ నెలవు అయినట్టి ఈ శరీరాన్ని విడిచి పెడతాను. 218. అంతేకాక, ఎవడు కృష్ణుని గుణగణాలను ఇతరులు కీర్తిస్తుంటే శ్రద్ధా భక్తులు కలిగి వింటాడో, తాను స్వయంగా కీర్తిస్తాడో, అలాంటి వాని హృదయకమలం లోకి శ్రవణ కుహరాల ద్వారా కృష్ణుడు ప్రవేశిస్తాడు.. అక్కడ విశ్రమిస్తాడు.. నీటిలోని మాలిన్యాన్ని శరదృతువు తొలగించినట్లు మనస్సులోని మాలిన్యాన్ని తొలగిస్తాడు, కనుక. 219. అడవులందు సంచరిస్తూ, వేసవి మండుటెండల తాపానికి పరితాపం చెందిన బాటసారి బడలి దాహంతో చివరికి తన యిల్లు చేరుకొంటాడు.. అక్కడ హాయిగా అలసట తీర్చుకొంటాడు.. అక్కడినుండి మళ్ళీ ఎక్కడికీ కదలడు.. అలాగే రమాకాంతుని చరణకమల ద్వంద్వంతో సంబంధం కల ఆనందం చవిచూచినవాడు మళ్లీ దాన్ని వదలడు.. 220. అంతేకాదు,

సమస్త భూతాలతో కలయిక లేని ఆత్మకు అసలు భూతాలతో సాంగత్యం ఎలా కలిగింది.. అది అకారణంగా కలిగిందా? లేక, కర్మవల్ల కలిగిందా? ఆ వైనం నాకు వివరించు. 221. పరంజ్యోతి స్వరూపుడైన పద్మాక్షుడి నాభిలో సమస్తలోకాల ఉనికికీ హేతువైన పద్మం పుట్టింది, ఆ పద్మంలో, ప్రభవించి సర్వాంగ సుందరంగా ప్రకాశించే బ్రహ్మ పరమేశ్వరుని అనుగ్రహం వల్ల ఔత్సుక్యంతో సమస్త ప్రాణులనూ సృష్టించాడు.. మరి ఆ బ్రహ్మ సర్వేశ్వరుని స్వరూపాన్ని ఏ విధంగా సాక్షాత్కరింప జేసుకొన్నాడు? అలాంటి పద్మాక్షుడికీ, బ్రహ్మదేవునికి అవయవ విన్యాసంలో, భావగతిలో భేదమున్నదా? ఓ పరమకరుణాసాంద్ర! యోగికుల జలధిచంద్ర! నాకు తెలియజెప్పవయ్యా.. 222. భూతాలకు అధినాథుడైన సర్వేశ్వరుడు ఉత్పత్తికి, స్థితికి, లయానికి హేతువైన తన మాయను వదలి మాయానియామకుడై ఏయేస్థలాలలో శయనించాడు? అంతేకాక, పూర్వం విరాట్పురుషుని అవయవాలతో ఇంద్రుడు మొదలైన లోకపాలకులతో కూడిన లోకాలు ఎలా సృష్టింప బడ్డాయి? ఇంకా మహాకల్పాలు, అవాంతరకల్పాలు, భూతభవిష్యద్వర్త మాన కాలాలు, శరీరాభిమానంతో జన్మించే దేవతలు, పితరులు, మానవులు మొదలగువారికి కలిగే ఆయుఃప్రమాణాలు నాకు చెప్పు. మహాకాలాన్ని, సూక్ష్మకాలాన్ని అనువర్తించి జీవులు ఏ యే కర్మలు చేసి ఏ యే లోకాలకు ప్రయాణం సాగిస్తారు? ఏయే కర్మలవల్ల వాళ్లకు దేవతాశరీరాలు వస్తాయి.. అట్టి కర్మమార్గపద్ధతి నాకు వివరించు.. ఇంకా సత్త్వాది గుణాలకు ఫలములైన దేవాది స్వరూపాలు కోరే జీవులు ఏ యే కర్మలు ఏ విధంగా

చేయాలి? ఆ కర్మలను ఎవరికి సమర్పించాలి? వాటిని ఎవరు స్వీకరిస్తారు? భూమి, పాతాళం, దిక్కులు, అకాశం, గ్రహాలు, నక్షత్రాలు, పర్వతాలు, నదులు, సముద్రాలు, దీవులు ఎలా ఉద్భవించాయి? ఆయా చోట్ల ఉండే జీవుల జన్మలు ఎలాంటివి? వెలుపల, లోపల బ్రహ్మాండం కొలత ఎంత? మహాత్ముల చరిత్రలు ఎటువంటివి? వర్ణాశ్రమ నియమాలు, క్రమంగా ఏర్పడి ఆశ్చర్యం కల్గించే శ్రీమన్నారాయణుని అవతారకథలు, నాలుగు యుగాలు, ఆ యుగాల ప్రమాణాలు, యుగధర్మాలు,

ప్రతియుగంలోనూ మానవులు పాటించ వలసిన సాధారణధర్మాలు, విశేషధర్మాలు, ఆయా జాతులకు సంబంధించిన ధర్మాలు, రాజర్షుల ధర్మాలు, జీవనసాధనాలైన ఆపద్ధర్మాలు, మహత్తు మొదలైన తత్త్వాలసంఖ్య, వాటి లక్షణము ఆ తత్త్వాలకు హేతువులైన లక్షణాలు, భగవానుని ఆరాధించే వద్ధతి, యమనియమాదులైన అష్టాంగాలతో కూడిన యోగక్రమము, యోగిశ్రేష్ఠులైన వారి అణిమ, మహిమ వంటి అష్టసిద్ధుల స్వరూపం, అర్చిరాది మార్గాలలో బ్రహ్మ లోకమునకు యోగులు పయనించే తీరు, లింగశరీరాలు వినాశము,★ ఋక్కు, ★యజుస్సు, ★సామము, ★అథర్వం అనే నాలుగు వేదాలు, అయుర్వేదం మొదలైన ఉపవేదాలు, ధర్మశాస్త్రాలు, ఇతిహాసాలు, పురాణాలు ఆవిర్భవించిన పద్ధతి, అన్ని భూతాలకు ఏర్పడే అవాంతర ప్రళయము, వాటిస్థితి, మహాప్రళయము, యజ్ఞాది వైదిక కర్మలు, బావులు, మడుగులు, చెరువులు, దేవాలయాల నిర్మాణం, అన్నదానం, ఆరామప్రతిష్ఠ వంటి ఇష్టాపూర్తాలు, స్మృతుల్లో చెప్పిన కర్మలు, కామ్య కర్మలైన అగ్నిహోత్రాదులు నిర్వర్తించే విధానం, జీవుల సృష్టి ధర్మం, అర్ధం, కర్మం అనే మతమార్గాలను ఆచరించే తీరు, మలిన శరీరులైన పాషండుల పుట్టుక, జీవాత్ముడు బంధింపబడే రీతి, ఆపై మోక్షం పొందే పద్ధతి, స్వస్వరూపంలో నెలకొనే ప్రకారం, దేనికీ లోబడక అన్నిటా స్వతంత్రుడైన ఈశ్వరుడు తన మాయతో సమస్త కర్మలకు సాక్షిగా ఉంటూనే ఆ మాయకు అతీతుడై ఉదాసీనుని లాగా ప్రభువై క్రీడించే పద్ధతి.. మున్నగు సంగతులన్నీ ప్రపన్నుడనైన నాకు వివరించు.. నీవు బ్రాహ్మణ శాపం వల్ల దుఃఖిస్తున్నావు, నీ మనస్సు కలత జెంది ఉంది.. పైగా నిరాహార దీక్షలో ఉన్నావు.. నేను చెప్పే ఈ విషయాలు ఎలా వినగలవు.. అని సంశయించవద్దు, నేను మీ ముఖ పద్మం నుండి వెలువడే శ్రీమన్నారాయణ కథాసుధను తనివిదీరా త్రాగాలన్న కుతూహలంతో ఉన్నాను.. అట్టి నాకు యింద్రియాలు స్వాధీనంలోనే ఉన్నాయి.. కాబట్టి నేను అడిగిన ప్రశ్నలు అన్నిటికీ సమాధానాలు సవిస్తరంగా ఆనతిచ్చి నన్ను కృతార్థుణ్ణి కావించు.. ప్రాచీన

సంప్రదాయాన్ని అనుసరించి, అందుకు తగినవాడవు నీవే.. నీవు బ్రహ్మతో సమానుడవు. " ఈ విధంగా విష్ణురాతుడైన (విష్ణువుచే రక్షితుడైన) పరీక్షిన్మహారాజు బ్రహ్మరాతుడైన (బ్రహ్మచే వ్యాసునికి పుత్రుడుగా అనుగ్రహింపబడిన) శుక మహాయోగిని అడిగాడు.. అప్పుడు శుక మహర్షి "రాజా! బ్రహ్మ నారదుల సంవాదరూపము, ప్రధాన సంప్రదాయానికి చెందినది, క్రమ పద్ధతిలో పరంపరగా వస్తున్న భాగవతమనే మహా పురాణ మున్నది.. అది వేదంతో సమానం.. దానిని పూర్వం సర్వేశ్వరుడు బ్రహ్మ కల్పంలో బ్రహ్మకు ఉపదేశించాడు.. అది నీకు తెలియపరుస్తాను.. విను" అని చెప్పి పరీక్షిత్తుతో ఇలా చెప్పసాగాడు.

## శ్రీహరి ప్రధానకర్త

223. "ఓ రాజశ్రేష్ఠుడ! జీవుడు భూతాలకెల్ల మేలు చేకూర్చేవాడు, జ్ఞానమే స్వరూపంగా కలవాడు, అలాంటి వానికి శరీరంతో సంబంధం ఎలా కలిగింది అంటావా జగతీ తలమంతా వ్యాపించివున్న ఈశ్వరుని మాయ. లేకపోతే జీవునికి దేహంతో సంబంధం కలుగదు.. నిద్రించే వేళ స్వప్నంలో దేహాలతో సంబంధం గోచరిస్తుందికదా, అలాగే నారాయణుని యోగమాయా ప్రభావం వల్ల జీవుడు పంచభూతాలతో కూడిన దేహంతో సంబంధం కలవాడవుతాడు.. ఆ మాయాగుణాలవల్లనే క్రమంగా బాల్యం, కౌమారం, యౌవనం అనే దశలు పొందుతాడు.. మనుష్య, దేవతాది ఆకారాలను గూడ స్వీకరిస్తాడు.. నేను అనే అహంకారాన్ని, **నాది** అనే మమకారాన్ని పెంచుకొంటాడు.. సంసారమాయలో బద్ధుడవుతాడు. 224. ఈ విధంగా బద్ధుడై వర్తించే జీవుడికి భగవంతునిమీది భక్తితో ముక్తి ఎలా కలుగుతుంది అంటావా, అది చెబుతాను విను.. ప్రకృతికి, పురుషుడికి అతీతమైన బ్రహ్మస్వరూపాన్ని ఎప్పుడు జీవుడు తీవ్రంగా ధ్యానిస్తాడో, అప్పుడు మోహం నుండి విడివడుతాడు.. అహంకార మమకార మయమైన సంసారంనుండి విముక్తుడై ముక్తి పొందుతాడు.. అంతేకాదు..

జీవుడికి, ఈశ్వరుడికి, శరీరాలతో సంబంధాలు కనిపిస్తున్నాయి.. భగవంతుడుకూడ శరీరం ధరించే ఉన్నాడు.. అట్టి భగవంతుడి మీద భక్తి గలిగి ఉంటే జీవుడి కెలా ముక్తి సిద్ధిస్తుంది అని అడిగావు.. అవిద్యకు లోనైనవాడు జీవుడు.. అవిద్య ప్రభావంవల్ల అతడు కర్మ ననుసరించి సంప్రాప్తించిన శరీరాన్ని ధరిస్తాడు.. ఆ దేహం మిథ్యారూప

మైనది.. భగవంతుడు యోగమాయతో గూడినవాడు.. ఆయన తన యోగమాయాప్రభావం వల్ల తన ఇష్టానుసారం జ్ఞానమయమైన లీలాశరీరం కల్పించుకొంటాడు.. అందువల్ల "మోక్షానికి సాధనమైన జ్ఞానానికై తన సేవ కల్పించబడిందని భగవంతుడైన ఈశ్వరుడు బ్రహ్మతో చెప్పాడు.. బ్రహ్మ నిష్కపటంగా తపస్సుచేసి పరమేశ్వరుని ఆరాధించాడు..

అప్పుడు తన జ్ఞానానందఘనమైన స్వరూపం బ్రహ్మకు చూపిస్తూ ఈశ్వరుడు పై విధంగా తెలిపాడు.. అందువల్ల జీవుడికి భగవద్భక్తి తప్పక మోక్ష మిస్తుంది.. ఈ విషయం నిరూపించే ఇతిహాసం ఒకటి వుంది.. అది వివరిస్తాను, విను.. దానివల్ల నీకు కలిగిన సందేహం తొలగిపోతుంది" అని చెప్పి యోగి శ్రేష్ఠుడైన శుకుడు రాజశ్రేష్ఠుడైన పరీక్షిత్తుతో ఇలా అన్నాడు.. 225.. "దేవాది దేవుని పాదాలమీద భక్తి గల్గి వుండడంలోని పరమ రహస్యాన్ని ఉపదేశించిన వాడు, దేవతల కందరికి అధినేత అయిన విధాత కల్పారంభంలో తనకు నెలవైన పద్మానికి మూల మేమిటో పరిశీలించాలనుకొన్నాడు.. నీళ్లలో వెదకడం ప్రారంభించాడు.. ఎంత వెదకినా ఆ పద్మానికి మొద లెక్కడ వుందో తెలుసుకో లేకపోయాడు.. చివరికి విసిగి వేసారి మరలి వచ్చి ఆ పద్మంలోనే ఆసీనుడైనాడు.. జగత్తును సృష్టించాలనే సంకల్పం ఆయన హృదయంలో ఉదయించింది.. ఎంతో ఆలోచించాడు.. కాని సృష్టికి సంబంధించిన పరిజ్ఞానం ఆయన మనస్సుకు అందక క్రిందుమీదయ్యాడు..

అలసత్వం ఆవహించింది.. లోకాలను సృష్టించలేక పోయాడు.. అతని చిత్తం మోహాయత్త మయింది.. చింతాక్రాంతు డయాడు. 226. ఆ సమయంలో నీటిలో నుండి ఒక శబ్దం వినిపించింది.. **క** మొదలు **మ** వరకూ ఉండే స్పర్శాక్షరాలలో పదునారవది, ఇరవై యొకటవది అయిన "తప" అనే రెండు అక్షరాలవల్ల ఆ శబ్దం ఏర్పడింది.. "తప" అనే ఆ పదం మహర్షులకు అమూల్యమైన ధనం.. ఆ మాట రెండుసార్లు "తప తప" అని ఉచ్చరింపబడింది.. బ్రహ్మ దాన్ని విన్నాడు..

ఆ శబ్దాన్ని ఉచ్చరించిన పురుషుణ్ణి చూడాలనుకొన్నాడు.. నాలుగు దిక్కులకు వెళ్లి వెతికాడు.. ఎక్కడా ఆ పురుషుడు గోచరించలేదు.. తిరిగివచ్చి తన నివాసమైన పద్మంలోనే కూర్చున్నాడు.. కొంత సేపు ఆలోచించాడు.. తన్ను తపస్సు చేయమని హెచ్చరించ టానికే ఆ శబ్దం వినపించింది అనుకొన్నాడు.. ప్రాణాయామం

ప్రారంభించాడు.. జ్ఞానేంద్రియాలను, కర్మేంద్రియాలను స్వాధీనం చేసుకొన్నాడు.. మనస్సును ఏకాగ్రం చేసుకొని వెయ్యి దివ్య సంవత్సరాలు అలా తపస్సు చేసాడు.. ఆ దారుణ తపస్సుకు లోకాలన్ని తపించిపోయాయి.. అప్పుడు శ్రీహరి ప్రసన్నుడై బ్రహ్మకు ప్రత్యక్షమయ్యాడు.. వెంటనే బ్రహ్మ వైకుంఠపురాన్ని దర్శించాడు.. ఆ పురం రాజస గుణానికి, తామసగుణానికి ఆ గుణాలతో మిశ్రమైన సత్త్వగుణానికి అతీత మైనది.. కేవల సత్త్వగుణానికి నివాసమయింది.. కాలానికి అక్కడ ప్రాబల్యం లేదు.. ఆది అన్ని లోకాలకంటే అత్యున్నత మైనది.. సమస్త దేవతలకు ప్రస్తుతింప దగినది.. అక్కడ లోభం, మోహం, భయం అనేవి లేవు.

అక్కడికి పోయినవారు మళ్లీ తిరిగి రావడం జరగదు.. తుది లేని తేజస్సుతో అది ప్రకాశిస్తున్నది.. అలాంటి వైకుంఠపురాన్ని సరోజ సంభవుడు సందర్శించాడు.

# వైకుంఠపుర వర్ణన

227. అక్కడ వైకుంఠపురంలో మేడలు, విమానాలు, గోపురాలు, మిద్దెలు, డపాలు, దివ్యమణికాంతులతో దేదీప్యమానంగా తేజరిల్లుతున్నాయి.. ఆ దీప్తులు సూర్య చంద్రాగ్నుల తేజస్సులను చొరనీయటం లేదు. ఇంకా ఆ వైకుంఠపురంలో పూలగుత్తులతో నిండి కోరిన ఫలాలు ప్రసాదించే కల్పవృక్ష సమూహాలు ఉన్నాయి.. బంగారు కఱ్ఱలకు తగిలించిన రంగు రంగుల పతాకాలు గాలికి రెపరెప లాడుతున్నాయి.. వికసించిన కలువల్లో, కమలాల్లో మకరందం గ్రోలే మధుకర బృందాలు ఆనందంతో ఝుంకారం చేస్తున్నాయి.. అక్కడి తటాకాలు ఆ శబ్దానికి మేల్కొన్న కలహంసలతో కనులపండువుగా శోభిస్తున్నాయి.

228. వల నొప్పగా న దైవం కేశవాత్పర–
 మ్మని పల్కు రాజకీరావళియును
మహిమ జగద్విష్ణుమయ మఖిలమ్మని–
 చదివెడు శారికాసముదయంబు
నేపారఁగా జితం తే పుండరీకాక్ష–
 యని లీలఁబాడు పికావళియును

లలిమీఱఁగా మంగళం మధుసూదన-
యనుచుఁ బల్కెడు మయూరావళియునుఁ
దవిలి శ్రౌషడ్వషట్స్వధే త్యాది శబ్ద
కలితముగ మ్రోయు మధుప నికాయములునుఁ
గలిగి యఖిలైక దివ్య మంగళ విలాస
మహిమఁ జెన్నొందు వైకుంఠమందిరంబు

ఆ వైకుంఠపురంలో ఉన్నట్టి రామచిలుకలు "కేశవుని కంటె పరదైవం లేదు" అని నేర్పుగా పలుకుతున్నాయి.. గోరువంకలు "విశ్వమంతా విష్ణుమయం" అని మహిమతో చదువుతున్నాయి.. కోయిలలు అతిశయంగా "పద్మనేత్రా! నీదే జయం" అని పాడుతున్నాయి.. నెమళ్లు ఉత్సాహముగా "మధుసూదనుడ! నీకు మంగళం" అని ఆడుతున్నాయి.. తుమ్మెదల గుంపులు ఆసక్తితో "శ్రౌషట్ వషట్ స్వధా" ఇత్యాది శబ్దాలతో ఝుంకారం చేస్తున్నాయి.. ఈ విధంగా అన్నింటినీ మించి సాటిలేని వైభవోపేతమైన వైకుంఠమందిరం సమస్త దివ్య మంగళ లీలా విలాసాలతో పరమసుందరంగా వుంది. 229. ఇంకా ధారాధర రాజితో విరాజిల్లే తారాపథంలాగా తేజరిల్లుతున్న ఆ దివ్యమందిరంలో. 230. విష్ణు పరిచారకులు సునందుడు, నందుడు, అర్హణుడు, ప్రబలుడు మొదలైనవారు భగవానుని భక్తితో భజిస్తున్నారు.. వాళ్ళు నల్లకలువల్లాగా నీలమై నిగనిగలాడే శరీరాలతో నివ్వటిల్లుతున్నారు.. పచ్చని కొంగ్రొత్త వస్త్రములను కట్టుకొన్నారు.. తెల్లతామర రేకుల వంటి కన్నులతో శోభిల్లుతున్నారు.. వారివి సుతిమెత్తని దేహాలు, వాళ్లు ధగధగలాడే రత్నాభరణాలు, కంఠహారాలు, కంకణాలు, ముత్యాల సరాలు, భుజకీర్తులు, అందెలు ధరించి మాసిపోని యౌవనంతో భాసిస్తున్నారు.. పవిత్ర ప్రవర్తన కలిగి వున్నారు.

అందరూ హరిరూపాలు ధరించి జాజ్వల్యమానంగా వెలుగొందుతున్నారు.. వారు వైడూర్యాలు, పగడాలు, తామర తూండ్లతో సమానమైన శరీరాలు కలిగి వున్నారు.. వారు అందరు భక్తితో శ్రీమన్నారాయణుని భజిస్తున్నారు. 231. ఆ భగవంతుని కోమల పాదపద్మాలనుండే సమస్త పాపాలనూ కడిగివేసే గంగానది ఉద్భవించింది.. తన కడగంటి చూపుతో కలుములన్నీ ప్రసాదింపగల శ్రీమహాలక్ష్మి ఆయన వక్షఃస్థలం లోనే నివసిస్తున్నది.. ఆయన సూర్యచంద్రులనే సుందరమైన కన్నులు కలవాడు.. ఆ కనులలో కరుణా తరంగాలు పొంగిపొరలుతూ వుంటాయి.. జగత్తును సృష్టించడంలో నిపుణుడైన బ్రహ్మ ఆ భగవంతుని నాభికమలం నుండే జన్మించాడు..

శేషుడే ఆయనకు తల్పం గరుడుడే ఆయనకు వాహనం.. ముక్కోటి దేవతలు, మునులు ఆయనను సేవిస్తుంటారు.. ఆయన సమస్త లోకాలకు తండ్రి.. అలాంటి పరమేశ్వరుణ్ణి బ్రహ్మదేవుడు కన్నులకరవుదీరేటట్లు చూచాడు. 232. చక్కని రూపరేఖావిలాసాలతో చక్కగా ఒప్పి వున్న లక్ష్మీదేవి తన కోమలమైన పాణి పద్మాలతో ప్రాణేశ్వరుని పాదపద్మాలను ఒత్తుతున్నది.. 233. అంతే కాదు. 234.

శ్రీకాంతాతిలకంబు రత్నరుచిరాజిప్రేంఖితస్వర్ణడో
లాకేళిన్ విలసిల్లి తత్కచభరాలంకార స్రగ్గంధలో
భాకీర్ణప్రచరన్మధువ్రత మనోజ్ఞాలోలనాదంబు ల
స్తోకానుస్వర లీల నొప్పఁగ నిజేశున్ వేడ్కతోఁ బాడఁగన్.

శ్రీ మహాలక్ష్మి రత్నకాంతులతో విరాజిల్లే బంగారపు తూగుటూయెలలో ఊగుతూ ఉన్నది.. ఆమె కొప్పులో ముడుచుకొన్న సుమమాలికల సుగంధం మీది ఆశతో గుమిగూడిన తుమ్మెదలు మనోజ్ఞంగా జుమ్మని రొద చేస్తూ విహరిస్తున్నాయి.. ఆ భ్రమర ఝుంకారమే శ్రుతిగా శ్రీదేవి తన పతి శ్రీపతిమీద పాటలు పాడుతుంది.. 235. అలాంటి పరమపదంలో. 236.

. . . . సతతజ్ఞానరమా యశో బల మహైశ్వర్యాది యుక్తున్ జగ
. . . . త్పతి యజ్ఞేశు ననంతు నచ్యుతు దళత్పంకేరుహాక్షున్ శ్రియః
. . . . పతి నాద్యంతవికారదూరుఁ గరుణాపాథోనిధిన్ సాత్వతాం
. . . . పతి వర్ధిష్ణు సహిష్ణు విష్ణు గుణవిభ్రాజిష్ణు రోచిష్ణునిన్.

ఎల్ల వేళల జ్ఞానము, సంపద, కీర్తి, బలము, ఐశ్వర్యము మొదలైన గుణాలతో కూడినవాడు, భువనాలకు ప్రభువు, యజ్ఞానికి అధీశ్వరుడు, తుది, చ్యుతి లేనివాడు, వికసించే పద్మాలవంటి నేత్రాలు కలవాడు, లక్ష్మీవల్లభుడు, మొదలు తుద వికారము లేనివాడు, దయాసముద్రుడు, సాత్వతులకు అధినాథుడు, వృద్ధిశీలుడు, సహనశీలుడు, అంతటా వ్యాపించిన వాడు, కల్యాణగుణాలతో విరాజిల్లేవాడు, కాంతిమంతుడు అయిన శ్రీహరిని బ్రహ్మదేవుడు దర్శించాడు.. 237. చిరునవ్వుల అమృతాన్ని కురిపించే మోము వానిని, తన భక్తులను పాలించు పరమాత్ముని, ఎఱ్ఱ కలువరేకుల వంటి కన్నుల వానిని, పట్టు బట్ట ధరించు వానిని, ముల్లోకాలలో మనోహరమైన వానిని, చరణమంజీరాలు, కిరీటము, చెవికుండలములు మున్నగు

ఆభరణాలు ధరించువానిని, యోగిశ్రేష్ఠులకు ప్రభువైన వానిని, వక్షస్థలమున లక్ష్మి వసించువానిని, కృపాసముద్రుని, చతుర్భుజముల వానిని శ్రీమహావిష్ణువును బ్రహ్మదేవుడు దర్శించాడు. 238. ఇంకా బ్రహ్మదేవునికి సాక్షాత్కరించిన శ్రీమన్నారాయణుడు. వెలకట్టలేని విలువైన రత్నాలు పొదిగిన సింహాసనంపై ఆసీనుడై ఉన్నాడు; కమలాల వంటి కన్నులు కలవాడు; నందుడు, సునందుడు, కుముదుడు మున్నగువారు సేవిస్తున్నారు.

ॐ చతుశ్శక్తులైన 1ప్రకృతి, 2పురుషుడు, 3మహత్తు, 4అహంకారములు; పంచ కర్మేంద్రియములు అనెడి 1చేతులు, 2కాళ్ళు, 3నోరు, 4పాయువు, 5ఉపస్థు; పంచ జ్ఞానేంద్రియములైన 1కన్ను, 2ముక్కు, 3చెవి, 4నాలుక, 5చర్మము; మనస్సు; పంచ మహాభూతాలైన ఆకాశము, అగ్ని, వాయువు, జలము, భూమి; షోడశశక్తులు; పంచతన్మాత్రలు అనే శబ్దము, స్పర్శము, రూపము, రుచి, వాసన వాని పంచ మూల తత్వములు సర్వం చుట్టు పరివేష్టించి ఉన్నవాడు.. తన స్వరూపంతో స్వయంగా కోటి సూర్యుల ప్రకాశంతో వెలిగిపోతున్నవాడు; తనకు తప్ప ఇతరులకు అందరాని స్వభావసిద్ధమైన సమస్త ఐశ్వర్యాలతో అతిశయించి ఉన్నవాడు; సర్వేశ్వరుడు; పరమ పురుషుడు; పురుషోత్తముడు; విజ్ఞానము నందు వసించి ఉండువాడు కనుక నారాయణుడు అని పిలవబడువాడు (నారం విజ్ఞానం తదయ సమాశ్రయో యస్యసః నారాయణః, రిష్యతే క్షీయతే యితరః రిజ్షయే ధాతుః స నభవతీతి నరః అవినాశ్యాత్మాః (వ్యుత్పత్తి)

ॐ ; అట్టి ఆ పద్మాక్షుని దర్శించిన బ్రహ్మదేవుని హృదయము పరమానందముతో తృప్తిచెందింది.. ఆనంద భాష్పాలు ధారలుకట్టి ప్రవహించుటచే చెక్కిళ్ళు తడసి పోయాయి. 239. అలా సాక్షాత్కరించిన ఆ పరమహంసలకు గమ్యస్థానమైన పరమపురుషుని పాదపద్మములకు స్వాయంభువుడైన చతుర్ముఖ బ్రహ్మ తన నాలుగు శిరస్సులు తాకునట్లుగా మ్రొక్కాడు.. అంతట విష్ణుమూర్తి ప్రసన్నుడై. .



బ్రహ్మకు ప్రసన్నుడగుట

240.. తనకుఇష్టుడు, నాభియందుజనించినవాడు, ప్రథమసంతానము, దేవతలందరకు అధిదేవుడు, సమస్తమైనభూతజాలమును సృష్టించెడివాడు, తనఆజ్ఞానువర్తి, సృష్టినంతటిని ధరించువాడగు బ్రహ్మదేవుడు అలా ప్రణామాలు చేయగా శ్రీమహావిష్ణువు పరమసంతోషంతో కూడిన చిరునవ్వులు చిందించే మోముకలవాడయ్యాడు.. అతనిదేహమును చనువుగా హస్తపద్మములతో తాకుతూ, దయ ఉట్టిపడుచుండగా ఇలాచెప్పాడు. 241. "దొంగ మునులు దొంగ తపస్సులు చేస్తుంటే ఎంత కాలానికైనా నేను వారిని అనుగ్రహించను.. ఓ పద్మసంభవ! బ్రహ్మదేవా! గాఢమైన తపస్సమాధి పొంది చక్కటి సృష్టి చేయాలనే సంకల్పంతో వర్తిస్తున్న నిన్ను అనుగ్రహిస్తాను అని బ్రహ్మదేవునికి సాక్షాత్కరించిన హరి అనుగ్రహించాడు. ఓ పరమ పుణ్యుడా, దేవాధిదేవుడనైన నా. పాదదర్శనం పొందావు.

నీ విపత్తి ఆపత్తులు సర్వం తొలగిపోతాయి.. జ్ఞానానికి హృదయానికి ప్రతీకయైన పద్మమునందు ఉద్భవించిన బ్రహ్మదేవుడ! నీకు శుభమగు గాక.. నీవు కోరిన వరం ఇస్తాను కోరుకో అన్నాడు విష్ణుమూర్తి.. 243. ఓ కమలసంభవుడ! నీ యెడల ప్రసన్నుడను అయ్యాను కనుక నీకు వైకుంఠ దర్శనం అనుగ్రహించాను.. అదంతా అహేతుకమైన నా కృపా కటాక్షము మాత్రమే.. అంతే తప్ప నువ్వు చేసిన తపోప్రభావం వల్ల కాదు అని తెలుసుకో.. అవును, నీ తపస్సంతా నా అనుగ్రహభాషణల కోసమే కదయ్యా బ్రహ్మదేవా! అంటు హరి అనుగ్రహ భాషణ చేస్తున్నాడు. 244.

తప మనఁగ మత్స్వరూపము
తపమను తరువునకు ఫలవితానము నే నా
తపముననే జననస్థి
త్యుపసంహరణము లొనర్చుచుండుదుఁ దనయా!

పుత్రా! బ్రహ్మదేవ! తపస్సు అంటేనే నా స్వరూపం.. తపస్సు అనే వృక్షానికి ఫలాన్ని నేనే.. ఆ తపస్సు చేతనే సృష్టి స్థితి లయలు సర్వం నిర్వహిస్తుంటాను.. అని బ్రహ్మ దేవునికి తపస్సు. రహస్యాన్ని నారాయణుడు వెలిబుచ్చాడు.. 245. "ఓ పద్మగర్భుడ! నీ మనసులో నా భక్తికి తపస్సు ఎలా మూలాధారమో గ్రహించి, ఈ విధంగా గాఢమైన తపస్సు చేసావు.. కనుక ఇంక నీవు మోహ కర్మల నుండి ముక్తుడవు అయ్యావు".. అని సాక్షాత్కరించిన నారాయణుడు అనుగ్రహించాడు. 246. ఆలా అనుగ్రహించిన విష్ణుమూర్తి ఇలా అన్నాడు.. ఓ పద్మభవ! నీ మనో వాంఛితం ఏదైనా సరే, కోరుకో.. కోరిన కోరిక తీరుస్తాను.. అంతట బ్రహ్మదేవుని ముఖము సంతోషంతో వికసించింది.. 247. నారాయణుని భాషణములు వినిన బ్రహ్మదేవుడు ఓ పరమపదానికి ప్రభువా! పరమయోగులు నిన్నుచేరాలని నిత్యం కోరుకుంటారు.. దేవాధిదేవ! ఈ సమస్తలోకమందు నీకు తెలియని విషయం ఒక్కటైనా లేదు కదా.. అయినప్పటికి నా మనసులో మెదలిన కోరికను వినిపిస్తాను కృపాదృష్టితో అనుగ్రహించు అని విన్నవించుకుంటున్నాడు.

248. దేవా! నీవు సకల భూతాల అంతరాత్మవై ఉండేవాడవు, భగవంతుడవు.. నీకు నమస్కరించి నా కోరిక విన్నవించుతాను.. అనుగ్రహించు.. అవ్యక్త స్వరూపాలలో ప్రకాశించే నీ. స్థూల సూక్ష్మ రూపాలను; సకల శక్తులతో కూడిన బ్రహ్మదేవుడు మున్నగు రూపములును సమస్తం సృష్టి స్థితి లయములను సాలె పురుగు గూడు అల్లినట్లు నీ అంతట నీవే ధరించి నిర్వహిస్తుంటావు.. అమోఘ స్వసంకల్పశక్తితో లీలావిభూతితో క్రీడిస్తుంటావు.. అట్టి నీ మహిమను నాకు విశదీకరించు.. నీ ఆజ్ఞానువర్తిని అయి జగత్తు నిర్మించే సమయంలో బ్రహ్మదేవుడను అనే మోహం అహంకారం తప్పక జనిస్తాయి కదా.. దానికి పరిహారం అనుగ్రహించ మని వేడుకుంటున్నాను.. నన్ను కృపాదృష్టితో కటాక్షించి అనుగ్రహించు"అని బ్రహ్మదేవుడు ప్రార్థించాడు.. అది విన్న పద్మాక్షుడు ఇలా చెప్పసాగాడు. 249. "నారాయణుడు కటాక్షించి తెలుపుతున్నాడు.. ఓ పద్మసంభవ! బ్రహ్మదేవుడ!

★ నీ మనస్సులో శాస్త్రాలను చర్చించుకొని అర్థం చేసికొనుట,★ భక్తి,★ చక్కగా యదార్థ స్థితిని తెలిసికొనుట అనే ఈ మూడింటిని బాగా నిలుపుకో వలెను.. 250. ఓ పద్మజుడ! బ్రహ్మదేవుడ! తెలిసికొంటే, నా. స్వరూప, స్వభావములు, మహిమలు, అవతారాలు– కృత్యాలు అధ్యయనం చేయవలెను.. దానితో నా దయవలన తత్వవిజ్ఞానము లభించును.. ఈ జగత్తు సృష్టించబడుటకు ముందు నుండి నేను ఒక్కనిగనే (ఏకలుడగనే) ఉన్నాను.. ఏ కర్మబంధాలు నాకంటవు.. స్థూల సూక్ష్మ స్వరూపాలు, కారణభూతమైన ప్రకృతి సమస్తం నా అంశలే.. అవన్నీ నాలో లీనమై ఉంటాయి.. పుత్రా! బ్రహ్మదేవుడ! నాకు ఇతరమైనది ఏదీ లేనే లేదు.. అలాగే సృష్టి జరుగుతుండే కాలంలో వచ్చేవి సర్వం నా స్వరూపమే అని గ్రహించు.. అని విష్ణుదేవుడు వివరించసాగాడు. 251.
ఓ కమలసంభవుడ! బ్రహ్మదేవుడ! కల్పాంతమున వచ్చే ప్రళయకాలంలో కూడ ఆది అంతము లేని విధంగా సంపూర్ణ శాశ్వత మహత్వముతోటి పరమాత్ముడనుగా నేను ప్రకాశిస్తుంటాను అని తెలిసికొనుము.. అని హరి తత్త్వము మరియు బోధించసాగాడు.

# మాయా ప్రకారం

252. అంతేకాకుండ, ఈ జగత్తు సృష్టింపబడిన విధానాలను నువ్వు అడిగావు కదా వివరిస్తాను శ్రద్ధగా విను.. ఆల్చిప్పలలో వెండి ఉన్నట్లు భ్రాంతి కలిగిస్తుందో అదే తరచి చూసినచో లేదని తెలుస్తుంది.. అలాగే ఏద్వైతే లేకుండానే ఉన్నట్లు భ్రాంతి కనబడుతుంటుందో.. సరిగా చూస్తే లేదని తెలుస్తుంది.. దానినే నా మాయగా గ్రహించు.. అంతేగాకుండా లేనిది ఉన్నట్లు కనబడుటకు, ఉన్నది లేనట్లు అనిపించుటకు, ఇద్దరు చంద్రుళ్ళు ఆకాశంలో ఒకరు, కింద నీటిలో ఒకరు ఉన్నట్లు కనబడుటకు, చీకట్లు వ్యాపించినట్లు అనిపించుట నా మాయాప్రభావంతో కలిగెడి భ్రాంతులుగా తెలిసికొనుము.. ఏవిధంగా అయితే ఆకాశం, నిప్పు, వాయువు, నీరు, భూమి, మనస్సు భౌతిక స్వరూపాలు కలిగిన కుండ, బట్ట మున్నగువాని యందు ప్రవేశించి ఉంటాయో.. అదేవిధంగా నేను భూతములు, భౌతికములు సమస్తమునందు జీవులందు ప్రవేశించి కార్య రూపంలో ఉంటాను.. భౌతికమైనవి, భూతములకు కారణ భూతములై ఉంటాయి.. అలాగే సర్వ భూతములు, భౌతికములు కారణ భూతములై నాయందు కనబడలేవు.. సర్వప్రదేశములలో సర్వకాలములలో

ఏద్దైతే తెలియబడుతుంటుందో అదే బ్రహ్మస్వరూపం.. నీవంటి తత్త్వ జిజ్ఞాసువులకు నీకు చెప్పబడినదే సత్యం అని తెలియుము.. ఇదే సర్వోత్కృష్ట మయినది.. కనుక ఏకాగ్ర దృష్టితో వినుము.. నీ మనస్సులో పదిలముగ నిలుపుకొనుము.. నీకు సృష్టించుట మున్నగు కార్యములలో మోహం కలుగ కుండ ఉంటుంది".. అని వైకుంఠుడు చతుర్ముఖ బ్రహ్మకు వివరించి వైకుంఠంతో సహా అంతర్ధానం అయ్యాడు. "

ఈ విధంగా శుకముని పరీక్షిత్తు మహారాజుకి వివరించి ఇంకా చెప్ప సాగాడు.. 253. ఓ పరీక్షిన్మహారాజా! ఆ విధంగా మాయమైపోయిన పద్మాక్షుడు శ్రీమన్నారాయణ మూర్తిని హృదయంలో నిలుపుకొని ఆనందాన్ని పొందాడు.. చేతులు జోడించి నమస్కరించాడు.. ఆయన అనుగ్రహాన్ని తలచుకుంటూ ఇదివరకులాగే సమస్త ప్రపంచాన్ని చక్కగా సృష్టించసాగాడు.. తరువాత ప్రజాపతి అయిన బ్రహ్మదేవుడు సర్వలోకాలకు మేలు ఒనగూర్చుటకై గొప్ప ధర్మప్రవర్తకునిగా పూజితములైన యమనియమాలను రెంటినీ సంతోషచిత్తుడై ఆచరించాడు. 254. అలా బ్రహ్మదేవుడు తపస్సు చేసెడి సమయంలో.. 255.. కమలజుడైన బ్రహ్మదేవుని దగ్గరకి తనకు ప్రియపుత్రుడు, సనకసనందాదులకు అన్నగారైన నారదమహర్షి వచ్చాడు. 256. అలా వచ్చిన నారదమహర్షి తండ్రి యైన బ్రహ్మదేవునికి శుశ్రూషలు చేసి, ప్రసన్ను డగుట గమనించి భగవంతుని మాయను వివరంగా తెలుపమని కుతూహలంగా అడిగాడు.

## భాగవత దశలక్షణములు

257. ఓ పరీక్షిన్మహారాజ! నువ్వు నన్ను ఎలా అడిగావో, అదేవిధంగా పూర్వం నారదమహర్షి తన తండ్రి బ్రహ్మదేవుని అడిగాడు.. అంతట ఆ చతుర్ముఖబ్రహ్మ తనకు విష్ణుమూర్తి దయతలచి తెలియజేసిన లోకకల్యాణకరమైన నాలుగు శ్లోకాల రూపంలో, పది లక్షణాలు కలిగిన భాగవతాన్ని నారదునికి చెప్పాడు.. ఒకనాడు సరస్వతీ తీరంలో పరమ హరిభక్తుడు, గొప్ప ఆత్మజ్ఞాని, బహుళ తేజశ్శాలి అయిన వేదవ్యాసునికి నారదమహర్షి తెలియజెప్పాడు.. వ్యాసుల వారు నాకు చెప్పారు.. నేను నీకు చెప్తాను.. శ్రద్ధగా విను.. అని శుకబ్రహ్మ పరీక్షిత్తునకు తెలిపి ఇంకా ఇలా చెప్పసాగాడు. 258. పరీక్షిత్తు! విష్ణుమాయ గురించే కాకుండ, విరాట్పురుషుని నుండి ఈ లోకాలు అన్నీ ఎలా సృష్టింప బడ్డాయి మొదలైన ప్రశ్నలు అడిగావు కదా..

వాటన్నిటికి సమాధానంగా శ్రీమద్భాగవతమును చెప్తాను.. శ్రద్ధగా విను.. అది నాలుగు శ్లోకాల రూపంలో సంగ్రహంగా ఉంటుంది.. ఆ దశలక్షణాలు ఏవంటే

1) సర్గము 2) విసర్గము 3) స్థానము (స్థితి) 4)పోషణము (వృద్ధి) 5)ఊతులు 6)మన్వంతరాలు 7) ఈశానుచరితములు 8) నిరోధము 9) ముక్తి 10) ఆశ్రయం. ఈ పదిలక్షణాలు వివరించబడతాయి.

259. ఓ పరీక్షిన్మహారాజ!
★మహత్తు, ★ అహంకారం,
★ పంచ తన్మాత్రలు అను శబ్దము, స్పర్శము, రూపము, రుచి, వాసన
★పంచభూతములు అనెడి ఆకాశము, వాయువు, అగ్ని, నీరు, భూమి
★పంచేంద్రియాలు కన్ను, ముక్కు, చెవి, నాలుక, చర్మము అయిదు, విరాట్పురుషుని నుండి సృష్టింపబడుట సర్గము అంటారు.

260. ఓ భరత వంశ మహారాజ! పరీక్షిత్తు! బ్రహ్మదేవుడు నారాయణుని నాభి పద్మము నుండి జనించి, బహు విస్తారమైన ఈ చరాచర జగత్తు సమస్తమును క్రమముగ సృజించుటను విసర్గము అంటారు. 261. ఓ రాజా పరీక్షిత్తు! లోకద్రోహులైన రాజులను సంహరించి లోకాలను సంరక్షించుటలోని ఆ వైకుంఠుని విజయాలను స్థానము అంటారు.. ఈ స్థానమనే విష్ణు మహిమ కల్పాది నుండి కల్పాంతాలవరకు సాగుతూనే ఉంటుంది. 262. రాజ్యంలోని ప్రజలను పోషిస్తుండే పరీక్షిన్మహారాజా! ఇక పోషణ అంటే విశ్వేశ్వరుడు, శాశ్వతుడు, సాటిలేని శుభమూర్తి, పాపాలను హరించువాడు అయిన విష్ణుభగవానుడు తన భక్తు లను ఉద్ధరించుట, పోషించుట.. మరి జీవుల జన్మజన్మలకైన విడువని కర్మల వాసనలను ఊతులు అంటారు. 263. నరవరేణ్య పరీక్షిత్తు! పద్మనాభుడు, విష్ణు మూర్తి కటాక్షవీక్షణలతో అనుగ్రహ ప్రసాదంతో సర్వలోకాధిపతులు అధికారాన్ని అందుకోగలుగుతారు.. అలా హరి అనుగ్రహ ప్రసారంతో లోకపాలనాది మహా వైభవములు, మహత్వములు విస్తరించుటను మన్వంతరములు అంటారు. 264. ఓ సజ్జనచంద్ర పరీక్షిత్తు! ఆ శ్రీహరి అనంతపద్మనాభుని. అతని భక్తగణముల. కథలు చెప్పుతుండేవాటిని ఈశానుకథలు అంటారు. 265.

ఓ పరీక్షిత్తు భూపతి! సర్వేశ్వరుడు, గోవిందుడు, చిదచిదానంద స్వరూపుడు నారాయణుడు.. ఆయన స్వయంభూతుడు ఇతరేతర ఉపాధులు లేక ఉండగలవాడు.. కల్పాంతమున శ్రీమన్నారాయణుడు తన స్వస్థానమైన పాలసముద్రమున ఆదిశేషుని పాన్పుగా చేసికొని సుఖంగా యోగనిద్రా ముద్రలో ఆనందిస్తూ వసించి ఉంటాడు.. ఆ సమయంలో జీవకోటి సమస్తము తమ తేజస్సులు నశించి నిర్వ్యాపారులై ఆయనలో లయమైపోతాయి. ఆ అవస్థా విశేషములు తెలుపునది నిరోధము అంటారు.. దీనికే అవాంతర ప్రళయము అని పేరుపడింది.. ఇక ముక్తి అంటే ఏమిటో తెలుసు కుందాం..

266. మానవుడు జన్మజన్మాంతరాలలో తన దేహధర్మాలను పాటిస్తూ అనేక పాపపుణ్య కర్మలు చేసి ఫలితాలు అనుభవి స్తుంటాడు.. జనన జరామరణాదుల చక్రంలో పడి కొట్టుకుంటుంటాడు.. ఈ అనంత పాప పుణ్యచయాలనుండి భగవత్ కృపతో కూడిన బహుళసాధనల వలన విడివడతాడు.. భగవంతుని అష్టైశ్వార్యాలతో కూడి ఆ పరాత్పరుని సామీప్యం, సాయుజ్యం సంపాదించు కొని, సాక్షాత్భగవ స్వరూపం పొందుతాడు.. ఆయా దివ్యమైన మాలలు, మైపూతలు మున్నగు వైభోగములన్నీ పొందుతాడు.. ఇలా శోభనకర విశిష్ఠ దివ్యదేహంతో హరిస్వరూపం పొందుటను ముక్తి అంటారు.

## నారాయణుని వైభవం

267. ఇక, ఈ సృష్టి స్థితి లయాలు సర్వం దేనియందు ప్రకాశించే దానిని “ఆశ్రయం” అంటారు.. అదే “పరమాత్మ”, “పరబ్రహ్మ” అను పేరులతో కూడ పిలువబడుతుంది.. ఇది సమస్తము నందు ఉంటూ సమస్తమునకు పరమై ఉండెడిది.. దానిని ప్రత్యక్ష అనుభవంగా తెలుపుటకు, అది ఏకమైనను ఆత్మ సంబంధ ఆధ్యాత్మికము మున్నగు విభాగాలుగా చెప్తుంటారు..

అవి ఏవనగా, ఆధ్యాత్మికము, అధిదైవకము, ఆది భౌతికము అని మూడు విధాలు..

నేత్రం మున్నగు గోళకాల యందు తెలియబడుతుండేవి “ఆధ్యాత్మికం”.. నేత్రాది ఇంద్రియాభిమానం కలిగి ద్రష్ట అవుతున్న జీవుడే “ఆధిదైవికుడు”.. నేత్రాదులైన అధిష్ఠానములలో అభిమానం కలదేవతయై సూర్యాది తేజస్సులే శరీరంగా కలవాడైన యెవనిలో ఆధ్యాత్మిక, ఆధిదైవికాలు అనే ఈ రెండు విభాగాలు సంభవిస్తాయో అతడే

"ఆధిభౌతికుడు", "విరాట్స్వరూపుడు" కూడ అవుతున్నారు.. అందుచేత "చూసేవాడు".. "చూసే సాధనము", "చూడదగినది" అనబడే ఈ మూడింటిలో ఏ ఒక్కటి లేకున్నా, మరొకటి కనిపించదు.. "త్రిపుటి" అనబడే ఈ మూడింటిని ఎవరు తెలుసుకుంటారో, అతడే సర్వలోకాలకు "ఆశ్రయు"డై ఉంటాడు.. "పరమాత్మ" కూడ అతడే.. వినోదం కొరకు జగత్తును సృష్టించాలి అనే తలంపు ఆ మహాత్ముడికి కలిగింది.. ఆ సంకల్పంతో ఆయన బ్రహ్మాండాన్ని నిర్భేదించారు.. తనకు సుఖస్థానాన్ని కోరి మొదట పవిత్రమైన నీళ్లను సృష్టించారు.. ఆయన సహజంగా పరిశుద్ధుడు.. అందువల్ల తాను సృష్టించిన అపార పారావారం లో నున్న జలరాశిలో శయనించాడు.. అందుచేతనే,

ఆపో "నారా" ఇతి ప్రోక్తా – ఆపోవై నరసూనవః,
తా యదస్యాయనమ్మం పూర్వం – తేన "నారాయణః" స్మృత

(నరుడనే నామాంతరం కల భగవంతుడు జలాలను సృష్టించాడు.. అందుకే నీళ్లకు నారములు అని పేరు.. అట్టి నారములు స్థానముగా కలిగి ఉండుటచేత ఆయనకు నారాయణ అనే పేరు వచ్చింది. ) ఈ ప్రమాణాన్ని అనుసరించి ఆయన నారాయణ శబ్దవాచ్యుడు అవుతున్నారు.. అటువంటి ఆయన ప్రభావం వర్ణించటం అసాధ్యం.. ఉపాధాన కారణమైన ద్రవ్యం "సంచితం", "ప్రారబ్దం", "ఆగామి" అనే మూడు విధాలైన "కర్మము", "కళ", "కాష్ఠ" మున్నగు ఉపాధులచే భిన్నమైన "కాలము", జ్ఞానము మొదలైన జీవుని "స్వభావము", అనుభవించే "జీవుడు", ఇవన్నీ ఆయన అనుగ్రహం వల్ల ఉనికి కలిగి ఉన్నాయి.. ఆయన ఉపేక్షిస్తే వాటికి ఉనికి లేదు. అట్టి మహిమ కలవాడు. సర్వేశ్వరుడు.. తాను మొదట ఒకడు అయినా ఆ పరమాత్ముడు దేవ మనుష్యాది రూపాలతో అనేకం కావాలని సంకల్పించాడు.. స్వాత్మానుభవ రూపమైన యోగశయనంలో మేలుకొని ఉండి తన సంకల్పంతో హిరణ్మయమైన తన శరీరాన్నే అధిదైవతం, ఆధ్యాత్మికం, ఆదిభూతం అనే పేర్లతో మూడు విధాలుగా సృష్టించాడు.

శ్రీహరి నిత్యవిభూతి

268. అట్టి విరాడ్విగ్రహాంత రాకాశంబు –
వలన నోజస్సహోబలము లయ్యెఁ

బ్రాణంబు సూక్ష్మరూపక్రియాశక్తిచే–
　　జనియించి ముఖ్యాసు వనఁగఁ బరఁగె
వెలువడి చను జీవి వెనుకొని ప్రాణముల్–
　　చనుచుండు నిజనాథు ననుసరించు
భటుల చందంబునఁ బాటిల్లు క్షుత్తును–
　　భూరి తృష్ణయు మఱి ముఖమువలనఁ
దాలు జిహ్వాదికంబు లుద్భవము నొందె
నందు నుదయించె నానావిధైక రసము
లెనయ నవి యెల్ల జిహ్వచే నెఱుఁగఁబడును
మొనసి పలుక నపేక్షించు ముఖము వలన.

ఇలాంటి విరాట్పురుషుని శరీరం లోపలి ఆకాశం నుండి ప్రవృత్తి సామర్థ్య రూప మైన ఓజస్సు.. వేగసామర్థ్యం, బలం అనే ధర్మాలు కలిగాయి.. సూక్ష్మ రూపమైన క్రియాశక్తి వల్ల ప్రాణం పుట్టింది.. అది సమస్త ప్రాణులకు ముఖ్యమైనది.. యజమాని ననుసరించు సేవకులలాగ ప్రాణాలు జీవి ననుసరించి వెడలి పోతుంటాయి.. విరాట్పురుషునకు జఠరాగ్ని దీపించగానే ఆకలిదప్పులు ఏర్పడ్డాయి.. ముఖం నుండి దవుడలు, నాలుక మొదలైనవి పుట్టాయి. అందుండే ఆరు విధాలైన రసాలు జనించాయి.. ఆ రసభేదాలన్నీ నాలుకతోనే గ్రహింపబడుతున్నాయి.. ముఖం సంభాషించాలని భావించింది. 269. ముఖం నుండి వాక్కు అనే ఇంద్రియం పుట్టింది.. దానికి అగ్ని అధిష్ఠానదేవత.. వాగింద్రియం నుండి, అగ్నినుండి సంభాషణం పుట్టింది.. జగత్తంతా జలవ్యాప్తం కావటం వల్ల అగ్నికి జలం వల్ల నిరోధం కల్గింది.. అందువల్ల అగ్నికి జలమే ప్రతిబంధక మయింది.. మిక్కిలిగా చలించే మహా వాయువు నుండి ఘ్రాణం పుట్టింది.. దానికి వాయువు అధిదేవత.. ఆ ఘ్రాణేంద్రియం గంధాన్ని గ్రహించే నేర్పుగల దయింది.. విరాట్పురుషుడు కంటికి కనిపించని ఆత్మను తనలో చూడగోరాడు.. అప్పుడు సూర్యుడు దేవతగా కలిసి, రూపం గ్రహించే నేత్రాలు రెండు తేజస్సు నుండి పుట్టాయి.

మునులందరు భగవంతుని ప్రార్థించగా ఆయన దిక్కులు దేవతగా కలిగి, శబ్దాన్ని గ్రహించే శ్రోత్రింద్రియాన్ని ఉద్భవింపజేసాడు.. సృష్టికర్తయైన పురుషుని నుండి త్వగింద్రియానికి అధిష్ఠానమైన చర్మం పుట్టింది.. ఆ చర్మం ఆయా వస్తువులలోని

మార్ధవాన్ని, కాఠిన్యాన్ని, తేలికదనాన్ని, బరువును, వేడిమిని, చల్లదనాన్ని గ్రహిస్తుంది.. చర్మమునుండి వెంట్రుకలు పుట్టాయి.. వాటికి చెట్లు అధిదేవత లయ్యాయి.. త్వగింద్రియాన్ని అధిష్టించినవాడు, స్పర్శ మనే గుణం కలవాడు, లోపలా బయట వ్యాపించిన వాడైన వాయువు నుండి హస్తాలు పుట్టాయి.. అవి బలం కలవి, వస్తుగ్రహణంలో నేర్పు కలవి, అనేక పనులు చేయగలవి.. వాటికి ఇంద్రుడు అధిదేవత.. తనకు ఇచ్చవచ్చిన చోటికి పోయే సామర్థ్యంకల ఈశ్వరుని నుండి పాదాలు పుట్టాయి. వాటికి విష్ణువు అధిదేవత. ప్రజానంద మనే అమృతాన్ని కాంక్షించి, భగవంతుని నుండి పురుషాంగం, ఉపస్థ జనించాయి.. వాటికి అధిదేవత ప్రజాపతి. స్త్రీసంభోగం పంటివి వాటి పనులు.. మిత్రుడు అధిదేవతగా గల “పాయువు” అనే ఇంద్రియాన్ని “గుదం” అంటారు.. అది భుక్త పదార్థాలలోని నిస్సారమైన అంశాన్ని, యోగసాధనలోవిడిచే మలమును త్యజించటానికి సాధన మవుతుంది. స్థూల సూక్ష్మ, ఉభయ మలాలను వర్జిస్తుంది.

ఒక శరీరాన్ని వదలి మరొక శరీరం ధరింపగోరి నప్పుడు, మొదటి శరీరం వదల టానికి సాధనంగా “బొడ్డు” అనే ద్వారం పుట్టింది.. ప్రాణం, అపానం బంధింప బడే స్థానం అదే.. ఆ బంధం విడిపోవడమే మృత్యువు.. పై శరీరాన్ని, క్రింద శరీరాన్ని వేరుచేసేది కూడ ఆ నాభి స్థానమే.. ఆహార పానీయాదులను ధరించ డానికి పేగులు, పొట్ట, నాడీ సమూహము కల్పితము లైనాయి.. వాటికి నదులు, సముద్రాలు అధిదేవతలు. వాటివల్ల తుష్టి, పుష్టి అనే ఉదరాన్ని భరించే రస పరిణామాలు కలిగాయి.

ఆ విరాట్పురుషుడు తన మాయను ధ్యానించేటప్పుడు కామానికి, సంకల్పాదులకు స్థానమైన హృదయం పుట్టింది.. ఆ హృదయం నుండి మనస్సు, చంద్రుడు, కాముడు, సంకల్పము పుట్టాయి.. అటుపిమ్మట జగత్తును సృష్టించే విరాట్పురుషుని శరీరంలో త్వక్కు, చర్మం, మాంసం, రక్తం, మేధస్సు, మజ్జ, ఎముకలు అనే సప్తధాతువులు, పృథివి, జల, తేజో రూపాలైన ఏడు ప్రాణాలు, ఆకాశ జల వాయువుల నుండి జనించిన గుణరూపాలైన ఇంద్రియాలు, అహంకారాన్ని కలిగించే గుణాలు, అన్ని వికారాలు స్వరూపంగా కల మనస్సు, విజ్ఞాన రూపమైన బుద్ధి జనించాయి.. ఇదంతా ఆ సర్వేశ్వరుని స్థూలశరీరమే.. ఇంతేకాదు. 270.

ఆ స్థూలవిగ్రహం క్రమంగా పృథివి, జలం, తేజం, వాయువు, గగనం, అహంకారం, మహత్త్వం, అవ్యక్తం అనే ఎనిమిది ఆవరణాలలో వ్యాప్తమై ఉంది.. గొప్ప వైభవంతో

బ్రహ్మాండాన్ని మించినదై అత్యుజ్జ్వలంగా ప్రకాశిస్తున్నది. 271. విరాట్పురుషుని సూక్ష్మరూపం విలక్షణమైనది.. దానికి మొదలు తుది లేవు.. అది నిత్యమైనది, సూక్ష్మమైనది.. ఆలోచించి చూసిన మనస్సుకు, వాక్కుకు గోచరం కానిది.. 272..

మహారాజా! మహాతేజస్సుతో నిండిన భగవత్స్వరూపాన్ని గూర్చి నే నిప్పుడు వివరిస్తాను.. స్థూలమని, సూక్ష్మమని రెండు రూపాలతో విలసిల్లే ఆ భగవదాకారాన్ని ఆ పరమాత్ముని మాయాప్రభావంవల్ల దివ్య తేజోధనులైన మునులు కూడ తెలిసికొన లేకున్నారు. వాచ్యమై, వాచకమై, నామరూపక్రియలు దాల్చిన ఈశ్వరుడు సమస్త లోకాలకు నియామకుడై ఉన్నాడు.. చిన్మయ స్వరూపుడైన. శ్రీమన్నారాయణుడు ప్రజా పతులను, ఋషులను.. పితృదేవతలను ప్రీతితో సృష్టిస్తున్నాడు. 273. ఇంకా విను.

274. సుర, సిద్ధ, సాధ్య, కిన్నర, వర చారణ, –
గరుడ, గంధర్వ, రాక్షస, పిశాచ,
భూత, బేతాళ, కింపురుష, కూశ్మాండ, గు –
..... హ్యక, డాకినీ, యక్ష, యాతుధాన,
విద్యాధరాప్సరో, విషధర, గ్రహ, మాతృ –
గణ, వృక, హరి, ఘృష్టి, ఖగ, మృగాళి,
భల్లూక, రోహిత, పశు, వృక్ష యోనుల –
వివిధ కర్మంబులు వెలయఁ బుట్టి
జల నభో భూ తలంబుల సంచరించు
జంతు చయముల సత్త్వరజస్తమో గు
ణములఁ దిర్యక్సురాసుర నర ధరాది
భావముల భిన్ను లగుదురు పౌరవేంద్ర!

ఓ పురువంశపు రాజోత్తమా! జీవులు తాము చేసిన నానా విధములైన కర్మల్ని అనుసరించి సురలు, సిద్ధులు, సాధ్యులు, కిన్నరులు, చారణులు, గరుడులు, గంధర్వులు, రాక్షసులు, పిశాచాలు, భూతాలు, బేతాళాలు, కింపురుషులు, కూశ్మాండులు, గుహ్యకులు, డాకినులు, యక్షులు, యాతుధానులు, విద్యాధరులు, అచ్చరలు, నాగులు, గ్రహాలు, మాతృగణాలు, తోడేళ్ళు, సింహాలు, సూకరాలు, పక్షులు, మృగాలు, ఎలుగుబంట్లు, చేపలు, పశువులు, చెట్లు మున్నగు బహు

జాతులలో పుట్టి నీటిలో, నింగిలో, నేలమీద సంచరిస్తారు.. సత్త్వగుణ, రజోగుణ, తమోగుణాలు కలిగి ఉంటారు.. ఈ ప్రాణిజాలమంతా తిర్యక్కులు, సురలు, అసురులు, నరులు, గిరులు ఇలా విభిన్న రూపాలతో ఉంటుంది.. 275. లక్ష్మీకాంతుడు చతుర్ముఖుడై జగత్తును సృష్టిస్తాడు.. విష్ణు స్వరూపుడై దానిని రక్షిస్తాడు.. సంహార సమయంలో హరునికి అంతర్యామిగా ఉంటూ, వాయువు మబ్బులను హరించినట్లే సమస్త విశ్వాన్ని సంహరిస్తాడు. 276. ఈ విధంగా దేవుడు ధర్మస్వరూపుడై తానే పశుపక్ష్యాదులు, నరులు, సురలు మున్నగు సమస్త రూపాలు ధరిస్తాడు.. తానే ఈ విశ్వాన్ని సృష్టిస్తాడు, పోషిస్తాడు, సంహరిస్తాడు.

277. హరి యందు నాకాశ; మాకాశమున వాయు–
వనిలంబువలన హుతాశనుండు;
హవ్యవాహను నందు నంబువు; లుదకంబు–
వలన వసుంధర గలిగె; ధాత్రి
వలన బహుప్రజావళి యుద్భవం బయ్యె–
నింతకు మూలమై యెసఁగునట్టి
నారాయణుఁడు చిదానంద స్వరూపకుం,–
డవ్యయుం, డజుఁడు, ననంతుఁ, డాఢ్యుఁ,
డాదిమధ్యాంతశూన్యుం, డనాదినిధనుఁ,
డతని వలనను సంభూత మైన యట్టి
సృష్టి హేతు ప్రకార మీక్షించి తెలియఁ
జాల రెంతటి మునులైన జనవరేణ్య!

శ్రీహరినుండి ఆకాశం పుట్టింది.. ఆకాశం నుండి వాయువు పుట్టింది.. వాయువు నుండి అగ్ని, అగ్ని నుండి నీరు పుట్టాయి.. నీటి నుండి భూమి పుట్టింది.. భూమి నుండి నానావిధ జీవజాలము పుట్టింది.. దీనంతటికి మూలమై ప్రకాశించేవాడు ఆ నారాయణుడే.. ఆయన జ్ఞానానంద స్వరూపుడు, అవ్యయుడు, పుట్టుకలేని వాడు, అంతంలేనివాడు, ప్రభువు, ఆదిమధ్యాంత రహితుడు, జనన మరణాలు లేనివాడు.. ఆయననుండి జనించిన ఈ సృష్టికి హేతువేమిటో, దాని స్వరూప మెలాంటిదో ఎంత పరీక్షించినా ఎంతటి మునీశ్వరులైనా తెలుసుకో లేకున్నారు.. 278. అంతేకాకుండా. 279. ఓ భూపాలకోత్తమ! ఈ విధంగా ప్రాణులను సృష్టించి, రక్షిస్తున్న ఆ శ్రీహరి

తనకు కర్తృత్వం అంగీకరించడు.. దానినంతా తన మాయకే ఆరోపిస్తాడు.. తాను నిరవద్యుడు, నిరంజనుడు, నిష్కించనుడు, నిరపేక్షుడు, నిష్కళంకుడు, పరుడు, ఆద్యుడు అయిన వాడై శాశ్వతత్వాన్ని పొందుతాడు.. 280. పరబ్రహ్మకు సంబంధించిన ఈ కల్ప స్వరూపాన్ని అవాంతర కల్పంతో సహా సంగ్రహంగా చెప్పాను. ఇలాంటి ప్రాకృతాలు, వైకృతాలైన కల్పాల విధానాలు, వాటి పరిమాణాలు, కాల లక్షణాలు, కల్పాల లక్షణాలు, అవాంతర కల్పాలు, మన్వంతరాలు మొదలైన వాని భేదాలు, విభాగాలు విపులంగా వివరిస్తాను, వినుము.. దాన్ని "పద్మకల్ప" మని కూడ అంటారు.. అని భగవంతుడైన శుకయోగి పరీక్షిత్తునకు చెప్పినట్లు సూతుడు శౌనకాది మహర్షులకు వెల్లడించాడు.

శౌనకుడు సూతు నడుగుట

281. భాగవతలక్షణాలు, ప్రళయాది వివరాలు అన్ని తెలియచెప్పగా విని శౌనకుడు ఇలా అడగసాగాడు.. "ఓ సూతమహర్షి! నీవు దయామయుడవు.. సజ్జనులచే పొగడదగ్గ సుగుణాలు అనేకం కలవాడవు.. సర్వ పాపములను విడిచిన వాడవు.. అని ఇంకా ఇలా అడుగసాగాడు. 282. శౌనకుడు సూతునితో పుణ్యాత్మా! మహా పుణ్యతీర్థములు సర్వలోకములందును పవిత్రము చేయగలవి.. పరమ భాగవత శ్రేష్ఠుడైన విదురుడు బంధువులను, మిత్రులను, అందరిని విడిచిపెట్టి లెక్కకు మించినట్టి పుణ్యతీర్థములను దర్శించాడు.. తిరిగి స్వస్థానానికి వస్తూ కుషారవుని కుమారుడగు మైత్రేయుని దర్శించాడు.. అతని వలన ఆధ్యాత్మికాది జ్ఞానము అపారంగా తెలిసికొన్నాడు అంటారు కదా.. అదంతా మాకు వివరంగా చెప్పు అని అడిగాడు.. అంతట సూతుడు శౌనకాది మునులకు ఇలా చెప్పసాగాడు. 283. "ఆధ్యాత్మికాది జ్ఞానవిషయమై శౌనకాది మునులారా!. ఇప్పుడు మీరు అడిగినట్లే పూర్వం పరీక్షిత్తు అడుగగా శుకమహర్షి వివరించాడు.. అదంతా మీకు చక్కగా తెలియజెప్తాను"అని సూతుడు చెప్ప



సాగాడు.. 284.. శౌనకాది మునులారా! అలా శుకముని పరీక్షిన్మహారాజుకి చెప్పిన విషయం చెప్పబోతున్నాను శ్రద్ధగా వినండి. "అని సూతమహర్షిచెప్పసాగాడు..

పూర్ణి

285.. రామ! గుణాభిరామ! దినరాజకులాంబుధిసోమ! తోయద
... శ్యామ! దశాననప్రబలసైన్యవిరామ! సురారిగోత్రసు
... త్రామ! సుబాహుబాహుబలదర్ప తమఃపటుతీవ్రధామ! ని
... ష్కామ! కుభృల్లలామ! కఌకంఠసతీనుతనామ! రాఘవా!

ఓ శ్రీరామచంద్ర! నీవు కల్యాణగుణాలచే సుందరుడవు.. సూర్యవంశమనే సముద్రానికి చంద్రుడవు.. నీలమేఘశ్యాముడవు.. రావణాసురుని భీకర సైన్యాన్ని అంతమొందించిన వాడవు.. రాక్షసులనే పర్వతాల పాలిటి వజ్రాయుధధారియైన ఇంద్రుడవు.. సుబాహుని బాహుబల గర్వం అనే చీకటి పాలిటి తీక్షణ కిరణాల సూర్యుడవు.. కాంక్షలు లేనివాడవు.. అవనీపతులలో అగ్రగణ్యుడవు.. పరమశివుని భార్య సతీదేవిచే సర్వదా సన్నుతి చేయబడుతుండే నామం గలవాడవు. 286..

అమరేంద్రసుతవిదారణ!
కమలాప్తతనూజరాజ్యకారణ! భవసం
తమసదినేశ్వర! రాజో
త్తమ! దైవతసార్వభౌమ! దశరథరామా!

శ్రీరామచంద్ర ప్రభువా! దశరథ పుత్రుడ! నీవు దేవేంద్రుని కొడుకు, మహాబలశాలి అయిన వాలిని సంJహరించినవాడవు, సాక్షాన్నారాయణుడైన సూర్యభగవానుని పుత్రుడు సుగ్రీవునికి రాజ్యాధికారం దక్కుటకు కారణ భూతుడవు, సూర్యుడు చీకటిని పారదోలునట్లు సంసారమనే తమస్సు సర్వం తొలగించువాడవు, ప్రభువు లందరిలోను మేలైన దివ్యసార్వభౌముడవు. 287.

నిరుపమగుణజాలా! నిర్మలానందలోలా!
దురితఘనసమీరా! దుష్టదైత్యప్రహారా!
శరధిమదవిశోషా! చారుసద్భక్తపోషా!
సరసిజదళనేత్రా! సజ్జనస్తోత్రపాత్రా!

ఓ శ్రీరామచంద్రప్రభు! అనంతగుణసాగరా! నీవు నిర్మలానందసాగరమున ఓలలాడుచుండు వాడవు. వాయువు మేఘలను చెదరగొట్టునట్లు పాపాలను చెదరగొట్టువాడవు.. క్రూరమైన రాక్షసులను ఎందరినో సంహరించినవాడవు,

సాగరునిగర్వం సర్వం పరిహరించినవాడవు,భక్తకోటిని చక్కగా పోషించే వాడవు, కలువరేకులవంటి కన్నులుగలవాడవు,సజ్జనులచే స్తుతింపబడే వాడవు.

288. ఇది పరమేశ్వరుని దయ వలన పొందిన కవితా వైచిత్రి కలిగిన, కేసన మంత్రి కుమారుడు; సహజ సిద్ధంగా అబ్బిన పాండిత్యము కలవాడైన పోతనా మాత్యునిచే చక్కగా రచించబడినదైన శుభకరమైన, గొప్ప భాగవతము అను పురాణము నందలి పరీక్షిన్మహారాజు, శుకయోగి సంభాషించుట; భాగవత పురాణం వైభవము; ఖట్వాంగుడు మోక్షము పొందుట; ధారణా యోగమునకు సంబంధించినదై, విష్ణుమూర్తి పాదాది అవయవాలలో సమస్త లోకాలు ఉన్న విధము; సత్పురుషుల నడవడికలు; మోక్ష వ్యతిరిక్తాలై కోరిన ఫలాలను ఇచ్చు ఇతర దేవతల భజన విశేషాలు; మోక్షం ఇచ్చువాడు విష్ణువే అని చెప్పుట; విష్ణు భజన లేని వారు హేయత్వము పొందుట; పరీక్షిన్మహారాజు ప్రశ్నించుట; శుక యోగి శ్రీహరి స్తోత్రము చేయుట; వాసుదేవుని అనుగ్రహం వలన చతుర్ముఖ బ్రహ్మ; బ్రహ్మ అధికారము పొందుట; శ్రీమహావిష్ణువు వలన బ్రహ్మ, రుద్రుడు మొదలైన లౌకిక ప్రపంచాలు పుట్టుట; శ్రీమన్నారాయణుడు ఎత్తిన అవతార వైభవములు; భాగవత వైభవము; పరీక్షిన్మహారాజు శుక యోగిని అడిగిన ప్రపంచం మొదలైన ప్రశ్నలు; వాటిలో విష్ణుమూర్తి ప్రధానకర్త అని చూపించుట; భగవద్భక్తి వైభవం; బ్రహ్మదేవుడు తపస్సుకు ప్రసన్నుడై. విష్ణువు వైకుంఠంతో సహా ప్రత్యక్షం కాగా స్తోత్రం చేసి అతని అనుగ్రహించే అతని మహిమలను వినుట; విష్ణువు ఆజ్ఞ ప్రకారం బ్రహ్మదేవుడు నారదునికి భాగవత పురాణ దశ లక్షణాలను వివరించుట; నారాయణుని వైభవం; జీవ తత్వాల సృష్టి; శ్రీ మహా విష్ణువు నిత్య విభూతి వర్ణనలు; కల్పముల వివరములు మొదలైన వానిని చెప్పుట; శౌనకుడు, విదుర మైత్రేయ సంవాదం చెప్పమని సూతుని అడుగుట; అను కథలు కలిగిన ద్వితీయ స్కంధము సంపూర్ణము అయినది.

*ఓం నమో భగవతే వాసుదేవాయ!!*
*ఓం! ఓం! ఓం!*
*ఓం! శాంతిః! శాంతిః! శాంతిః!*
*సర్వే జనా స్సుఖినో భవతు!!*

–x–

